మంగళవారం
23-12-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 10, సంచిక : 92
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Hyderabad,Vijayawada, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

మల్టీకలర్ ప్రింటింగ్
ఇప్పుడు మన విశాలాంధ్ర లో
మ్యాగ్జైన్స్
లామినేషన్
గమ్ బైండింగ్
బుక్ వర్క్స్ మరియు
పోస్టర్లు
పాంప్లేట్స్
ప్రింట్ చేయబడును
సంప్రదించండి: 94405 73343

ఎంజీఎన్‌ఆర్‌ఈజీపి పునరుద్ధరణకు

నిరంతర ప్రజా ఉద్యమం

- 'ఉపాధి' కొత్త చట్టాన్ని తక్షణం ఉపసంహరించాలి
- పేదల పొట్టకొట్టేలా కేంద్రం కుట్రలు
- వామపక్షాల భారీ నిరసన

విశాలాంధ్ర–హైదరాబాద్: 'వికసిత్ భారత్ రోజ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) చట్టం-2025' ను (విబి జి రామ్ జి) రద్దు చేసి మళ్లీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్ఆర్ఇజీఏ) ను పునరుద్ధరణ చేసేంత వరకు వామపక్షాలు, ప్రజాతంత్ర, లౌకికవాద శక్తులన్నీ విశాలమైన, నిరంతర ప్రజా ఉద్యమాన్ని చేపట్టాలని వామపక్ష నాయకులు పిలుపునిచ్చారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా, పేద వర్గాల పొట్టను కొట్టేవిధంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 'వీబీ జీ రామ్ జీ' చట్టం తీసుకొచ్చిందని విమర్శించారు. ఎంజీఎన్ఆర్ఇజీఏ తొలగించడమంటే పేదల హక్కులను కాలరాయడమేనని, ఎంజీఎన్ఆర్ఇజీఏను రద్దు చేసే బీజేపీ కుట్రదారులను అడ్డుకుందామని, ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చేందుకు కేంద్రం చేస్తున్న కుట్రలకు వ్యతిరేకంగా నూతన చట్టాన్ని తక్షణమే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సికింద్రాబాద్ ఎంజీ రోడ్డు మహాత్మా గాంధీ విగ్రహం వద్ద వామపక్ష పార్టీల అధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం జరిగింది. సీపీఐ జాతీయ నాయకులు డాక్టర్ కె.నారాయణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నర్సింహ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.ఛాయాదేవి, శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కార్యదర్శి పి.ప్రేమపావని, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, సీపీఎం పొలిట్ సభ్యులు బి.వి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, టి.సాగర్, మల్లు లక్ష్మి, అబ్బాస్, సీపీఎం సీనియర్ నాయకులు డి.జి.నర్సింహ రావు, సీపీఐ(ఎంఎల్) మాస్ పోటు రంగారావు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ నాయకులు అకాల పాపన్న, ఎఐఎఫ్ రాష్ట్ర కన్వీనర్ జోగిరెడ్డి, ఎంసీపీఐ నాయకులు అనిల్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ కొత్త చట్టం రద్దయి, పాత గ్రామీణ ఉపాధి చట్టం పునరుద్ధరణ అయ్యే వరకు నిరంతరం పోరాటం చేపట్టాలని పిలుపునిచ్చారు. పార్లమెంటులో వామపక్షాల బలం తగ్గితే సామాన్యులకు, పేదలకు నష్టమని, లౌకిక వ్యవస్థలు, ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ప్రమాదంలో పడతాయని అన్నారు. పార్లమెంటులో వామపక్షాలకు

- మిగతా 2 లో

'కరదీపిక' ఆవిష్కరణ

విశాలాంధ్ర - హైదరాబాద్: గ్రామ పంచాయతీ ప్రజా ప్రతినిధుల 'కరదీపిక'ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. మంత్రులు సీతక్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, అజహరుద్దీన్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. పంచాయతీల విధులు, బాధ్యతలకు సంబంధించి సమగ్ర సమాచారంతో 292 పేజీల పుస్తకాన్ని తెలంగాణ గ్రామీణాభివృద్ధి సంస్థ రూపొందించింది. పంచాయతీ ప్రజా ప్రతినిధులకు కరదీపికను ప్రభుత్వం అందించనుంది.

ఆరోగ్యమే సంపద

వైద్యం, విద్య, ఉపాధి కల్పనే లక్ష్యం

డయాగ్నోస్టిక్ సదుపాయాల విస్తరణ: భట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్: వైద్య, విద్య, ఉపాధి సమస్యల పరిష్కారమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, అదే మా అజెండా అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. బేగంపేటలోని ఓ హోటల్లో సోమవారం నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన భట్టి మాట్లాడుతూ... రెండవ శ్రేణి నగరాలు, గ్రామీణ ప్రాంతాల్లో డయాగ్నస్టిక్స్ సెంటర్స్ ప్రారంభించాలని విజయ మెడికల్ సెంటర్ నిర్ణయించడం అభినందనీయం అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి, అన్ని రకాల పరీక్షలను చేయాలని అందుకు ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందిస్తామని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. కొన్ని దశాబ్దాల క్రితమే లేజర్ వైద్యం ద్వారా మ్యాక్సీవిజన్ కాసు ప్రసాద్ రెడ్డి తన జ్ఞానాన్ని సమాజానికి ఇచ్చారని వివరించారు. ముగ్గురు బాల్య స్నేహితులు సూర్యనారాయణ, ప్రసాద్ రెడ్డి, వేలు కొన్ని దశాబ్దాల పాటు కలిసి ఉండటమే కాదు విజయవంతంగా వ్యాపారం నిర్వహిస్తుండడం అభినందనీయం అన్నారు. డయాగ్నోస్టిక్స్ సక్రమంగా పనిచేస్తే ఎలాంటి హడావిడి ఉండదని, కానీ అవి విఫలమైతే మొత్తం వ్యవస్థే కూలిపోతుందని అన్నారు. ఆరోగ్యం లేకుండా గౌరవం ఉండదని, గౌరవం లేకుండా నిజమైన అభివృద్ధి సాధ్యం కాదని స్పష్టం చేశారు. ప్రజా ఆరోగ్యాన్ని మౌలిక అంశంగా తీసుకుని ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. హైదరాబాద్ వెలుపల ప్రాంతాల్లో నాణ్యమైన డయాగ్నోస్టిక్ సదుపాయాల విస్తరణ కీలకమన్నారు. వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్ వంటి జిల్లాలకు అధునాతన డయాగ్నోస్టిక్ సదుపాయాలు చేరితే ప్రజలపై ఆర్థిక, మానసిక భారం తగ్గుతుందని అన్నారు. ఆధునిక వైద్యం ప్రారంభ దశలో వ్యాధి గుర్తింపుపై ఆధారపడి ఉంటుందని, విశ్వసనీయమైన డేటా లేకుండా ప్రజా ఆరోగ్య ప్రణాళికలు సాధ్యం కాదన్నారు. రాష్ట్రంలో ఆరోగ్యం కొందరికే పరిమితమైన హక్కు కాదని, ప్రజా సంపదగా ప్రభుత్వం భావిస్తోందన్నారు. వ్యాధిని చికిత్స చేయడమే కాదు, ముందే అంచనా వేసే దిశగా ప్రభుత్వ విధానం ఉందన్నారు. న్యూబర్గ్ డయాగ్నోస్టిక్స్, విజయా మెడికల్ సెంటర్‌ల విస్తరణకు డిప్యూటీ సీఎం అభినందనలు తెలిపారు. ఆరోగ్య సంరక్షణకు బలోపేతం చేసే ప్రతి ప్రయత్నానికి పూర్తి మద్దతు ఇస్తామన్నారు.

విద్యుత్ ఉద్యోగులకు 17.651 శాతం డీఏ

విద్యుత్ ఉద్యోగులకు 17.651 శాతం డీఏ ఖరారు చేస్తూ విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు రూపొందించిన ప్రతిపాదనలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆమోదం తెలిపారు. బహిరంగ మార్కెట్లో ధరల సూచి ఆధారంగా ప్రతి

- మిగతా 2 లో

మోహన్ భగవత్ వ్యాఖ్యలు రాజ్యాంగ ధిక్కారం: సీపీఐ

న్యూఢిల్లీ: భారత్ సహజసిద్ధంగా హిందూ దేశమేనని, అందుకు రాజ్యాంగ సవరణ అవసరం లేదన్న రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అధినేత మోహన్ భగవత్ వ్యాఖ్యల్ని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ పార్టీ జాతీయ సమితి ఓ ప్రకటన విడుదల చేసింది. తూర్పున సూర్యుడు ఉదయిస్తాడు... భారత్ సహజసిద్ధం గానే హిందూదేశం... ఇందు కోసం ఎవరి అనుమతి అవసరం లేదని ప్రకటించడం ద్వారా తాను గొప్ప శాస్త్రీయ పురోగతిని సాధించానని మోహన్ భగవత్ నమ్ముతున్నట్లు

- మిగతా 2 లో

ఇస్రో నుంచి రేపు మరో రాకెట్ ప్రయోగం

విశాలాంధ్ర– సూళ్లూరుపేట: సతీశ్ థావన్ అంతరిక్ష పరిశోధన కేంద్రం మరో ప్రయోగానికి సిద్ధమైంది. ఈ నెల 24వ తేదీన మరో అతిపెద్ద ఎల్‌వీఎం3 వీ6 బాహుబలి రాకెట్ ప్రయోగానికి ముహూర్తం ఖరారు చేశారు. 24న ఉదయం 8:54 గంటలకు ఈ రాకెట్‌ను నింగిలోకి ప్రయోగించనున్నారు. ఈ రాకెట్ ఎత్తు - 43.5 మీటర్లు, బరువు 6400 కిలోలు ఉండగా... ప్రయోగ సమయం 15 నిమిషాల 7 సెకన్లుగా నిర్ధారించారు. అమెరికాకు చెందిన బ్లూ బార్డ్ బ్లాక్-2 శాటిలైట్‌ను ఈ బాహుబలి రాకెట్

- మిగతా 2 లో



సోనియా, రాహుల్‌కు ఢిల్లీ హైకోర్టు నోటీసులు

న్యూఢిల్లీ: నేషనల్ హెరాల్డ్ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈడీ చార్జిషీటుపై ట్రయిల్ కోర్టు ఇటీవల ఇచ్చిన ఉత్తర్వులను దర్యాప్తు సంస్థ హైకోర్టులో సోమవారం సవాలు చేసింది. దీంతో కేసులో నిందితు లైన కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ తదితరు లకు హైకోర్టు నోటీసులు ఇచ్చింది. ఈడీ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు హాజరయ్యారు. ఈ కేసులో ఈడీ దర్యాప్తు పూర్తి చేసిందని, సాక్ష్యాలు

- మిగతా 2 లో

చేసింది తక్కువ... చెప్పుకుంది ఎక్కువ

కేసీఆర్ అబద్ధాలపై శ్రీధర్ బాబు ధ్వజం

విశాలాంధ్ర - హైదరాబాద్: కేసీఆర్ హయాంలో చేసింది తక్కువ, చెప్పుకుంది ఎక్కువ అని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. 'అబద్ధాలు మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని దుయ్యబట్టారు. సచివాలయంలో సోమవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి పరిశ్రమలు ... పెట్టుబడులు... యువతకు ఉద్యోగాలు రావొద్దన్నదే బీఆర్ఎస్ విధానమని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో ఏ కంపెనీ పెట్టుబడులు పెట్టాలన్నా 'కుటుంబం' అనుమతి తప్పనిసరి అనే విషయం అవునా కాదా అని నిలదీశారు. కానీ తాము ఆ 'గేట్ పాస్' కల్చర్ కు స్వస్తి పలికి గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్స్ కు తెలంగాణ బై డెస్టినేషన్‌గా మారిందన్నారు. కేసీఆర్ పాలనలో ఎంవోయూలు 'హైప్' లా కనిపిస్తుందని విమర్శించారు. భావితరాల భవిష్యత్తు కోసం తమ ప్రభుత్వం భరోసా ఇస్తున్న 'హోప్' అనే విషయాన్ని గుర్తిస్తే మంచిదన్నారు. రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలిచేలా 'భారత్ ఫ్యూచర్ సిటీ'కి శ్రీకారం చుట్టాం, కానీ... మీరు మాత్రం 'రియల్ ఎస్టేట్' కోసమే అంటూ తప్పుడు ప్రచారం చేయడం తగదన్నారు. వాస్తవాలు మాట్లాడితే... ఐటీ, ఏరోస్పేస్, డిఫెన్స్, లైఫ్ సైన్సెస్ లో పేటెంట్ కాంగ్రెస్ పార్టీదన్నారు. మీరు తొమ్మిదేళ్లలో ఐటీ ఎగుమతులను రూ.54వేల కోట్ల నుంచి రూ.2.43 లక్షల

- మిగతా 2 లో

బీజేపీకి విరాళాలు రూ.6,654 కోట్లు

న్యూఢిల్లీ: బీజేపీకి 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.6,654 కోట్లు విరాళంగా అందినట్లు తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికలు జరిగిన సంవత్స రంలో ఆ పార్టీకి గత ఏడాదితో పోలిస్తే 68 శాతం విరాళాలు పెరిగినట్లు ఎన్నికల సంఘం రిపోర్టులో తెలిసింది. రూ.20 వేల కన్నా ఎక్కువ విరాళం అందుకున్న పార్టీ వివరాలు మాత్రమే ఈసీ వెబ్‌సైట్‌లో వెల్లడించారు. ఆ నివేదిక ప్రకారం ఏప్రిల్ 1, 2024 నుంచి మార్చి 30, 2025 వరకు విరాళాలు ముట్టినట్లు తెలుస్తోంది. ఈ సమయంలోనే దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలతో పాటు అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, ఏపీ, ఒడిశా, జమ్మూకశ్మీర్, హర్యానా, జార్ఖండ్, మహారాష్ట్ర, ఢిల్లీ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించారు. 2023-2024లో బీజేపీకి 3,967 కోట్లు విరాళంగా అందాయి. సుమారు 40 శాతం విరాళాలు ఎలక్టోరల్ ట్రస్టుల నుంచి వచ్చినట్లు తేల్చారు. ప్రూడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ రూ.2,180 కోట్ల విరాళం అందజేయగా, ప్రోగ్రెసివ్ ఎలక్టోరల్ ట్రస్ట్ రూ.757 కోట్లు, న్యూ డెమోక్రాటిక్

- మిగతా 2 లో

ఒకే గొడుగు కిందకు రెవెన్యూ, రిజిస్ట్రేషన్, సర్వే విభాగాలు

- భూభారతి పోర్టల్‌తో అనుసంధానం
- ప్రతి సర్వే నెంబర్‌కు మ్యాప్ రూపకల్పన: పొంగులేటి

విశాలాంధ్ర - హైదరాబాద్: భూ పరిపాలన వ్యవస్థను మరింత పారదర్శకంగా అందించడానికి రెవెన్యూ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్, సర్వే విభాగాలను ఒకే ప్లాట్ ఫామ్ పైకి తీసుకువచ్చి భూ భారతి పోర్టల్‌తో అనుసంధానం చేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. వచ్చే జనవరి నెలలో ఆధునీకరించిన ఈ వ్యవస్థను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. నాంపల్లిలోని సీసీఎల్ఏ కార్యాలయాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ విభాగాలతో సమావేశం

- మిగతా 2 లో

పారదర్శక పాలన అందించండి

ప్రజల గుండెల్లో స్థానం ఉండాలంటే నిజాయతీగా సేవలు ఉండాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

విశాలాంధ్ర బ్యూరో–కొత్తగూడెం: ప్రజాప్రతినిధులుగా నిజాయితీతో ప్రజలకు అందించిన సేవలు, చేసిన అభివృద్ధి శాశ్వతంగా నిలిచి ఉంటాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం నియోజకవర్గంలోని విద్యానగర్ గ్రామ పంచాయతీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ ప్రజలు ఎంతో నమ్మకంతో

- మిగతా 2 లో

కేసీఆర్ కాళేశ్వరం కూలింది

అప్పులు తీర్చడానికి ఏడాదికి రూ.20 వేల కోట్లు

గోబెల్స్‌రావుగా హరీశ్ పేరు మార్చుకోవాలి: ఉత్తమ్

విశాలాంధ్ర - హైదరాబాద్: మాజీ మంత్రి హరీశ్ రావు తన పేరును గోబెల్స్ రావుగా మార్చుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. కాళేశ్వరం లో మూడు బ్యారేజ్ లు కూలిపోతే సిగ్గుతో తలదించుకోవాల్సింది పోయి ఎదురు దాడి చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ప్రజల తలలను తాకట్టు పెట్టి కాళేశ్వరం కట్టారని తెలిపారు. సోమవారం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ కట్టిన కాళేశ్వరం కూలిపోయిందని విమర్శించారు. కాళేశ్వరం నుంచి ఐదేళ్లలో 80 -90 టీఎంసీ మాత్రమే నీళ్లను ఉపయోగించారని వివరించారు. హరీశ్ రావు అతి తెలివి తేటలు ప్రజలు గమనిస్తున్నారని, కృష్ణా జలాల విషయంలో 2014 నుంచి 2020 వరకు అపెక్స్ కౌన్సిల్ భేటీలో కేసీఆర్ ఆంధ్రకు 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలకు ఒప్పుకున్నారని ఆరోపించారు. ఉమ్మడి మహబూబ్ నగర్, నల్గొండ జిల్లాలోని పాలమూరు, కల్వకుర్తి, నెట్టెంపాడు, డిండి, ఎస్ఎల్బీసీ ప్రాజెక్టులను కేసీఆర్ ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. కేసీఆర్ అప్పులు తీర్చడానికి ఏడాదికి రూ.20 వేల కోట్లు కడుతున్నామని పేర్కొన్నారు. 2020 కేఆర్ఎంబీ సమావేశంలో కేసీఆర్ 34 శాతం నీటికి ఒప్పుకుంటే తాము 71 శాతం కావాలని లేఖ రాశామన్నారు. పాలమూరుకు ఇప్పటికీ పర్యావరణం అనుమతులు రాలేదని, పూర్తి చేయకుండా పదేళ్లపాటు అక్కడి ప్రజలను మోసం చేసింది కేసీఆర్ అని ధ్వజమెత్తారు.

అమరావతిలో కల్చరల్ సెంటర్

నిర్ణీత గడువులోగా క్వాంటం కంప్యూటింగ్ పూర్తి: చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: రాజధాని అమరావతిలో ఆధునిక కల్చరల్ కేంద్రం ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. త్వరితగతిన భూమిని గుర్తించాలని సూచించారు. సచివాలయంలో 56వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం సోమవారం జరిగింది. వివిధ అంశాలను అథారిటీ ఆమోదించింది. రాజధాని నిర్మాణాలపై సీఆర్డీఏ, ఏడీసీ అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. సీఎం మాట్లాడుతూ...'రాజధాని ప్రాంతంలో కల్చరల్ సెంటర్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వానికి సంబంధించిన వివిధ కార్యక్రమాల నిర్వహణ కోసం అమరావతిలో ఇప్పటికే ఓ వేదికను నిర్మించి ఉంటే బాగుండేది. దీని కోసం అనువైన ప్రాంతాన్ని గుర్తించండి. ఏర్పాటు చేయబోయే కల్చరల్ సెంటర్‌కు ఏ పేరు పెడితే బాగుంటుందో ఆలోచించండి. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా నిర్మాణం చేపట్టాలి. నిర్దేశిత గడువులోగా అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ పూర్తి చేయాలి. భూములిచ్చిన రైతులకు కేటాయించే ప్లాట్లకు లే అవుట్ల వద్ద పూర్తి స్థాయి మౌలిక సదుపాయాలు కల్పించాలి. రాజధాని రైతుల సమస్యలపై జాప్యం లేకుండా పరిష్కరించాలి. రాజధాని పరిధిలో ఉన్న అటవీ ప్రాంతాలను అభివృద్ధి చేయాలి. అటవీ సంపద, నదీ పరివాహకం, కొండలు వంటివి అమరావతికి ప్రకృతి శోభను తీసుకొస్తాయి. వివిధ రకాల పూల మొక్కలను రాజధాని ప్రాంతంలో నాటి పర్యాటకులను... ప్రకృతి ప్రేమికులను ఆకర్షించాలి. పార్కులను ఏర్పాటు చేయాలి. అమరావతికి వచ్చే వారికి అంతర్జాతీయ స్థాయి సదుపాయాలతో హోటళ్లు ఉండేలా చూడాలి. ఈ మేరకు వాటి నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలి' అని తెలిపారు.

ఆమోదించిన అంశాలు...

అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ ప్రాంగణంలో రెండు ఎకరాల్లో రూ.103.96 కోట్లతో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలని, అఖిల భారత సర్వీసు అధికారుల భవనాలకు అదనపు సౌకర్యాల

- మిగతా 2 లో

ఇదీ లోకం!

గ్రామీణ పేదలకు విపత్కర పరిస్థితులు

కాంగ్రెస్ అగ్ర నేత సోనియా గాంధీ

5 లో

హెచ్-1బీ వీసాదారులకు ఇక్కట్లు

- రెన్యువల్ అపాయింట్‌మెంట్లు రద్దు
- సోషల్ మీడియా పరిశీలన కారణంగా జాప్యం
- రెన్యువల్ కోసం భారత్‌కు వచ్చి చిక్కుకుపోయిన వందలాది ఉద్యోగులు

న్యూఢిల్లీ: అమెరికా హెచ్1బి వీసా రెన్యువల్ కోసం స్వదేశానికి వచ్చిన వందలాది మంది భారతీయ ఉద్యోగులు స్వదేశంలోనే చిక్కుకుపోయారు. అమెరికా ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన 'సోషల్ మీడియా పరిశీలన' విధానం కారణంగా, వారి వీసా అపాయింట్‌మెంట్లు ఉన్నపళంగా రద్దయ్యాయి. డిసెంబర్ 15 నుంచి 26 మధ్య జరగాల్సిన ఇంటర్వ్యూలను రద్దు చేసిన అమెరికా కాన్సులేట్ కార్యాలయాలు, కొన్నింటిని ఏకంగా 2027కు వాయిదా వేయడంతో వీసాదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. టెక్నాలజీ, ఇంజినీరింగ్ వంటి ఉన్నత నైపుణ్యం కలిగిన రంగాల్లో పనిచేస్తున్న ఈ ఉద్యోగులు, తమ వర్క్ పర్మిట్లను పునరుద్ధరించుకోవడానికి ఢిల్లీ, ముంబై, చెన్నై, హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్లలో స్లాట్లు బుక్ చేసుకున్నారు. అయితే డిసెంబర్ 15న అమల్లోకి వచ్చిన కొత్త నిబంధనల ప్రకారం, వీసా దరఖాస్తుదారుల సోషల్ మీడియా ఖాతాలను క్షుణంగా తనిఖీ చేయాల్సి ఉండటంతో ఈ జాప్యం తలెత్తింది. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా అపాయింట్‌మెంట్లు రద్దు కావడంతో పండగ సీజన్‌లో స్వదేశానికి వచ్చిన వారు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. ఈ పరిణామం వల్ల ఉద్యోగుల భవిష్యత్తు అగమ్యగోచరంగా తయారైంది. 60 రోజుల్లోగా అమెరికాకు తిరిగి వెళ్లకపోతే ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందని, ఇప్పటికే పలు కంపెనీలు తమ ఉద్యోగులను వేతనం లేని సెలవుపై పంపాయని ఇమ్మిగ్రేషన్ న్యాయవాదులు చెబుతున్నారు. "కంపెనీలు వీరి కోసం ఎంతకాలం ఎదురుచూస్తాయి?" అని హ్యూస్టన్‌కు చెందిన న్యాయవాది ఇయాన్ న్యూమాన్ ప్రశ్నించారు. ఈ సంక్షోభంతో ఎన్నో కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. అమెరికాలో పాఠశాలలకు వెళ్తున్న పిల్లలకు తల్లిదండ్రులు దూరమయ్యారు. ఇంటి లోన్‌లు, వైద్య బీమా వంటి ఆర్థిక సమస్యలు కూడా వారిని చుట్టుముట్టాయి. అమెరికా సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) నివేదిక ప్రకారం, మొత్తం వీసాదారులలో 71 శాతం మంది భారతీయులే కావడంతో ఈ మార్పుల ప్రభావం భారత్‌పైనే అత్యధికంగా ఉంది. ట్రంప్ ప్రభుత్వం అనుసరిస్తున్న కఠిన వలస విధానాల్లో భాగంగానే ఈ మార్పులు చోటుచేసుకున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే ఇతర దేశాల్లో రెన్యువల్ చేసుకునే అవకాశాన్ని, దేశీయంగా రెన్యువల్ చేసుకునే పైలట్ ప్రాజెక్టును రద్దు చేయడం వంటి చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే.

ఈ ఆకస్మిక పరిణామంతో టెక్ కంపెనీలు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. కొన్ని సంస్థలు తమ ఉద్యోగుల కోసం అత్యవసరంగా 'వర్క్ ఫ్రమ్ ఇండియా' ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ, అది ఎంతకాలం కొనసాగుతుందోనన్న ఆందోళన నెలకొంది. ఈ సంక్షోభం ఎప్పటికి ముగుస్తుందో, తమ భవిష్యత్తు ఏమిటో తెలియక వేలాది మంది భారతీయులు ఆశతో ఎదురుచూస్తున్నారు.

బంగ్లాదేశ్‌లో విద్యార్థి నేతపై కాల్పులు

ఢాకా: బంగ్లాదేశ్ నేషనల్ సిటిజన్ పార్టీ నేత మోతాలెబ్ సికదార్‌పై సోమవారం గుర్తుతెలియని వ్యక్తులు కాల్పులు జరిపారు. సోమవారం ఉదయం 11:45 గంటల ప్రాంతంలో ఖులానా పట్టణంలోని సికదార్ ఇంటి వద్దే ఈ ఘటన జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరపడంతో సికదార్ తల్లోకి తూటా దూసుకెళ్లింది. దీంతో ఎడమవైపు తీవ్రంగా గాయమైంది. దీంతో అతడిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. అయితే ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. దేశం వచ్చే ఏడాది ఎన్నికలకు సిద్ధమవుతోన్న వేళ నేషనల్ సిటిజన్ పార్టీ నేతపై కాల్పుల జరగడం గమనార్హం. ఇంక్విలాబ్ మోంచో యువనేత షరీఫ్ ఉస్మాన్‌హాదీ హత్యతో ఇప్పటికే నిరసనలతో బంగ్లాదేశ్ అట్టుడుకుతోంది. గత సంవత్సరం షేక్ హసీనా నేత ృత్వంలోని అవామీ లీగ్ ప్రభుత్వాన్ని కూలదోసిన విద్యార్థుల ఉద్యమంలో ముఖ్య పాత్ర పోషించిన హాదీపై ఈ నెల 12న ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న హాదీపై గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరిపారు. ఎకాల్పులు జరిపారు. తీవ్రంగా గాయపడిన హైదిని మెరుగైన చికిత్స కోసం సింగపూర్‌కు తరలించగా... చికిత్స పొందుతూ డిసెంబర్ 18న ప్రాణాలు కోల్పోయాడు. హాదీ మరణవార్తతో ఢాకాలో పెద్ద ఎత్తున నిరసలు వెల్లువెత్తాయి. హాదీ మద్దతుదారులు, విద్యార్థులు పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టారు. భారత్, అవామీలీగ్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వివిధ మీడియా కార్యాలయాలు, అవామీలీగ్ ఆఫీసులకు నిప్పు పెట్టారు. దీంతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. మాజీ అధ్యక్షుడు షేక్ ముజిబుర్ రహ్మాన్ నివాసంపై కూడా ఆందోళనకారులు దాడి చేశారు.కాగా, హాదీ హత్యకు వ్యతిరేకంగా ఆందోళనలు కొనసాగుతోన్న వేళ తాత్కాలిక ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. హాదీపై దాడి కేసులో ప్రధాన నిందితుడిగా భావిస్తున్న ఫైసల్ కరీం మసూద్‌పై లుక్అవుట్ నోటీసులు జారీ చేసింది. అతడిపై ప్రయాణ నిషేధాన్ని విధిస్తున్నట్లు పేర్కొంది. ప్రస్తుతం బంగ్లాదేశ్‌లోనే ఉన్న మసూద్ అరెస్టు నుంచి తప్పించుకోవడానికి తరచూ స్థానాలను మారుస్తున్నాడని భద్రతా సంస్థలు తెలిపాయి. అతడి కదలికలను తెలుసుకోవడానికి బహుళ దర్యాప్తు బ ృందాలను మోహరించినట్లు పేర్కొన్నాయి. హాదీ మ ృతి రోజు రాత్రి నిరసలు చేస్తున్న సమయంలోనే హిందూ వ్యక్తి దీపూ చంద్ర దాస్ దారుణ హత్యకు గురయ్యారు. మైమెన్‌సింగ్ నగరంలో చంద్రదాస్ అనే వ్యక్తిని ఒకగుంపు తీవ్రంగా కొట్టి చెట్టుకు వేలాడదీసి ఉరి తీశారు. అనంతరం రహదారి పక్కన పడేశారు. ఆ తర్వాత మళ్లీ ఇంకొందరు ఆ మ ృతదేహానికి నిప్పు అంటించారు. ఈ ఘటనపై పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తుతుండటంపై యూనస్ ప్రభుత్వం స్పందించింది. ఈ హత్య కేసులో ఇప్పటివరకు ఏడుగురిని అరెస్టు చేసినట్లు బంగ్లాదేశ్ ప్రభుత్వ ప్రధాన సలహాదారు వెల్లడించారు. కాగా ఈ ఘటనపై భారత్‌లో తలదాచుకున్న మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా ఆందోళనన వ్యక్తం చేశారు. దేశంలో మైనారిటీల భద్రతను కాపాడడంలో తాత్కాలిక ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

సోనియా, రాహుల్‌కు దిల్లీ హైకోర్టు నోటీసులు

(మొదటిపేజీ తరువాయి)

సేకరించిందని, కేసులో భాగంగా పలుచోట్ల సోదాలు కూడా జరిపిందని చెప్పారు. ఈడీ చార్జిషీటును పరిగణనలోకి తీసుకోకుండా దిగువ కోర్టు తప్పు చేసిందని ఆయన వాదించారు. ఈ కేసుపై తదుపరి విచారణను 2026 మార్చి 12వ తేదీకి హైకోర్టు వాయిదా వేసింది. నేషనల్ హెరాల్డ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాఖలు చేసిన చార్జిషీటును పరిగణనలోకి తీసుకునేందుకు దిల్లీ కోర్టు గత మంగళవారం నిరాకరించింది. చార్జిషీటును తిరస్కరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా కాకుండా, ప్రైవేటు వ్యక్తి సుబ్రమణ్యస్వామి దాఖలు చేసిన ఫిర్యాదు ఆధారంగా రూపొందించిన చార్జిషీటును పరిగణనలోకి తీసుకోలేమని దిల్లీ కోర్టు ప్రత్యేక జడ్జి విశాల్ గాగ్నే తప్పుపట్టారు. చట్టం ప్రకారం దీన్ని విచారించడం సాధ్యం కాదన్నారు. దిల్లీ పోలీసు శాఖకు చెందిన ఆర్థిక నేరాల విభాగం ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని ప్రత్యేక న్యాయమూర్తి గుర్తుచేశారు. అలాంటప్పుడు ఈడీ చార్జిషీటు ఆధారంగా తీర్పు ఇవ్వడం తొందరపాటే అవుతుందని అభిప్రాయపడ్డారు. అయితే ఈ కేసులో ఈడీ దర్యాప్తు కొనసాగించవచ్చని కోర్టు ఆదేశాలిచ్చింది. ఈడీ చార్జిషీటులో సోనియాగాంధీ, రాహుల్ గాంధీ పేర్లతో పాటు సుమన్ దూబే, శామ్ పిట్రోడా, యంగ్ ఇండియన్, డోటెక్స్ మర్చండైజ్, సునీల్ భండారి పేర్లు చేర్చింది.

ఇస్రో నుంచి రేపు మరో రాకెట్ ప్రయోగం

(మొదటిపేజీ తరువాయి)

నింగిలోకి మోసుకెళ్లనుంది. శాటిలైట్ బరువు 6100 కిలోలు ఉంది. ఈ శాటిలైట్‌ను అమెరికాకు చెందిన స్పేస్ మొబైల్ సంస్థ రూపొందించింది. గతంలో పంపిన శాటిలైట్ల కంటే పదిరెట్లు అధిక సామర్థ్యంతో బ్లూ బార్డ్ బ్లాక్-2 శాటిలైట్ పనిచేయనుంది. ఈ సిరీస్‌లో ఇది ఎనిమిదో ప్రయోగం. ఇప్పటి వరకు జరిగిన ఏడు ప్రయోగాలు విజయవంతమయ్యాయి. చంద్రయాన్-3 ప్రయోగానికి ఎల్‌వీఎం 3 రాకెట్‌ను ఇస్రో వినియోగించనుంది. ఈ నేపథ్యంలో షార్‌కు ఇస్రో చైరన్ డాక్టర్ నారాయణన్, అమెరికా ప్రతినిధులు చేరుకున్నారు. ఎల్‌వీఎం3 వీ6 ప్రయోగం పూర్తి వాణిజ్య ప్రయోగంగా తెలుస్తోంది. భవిష్యత్తులో మరిన్ని వాణిజ్య ప్రయోగాలకు అవకాశాలు ఉన్నాయి.

మోహన్ భగవత్ వ్యాఖ్యలు రాజ్యాంగ ధిక్కారం: సీపీఐ

(మొదటిపేజీ తరువాయి)

అనిపిస్తుంది. విచారకరం ఏంటంటే... రాజ్యాంగం, మన గణతంత్ర స్వభావం పట్ల దశాబ్దాల తరబడి ఆర్ఎస్ఎస్ ధిక్కారాన్ని ఆయన బయటపెట్టారు. భారతదేశం హిందూ దేశం అని చెప్పడానికి రాజ్యాంగం అనుమతి అవసరం లేదనడం ఆయనకున్న జ్ఞానం కాదు, అది ఉద్దేశపూర్వక అజ్ఞానమని సీపీఐ విమర్శించింది. "డాక్టర్ అంబేద్కర్ హిందూ రాష్ట్రం అనే ఆలోచనను తీవ్రంగా తిరస్కరించారు. ఎందుకంటే అది సోపానక్రమాన్ని కఠినతరం చేస్తుందని, కుల అణచివేతను చట్టబద్ధం చేస్తుందని, మైనారిటీలతో వివక్షను సంస్థాగతీకరిస్తుందని ఆయనకు తెలుసు. భారత్ మతం లేని లౌకిక గణతంత్రరాజ్యం. సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావం ప్రబలంగా ఉండేలా రూపొందించబడింది. వేలాది మంది స్వాతంత్ర్య సమరయోధుల త్యాగం, పోరాటాలతో నిర్మించబడిన దేశంలో ఆర్ఎస్ఎస్ రాజ్యాంగ వ్యతిరేకతకు స్థానం లేదు. భారతదేశంలో రాజ్యాంగాన్ని అనుసరించడం ఐచ్ఛికం కాదని మోహన్ భగవత్‌కు గుర్తెరగాలి" అని సీపీఐ స్పష్టం చేసింది.

బీజేపీకి విరాళాలు రూ.6,654 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

ఎలక్టోరల్ ట్రస్టు రూ.150 కోట్లు విరాళ మిచ్చాయి. ఇతర ట్రస్టుల నుంచి సుమారు 3,112.5 కోట్లు విరాళంగా వచ్చినట్లు తెలిసింది. సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సుమారు వంద కోట్లు విరాళం ఇచ్చింది. రుంగ్తా సన్స్ ప్రైవేటు సంస్థ 95 కోట్లు, వేదాంత 67 కోట్లు, మాక్రోటెక్ డెవలపర్స్ 65 కోట్ల, బజాజ్ గ్రూపు కంపెనీలు 65 క్షోల, డిరైవ్ ఇన్వెస్టిమెంట్స్ సుమారు 50 కోట్లు విరాళం ఇచ్చాయి. మలాబార్ గోల్డ్ 10 కోట్లు, కళ్యాణ్ జ్వలర్స్ 15 కోట్లు, హీరో గ్రూపు 23 కోట్లు, దిలీప్ బిల్డ్‌ఐకాన్ గ్రూపు 29 కోట్లు, ఐటీసీ లిమిటెడ్ 35 కోట్లు, వేవ్ ఇండస్ట్రీస్ 6 కోట్లు, జిరోదా ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ 1.5 కోట్లు విరాళం అందజేశాయి. బీజేపీ నేతలు కూడా భారీగా విరాళాలు అందజేశారు. అస్సోం సీఎం హిమంత బిశ్వ శర్మ రూ.3 లక్షలు, మంత్రి పీయూష్ హజారికి 2.75 లక్షలు, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ లక్ష, ఒడిశా సీఎం మోహన్ చరన్ మాంజీ 5 లక్షలు, ఇండోర్ మేయర్ భార్గవ లక్ష, ఆకాశ్ విజయవర్గియా రూ.లక్ష విరాళమిచ్చారు. కాంగ్రెస్ పార్టీకి భారీగా విరాళాలు తగ్గాయి. ఆ పార్టీకి రూ.522.13 కోట్లు మాత్రమే విరాళాలు వచ్చాయి. 2023-24 సీజన్‌లో రూ.1,129 కోట్లు అందుకున్న కాంగ్రెస్ పార్టీకి... గత ఏడాది 43 శాతం తక్కువగా విరాళాలు అందాయి.

ప్రాజెక్టులపై కేసీఆర్ నిర్లక్ష్యం

- రాజకీయ మనుగడకు కుయుక్తులు
- బీఆర్ఎస్ పతనానికి కుటుంబ రాజకీయాలే కారణం
- నీటి హక్కుల సాధనలో విఫలం: జూపల్లి ధ్వజం

విశాలాంధ్ర - హైదరాబాద్: పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన కేసీఆర్ సర్కారుదే 'దద్దమ్మ ప్రభుత్వం' అని మంత్రి జూపల్లి కృష్ణారావు విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ ఉనికి కోల్పోతోందని, కండ కరిగిపోయి కేవలం తోలుమాత్రమే మిగిలిందని గ్రహించే.. తన రాజకీయ మనుగడ కోసం కేసీఆర్ ఇప్పుడు బయటకు వస్తున్నారని ఎద్దేవా చేశారు. గాంధీ భవన్‌లో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరిలతో కలిసి సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ పతనానికి కేసీఆర్ కుటుంబ రాజకీయాలే ప్రధాన కారణమని ఆరోపించారు. . సర్పంచ్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ కలిసి పనిచేసినా ప్రజలు వారికి మూడింట ఒక వంతు సీట్లు కూడా ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ రెండేళ్ల పాలనపై ప్రజలు ఇప్పటికే స్పష్టమైన తీర్పు ఇచ్చారు" అని పేర్కొన్నారు. పాలమూరు ప్రాజెక్టలపై ప్రేమ కాదు... కేవలం బీఆర్ఎస్ ను కాపాడుకోవడానికి కేసీఆర్... కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారన్నారు. ఉమ్మడి పాలమూరు ప్రాజెక్టలపై గత కేసీఆర్ సర్కార్ నిర్లక్ష్యం చేసిందన్నారు. కాలువలు పూర్తికాకుండానే ఎత్తిపోతల పథకాన్ని జాతికి అంకితం చేశారన్నారు. పదేళ్లు పాలించి ఎందుకు పూర్తి చేయలేదని జూపల్లి ప్రశ్నించారు. రూ.ఎనిమిది లక్షల కోట్లు అప్పులు చేసినా కేసీఆర్ ఎకరా నీళ్లు ఇవ్వలేదని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డిపై తాగునీటి ప్రాజెక్టు అని సుప్రీంకోర్టులో కేసు వేసిన కేసీఆర్ ఇప్పుడు సాగునీటి ప్రాజెక్టు అని అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. గత కాంగ్రెస్ పాలనలోనే జూరాల నుంచి 70 టీఎంసీలకు మంజూరైందన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు ఇరిగేషన్ కోసం కాదని, కేవలం తాగునీటి అవసరాల కోసమేనని కోర్టులో చెప్పారని గుర్తు చేశారు. నీటి విధానాల విషయంలో కేసీఆర్ ప్రభుత్వం అనేక తప్పిదాలు చేసిందని మంత్రి ఆరోపించారు. తెలంగాణ నీటి హక్కులను వినియోగించుకోవడంలో కేసీఆర్ విఫలమయ్యారని అన్నారు. నాడు నీళ్ల కోసం తీసుకున్న నిర్ణయాలే ఇప్పుడు తెలంగాణకు సమస్యలుగా మారాయని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నప్పుడు కేంద్రంతో అంటకాగి ఏనాడు తెలంగాణ హక్కుల గురించి కొట్లాడలేదన్నారు. గత ప్రభుత్వ అప్పులకు వడ్డీలు కడుతూనే సంక్షేమ పథకాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. సాగునీటి ప్రాజెక్టులపై స్పష్టమైన లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని, పర్యావరణ అనుమతులు సాధించి తెలంగాణ రైతాంగానికి నీరందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కేంద్రం కక్షపూరిత చర్యల వల్లే యూరియా కొరత ఏర్పడిందని అన్నారు.

నిరంతర ప్రజా ఉద్యమం

(మొదటిపేజీ తరువాయి)

బలమైన ప్రాతినిధ్యం ఉంటే కేంద్రం ప్రవేశపెట్టిన 'వీబీ జి రామ్ జి' బిల్లును బలంగా అడ్డుకునేవారని, చర్చకు తీసుకొచ్చేవారని కొందరు కాంగ్రెస్, బీజేపీ నాయకులు గుర్తు చేస్తున్నారని నారాయణ తెలిపారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును వీబీ జి రామ్ జి అని పెట్టి ప్రధాని మోదీ రెండవ సారి గాంధీని హత్య చేశారని విమర్శించారు. స్వాతంత్ర్య, పోరాట యోధులను వెనక్కి నెట్టి, గాంధీని చంపిన గాడ్సే, సావర్కర్, బ్రిటీషు వారికి వ్యతిరేకంగా పోరాటం చేయని వారిని ముందుకు తీసుకొస్తున్నారని దుయ్యబట్టారు. మోదీ అధికారంలోనికి వచ్చిన 2014 తర్వాతనే భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినట్టుగా భావిస్తున్నారని, అందుకే అన్ని పేర్లను మారుస్తున్నారని ఆయన చెప్పారు. బి.వి.రాఘవులు మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి చట్టాన్ని నాశనం చేసి, గాంధీ పేరు ఉండకుండా కేంద్రం కుట్ర చేస్తోందన్నారు. పెత్తందారి పెత్తనాలకు, కార్పొరేట్ శక్తులకు గ్రామీణ ఉపాధి హామీ చట్టం ఒక సవాలుగా మారిందని, అందుకే గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. జాన్ వెస్లీ మాట్లాడుతూ 'వీబీ జి రామ్ జి'లో 40 శాతం నిధులు, 75 శాతం పరికరాల ఖర్చును కూడా రాష్ట్రాలే భరించాలని కేంద్రం చట్టంలో పొందుపర్చిందని, తద్వారా ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రాలు ఈ పథకాన్ని సక్రమంగా అమలు చేసే పరిస్థితి ఉండబోదన్నారు. పోటు రంగారావు మాట్లాడుతూ మోదీకి, బీజేపీకి శ్రీరామునిపై భక్తి లేదని, శ్రీరాముడిని కేవలం అధికారానికి మాత్రమే ఉపయోగించుకుంటున్నారని, వారికి సావర్కర్, గాడ్సేనే నిజమైన దేశ భక్తులు అని అన్నారు. అకాల పాపన్న మాట్లాడుతూ కేంద్రం పేదల పొట్టకొడుతోందని మండిపడ్డారు. జగిరెడ్డి, అనిల్ మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలను ఐక్యం చేసి పోరాటం చేయాలని అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఐ నాయకులు నేర్లకంటి శ్రీకాంత్, కంపల శ్రీనివాస్, చెట్టుకింద శ్రీనివాస్, కళ్యాణ్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీమాన్, సీపీఐ(ఎంఎల్) మాస్ రాష్ట్ర నాయకులు అన్వేష్, సీపీఎం నాయకులు శ్రీరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

చేసింది తక్కువ... చెప్పకుంది ఎక్కువ

(మొదటిపేజీ తరువాయి)

కోట్లకు తీసుకెళ్లారని, మేం కేవలం ఏడాదిన్నర వ్యవధిలోనే రూ.2.43 లక్షల కోట్ల నుంచి రూ.3.23 లక్షల కోట్లకు తీసుకెళ్లామన్నారు. 2024-25లో తలసరి రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి ... తలసరి ఆదాయం... దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో ఉందని తాజాగా ఆర్బీఐ తేల్చిందన్నారు. విమర్శలు చేసే ముందు ఒకసారి గతంచూసుకోవాలని హితవు పలికారు. ఇక్కడ పరదాలు లేవు, కేవలం ప్రగతి మాత్రమే ఉందని, మీరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా, అబద్ధాలు ప్రచారం చేసినా తెలంగాణను ప్రపంచ పటంలో నంబర్ వన్ పారిశ్రామిక రాష్ట్రంగా నిలబెడతాం... ఇందులో రాజీ పడబోమని స్పష్టం చేశారు.

రెవెన్యూ, రిజిస్ట్రేషన్, సర్వే విభాగాలు

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భూ పరిపాలనకు కేంద్రమైన సీసీఎల్ఏ కార్యాలయ నిర్వహణ సరిగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్పొరేట్‌కు ధీటుగా ఆధునీకరించాలని అధికారులను ఆదేశించారు. దశాబ్దాల క్రితం ప్రభుత్వ అవసరాల కోసం ప్రైవేటు వ్యక్తుల నుంచి భూ సేకరణ జరిపిందని, ఇప్పటికీ కొన్ని భూములు ప్రైవేటు వ్యక్తుల పేరు మీదే ఉన్నాయని ఇవన్నీ కూడా రికార్డులలో మార్చాలని, అలాగే అసైన్డ్ , భూధాన్ భూములపై సమీక్షతో పాటు కొన్ని సంవత్సరాల నుంచి ఉద్యోగులపై విజిలెన్స్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని ఏ విభాగంలో ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయి, ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయి, కోర్టు కేసులన్నింటిపై పూర్తిస్థాయి సమీక్ష నిర్వహిస్తానని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించబోయే తహశీల్దార్ కార్యాలయాలు ఒకే మోడల్‌గా ఉండాలని ఇందుకు సంబంధించిన డిజైన్ రూపొందించాలని అధికారులకు సూచించారు. ఒక్క క్లిక్‌తో రైతుకు సంబంధించిన భూముల పూర్తి సమాచారం లభించేలా అదేవిధంగా రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, మార్కెట్ విలువ, విలేజ్ మ్యాప్, ప్రతి సర్వే నెంబర్‌కు మ్యాప్, నాలా ఆర్డర్లు, ఆర్వోఆర్ , గ్రామాల నక్షా, ఫీడ్ బ్యాక్ వంటి పూర్తి సమాచారం లభించేలా సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలతో అనుసంధానం చేస్తూ భూభారతి పోర్టల్‌ను పూర్తి స్థాయిలో ప్రజలకు చేరువ చేయబోతున్నామని తెలిపారు.

అమరావతిలో కల్చరల్ సెంటర్

(మొదటిపేజీ తరువాయి)

కల్పనకు రూ.109 కోట్ల కేటాయింపునకు సీఆర్డీఏ అథారిటీ ఆమోదించింది. శాఖమూరులో 23 ఎకరాల్లో ఆయూష్ మంత్రిత్వ శాఖ అధ్వర్యంలో భవనాల నిర్మాణం, హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకు తుళ్లూరులో ఆరు ఎకరాలు కేటాయింపునకు నిర్ణయించింది. 8400 క్యూసెక్కుల కెపాసిటీతో రూ.444 కోట్లతో ఫ్లడ్ పంపింగ్ స్టేషన్ ఏర్పాటుకు, ఎల్పీఎస్ జోన్-8లో లే-అవుట్ల అభివృద్ధికి రూ.1,358 కోట్లు కేటాయింపునకు, 202 ఎకరాల భూమి జరీబు లేదా మెట్ట ప్రాంతమా అని నిర్ధారణకు రాష్ట్రస్థాయి కమిటీ ఏర్పాటు, వ్యవసాయం, ఉద్యానవనం, భూగర్భ జలాలు, రెవెన్యూ, సర్వే విభాగాలకు చెందిన అధికారులతో కమిటీ ఏర్పాటుకు ఆమోదించింది. మంత్రి నారాయణ, సీఎస్ విజయానంద్ సహా సీఆర్డీఏ, ఏడీసీ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

బెల్టు షాపుల్ని నియంత్రించాలి

బెల్టు షాపుల్ని నియంత్రించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఎక్సైజ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అధికారులకు సీఎం కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఆదాయం ముఖ్యం కాదని... ఆరోగ్యకరమైన వృద్ధి సాధించాలని వ్యాఖ్యానించారు. లాటరీ విధానం, రిటైలర్ మార్జిన్ పెంపుపై పున:పరిశీలన చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి మద్యం బాటిల్‌పైనా ప్రత్యేక గుర్తింపు నెంబర్ ఉండాలని స్పష్టం చేశారు. బెల్టు షాపుల నియంత్రణకు హర్యానా మోడల్‌పై అధ్యయనం చేస్తున్నామని పేర్కొన్నారు.

సీఎంతో బీసీ నేత శంకరరావు భేటీ

సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుని ఏపీ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె. శంకరరావు కలిశారు. కీలక అంశాలపై చర్చించారు. తెలంగాణలో బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ శాసనసభలో చట్టం చేసి గవర్నర్ ఆమోదానికి పంపించారని ప్రస్తావించారు. ఏపీలో కూడా బీసీలకు స్థానిక సంస్థల్లో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాకే ఎన్నికలకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. తమ విజ్ఞప్తికి సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారని శంకరరావు పేర్కొన్నారు.

చెత్త కుప్పలో రైఫిల్ 'టెలిస్కోప్'

జమ్మూ: చెత్తకుప్పలో దొరికిన కొత్తతరహా బొమ్మ తీసుకొని ఓ పిల్లాడు సరదాగా ఆడుకుంటున్నాడు. కానీ ఆ వస్తువును చూసి పోలీసులు షాక్ అయ్యారు. అది కూడా జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కార్యాలయం పక్కన దొరికిందని తెలిసి అప్రమత్తమయ్యారు. ఆ దగ్గర్లోనే పోలీసు విభాగానికి చెందిన సెక్యూరిటీ ఆఫీస్ కూడా ఉంది. జమ్మూకశ్మీర్‌లో చోటుచేసుకున్న ఈ ఘటన కలకలం సృష్టిస్తోంది. ఇంతకీ ఏం జరిగిందంటే..? జమ్మూలోని సిద్రా ప్రాంతంలో జాతీయ దర్యాప్తు సంస్థ కార్యాలయం పక్కన చెత్త కుప్పలో అసాల్ట్, స్నైపర్ రైఫిళ్లలో వాడే టెలిస్కోప్ ఒక పిల్లాడికి దొరికింది. అది ఒక బొమ్మగా భావించి అతడు ఆడుకుంటున్నాడు. అయితే ఆ విషయం పోలీసుల దృష్టికి చేరడంతో.. ఆ అనుమానాస్పద వస్తువును స్వాధీనం చేసుకున్నారు. అది చైనా లో తయారైందని గుర్తించడంతో భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు . పోలీసులు ఆ ప్రాంతంలో తనిఖీలు చేపట్టారు. అలాగే జమ్మూ ప్రాంతంతో పాటు ప్రభుత్వ, సైనిక కార్యాలయాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. ప్రజలు ఎలాంటి భయాందోళనకు లోనుకావద్దని సూచించారు. ఈ ఘటనకు సంబంధించి 24 ఏళ్ల వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన పహల్గాం ఉగ్రదాడిపై ఎన్ఐఏ చార్జిషీట్ దాఖలు చేసిన నేపథ్యంలోనే ఈ ఘటన వెలుగుచూసింది. ఇటీవల దిల్లీలో చోటుచేసుకున్న కారు బాంబు పేలుడుపై కూడా ఎన్ఐఏ దర్యాప్తు చేస్తోంది.

ఆరోగ్యమే సంపద

(మొదటిపేజీ తరువాయి)

సంవత్సరం జనవరి, జులైలో డియర్‌నెస్ అలవెన్స్, డియర్ నెస్ రిలీఫ్ ను సమీక్షిస్తూ విడుదల చేస్తారన్నారు. అందులో భాగంగా ఈ ఏడాది జులై నుంచి అమలయ్యేలా ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు డీఏ/డీఆర్ ను 17.651 శాతంగా ఖరారు చేశారు. తాజా ఉత్తర్వులతో విద్యుత్ సంస్థల పరిధిలోనికి 71,387 వేల మంది ఉద్యోగులు, ఆర్టిజెన్లు, పెన్షనర్లు లబ్ది పొందనున్నారు. పెంచిన డీఏ ప్రకారం టీజీ ట్రాన్స్ కోలో 3,036 మంది ఉద్యోగులకు, 3,769 మంది ఆర్టిజన్లకు, 2,446 మంది పెన్షనర్లకు మొత్తంగా 9,251 మందికి లబ్ది చేకూరనుంది. 6,913 మంది జెన్ కో ఉద్యోగులకు 3,583 మంది ఆర్టిజన్లకు, 3,579 మంది పెన్షనర్లకు లబ్ది జరగనుంది. ఎస్పీడీసీఎల్ లో 11,957 మంది ఉద్యోగులకు 8,552 మంది ఆర్టిజన్లకు, 8,244 మంది పెన్షనర్లకు లబ్ది జరగనుంది. ఎస్పీడీసీఎల్ పరిధిలో 9,728 మంది ఉద్యోగులకు 3,465 మంది ఆర్టిజన్లకు, 6,115 మంది పెన్షనర్లకు లబ్ది జరగనుంది. మొత్తంగా ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లు కలిపి 71,387 మందికి లబ్ది చేకూరనుంది.

స్కాలర్‌షిప్ బకాయిలు రూ.365.75 కోట్లు

సంక్షేమ శాఖలలో పెండింగ్ లో ఉన్న బకాయిలు అన్ని ఒకేసారి విడుదల చేయాలని ఉప ముఖ్యమంత్రి కీలక నిర్ణయం తీసుకున్నారు. గత ప్రభుత్వ కాలం నుంచి పెండింగ్ లో ఉన్న బిల్లుల బకాయిలు క్లియర్ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రయోజనం కలిగేలా ప్రజా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ.. విద్యలో ప్రభుత్వం ఎక్కడా రాజీ పడదని ఆయన స్పష్టం చేశారు. వీద్యతోనే సమాజంలో సమూల మార్పులు వస్తాయని అన్నారు. బీసీ, ఎస్సీ, ట్రైబల్ వెల్ఫేర్ శాఖలకు రూ.365.75 కోట్లను డిప్యూటీ సీఎం దేశం మేరకు సోమవారం సాయంత్రం ఆర్థికశాఖ అధికారుల విడుదల చేశారు. బీసీ శాఖకు రూ.21.62 కోట్లు, ఎస్సీ సంక్షేమ శాఖకు రూ.191.63 కోట్లు, గిరిజన సంక్షేమ శాఖకు రూ.152.59 కోట్లు విడుదలయ్యాయి. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా పాల్గొన్నారు.

పారదర్శక పాలన అందించండి

(మొదటిపేజీ తరువాయి)

గెలిపించిన నూతన ప్రజాప్రతినిధులు ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేయాలన్నారు. అవినీతి అక్రమాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. పేదలు, బడుగు, బలహీన వర్గాలపై ప్రత్యేక దృష్టి పెట్టి సంక్షేమ పథకాలను అందించాలని కోరారు. పంచాయతీలోని ప్రజల అవసరాలను గుర్తించి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. మహిళలు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కృషి చేయాలని కోరారు. గ్రామంలో సామాజిక సమతుల్యత, ఐక్యతను కాపాడుకోవడం పాలకవర్గం బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, పారిశుధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ప్రజలకు సేవ చేయాలనే తపనతో పని చేస్తేనే ప్రజాప్రతినిధులకు శాశ్వత గుర్తింపు ఉంటుందని అన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులయిన ప్రతి ఒక్కరికీ అందేలా చూడటంలో పాలకవర్గం క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు. గ్రామాభివృద్ధిలో రాజకీయాలకు తావులేకుండా అందరినీ కలుపుకొని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా, సర్పంచి భూక్య శాంతిశ్రీ, ఉప సర్పచి వాసిరెడ్డి మురళి, నూతన వార్డు సభ్యులు, స్థానికులు, అధికారులు పాల్గొన్నారు.

నేడు డిప్యూటీ సీఎం పర్యటన

విశాలాంధ్ర-సత్తుపల్లి: తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే మట్టారాగమయి దయానంద్ మంగళవారం సత్తుపల్లి నియోజకవర్గంలో పర్యటించి వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారని ఎమ్మెల్యే మట్ట రాగమయి దయానంద్ క్యాంపు కార్యాలయం ఇన్చార్జి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 11:30 గంటలకు తల్లాడ మండలం పినపాక గ్రామంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడంతోపాటు కార్యకర్తలను కూడా కలవనున్నారని తెలిపారు. 12:30 గంటలకు సత్తుపల్లి చేరుకొని మధ్యాహ్నం ఒంటిగంటకు సిసిఎల్ జీఎంఎస్ ఆఫీస్ శంకుస్థాపన కార్యక్రమం ఉంటుందన్నారు. మధ్యాహ్నం రెండున్నర గంటల నుండి నాలుగు గంటల మధ్యలో జలగవెంగళరావు ఓపెన్ కాస్ట్ మైన్ ను పరిశీలించి సాయంత్రం నాలుగు గంటలకు విలేకరుల సమావేశం ఉంటుందని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క సత్తుపల్లి ఎమ్మెల్యే మట్ట రాగమయి దయానంద్ పాల్గొనే ఈ కార్యక్రమాల్లో నియోజకవర్గంలోని ఐదు మండలాల కాంగ్రెస్ నాయకులు ,కార్యకర్తలు అభిమానులు యూత్ కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సర్పంచ్, ఉపసర్పంచ్ ప్రమాణస్వీకారం

విశాలాంధ్ర-తుంగతుర్తి : తుంగతుర్తి మండలంలోని గానుగుబండ గ్రామపంచాయతీ నూతన పాలకవర్గం సభ్యులు ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు సోమవారం బాధ్యతలు చేపట్టిన సర్పంచ్ గా మాతంగి వెంకటమ్మకర్ణాకర్, ఉప సర్పంచ్గా యనగందుల లావణ్యమధుసూదన్, నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులు తమ బాధ్యతలను స్వీకరించారు ప్రత్యేక అధికారి ప్రవీణ్ నూతన పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. గానుగుబండ గ్రామ పంచాయితీ కార్యదర్శి భర్పటి కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. గ్రామస్తులు ప్రజాప్రతినిధులు నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన వార్డు సభ్యులు, ఆశలు, వెంకన్న, అనిల్, రమణ, శ్రీశైలం, విజయ, పావని,లక్ష్మి మల్లేష్,ప్రమాణ స్వీకారం అనంతరం, సర్పంచ్ వెంకటమ్మ కర్ణాకర్,ఉప సర్పంచ్ లావణ్య మధుసూదన్ మాట్లాడుతూ,గ్రామ అభివృద్ధి తమ ప్రధాన లక్ష్యమని ప్రజల సహకారంతో పారదర్శకమైన పాలన అందిస్తామని తెలిపారు. త్రాగునీరు పారిశుద్ధ్యం రహదారులు వీధి దీపాలు పేదల సంక్షేమం వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. గ్రామ సమస్యలను ప్రజలతో కలిసి చర్చించి పరిష్కరిస్తామని ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండే విధంగా పాలన సమగ్ర గ్రామాభివృద్ధి ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ సంబరాలు

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో: ఏటూరునాగారం లివింగ్ గాడ్ చర్చ్, దైవ సేవకులు ఎస్. సామెల్ సన్ ఆధ్వర్యంలో,క్రిస్ మాస్ పండుగా సందర్భంగా సోమవారం ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఓడ వాడ, మహారాజుల కాలనీ, ఏటూరునాగారం, ఆకులవారి ఘణపూరం,తాళ్ల గడ్డ, క్రాస్ రోడ్, ప్రాంతాలలో క్రిస్ మాస్ పండుగా సంబరాలు నిర్వహించారు. పాటలు పాడుతూ నృత్యం చేశారు.అనంతరం దైవ సేవకులు ఎస్. సామెల్ సన్ మాట్లాడతూ దేశం, రాష్టం, జిల్లా లు, మండలాలు, గ్రామాలు, ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, అందరు చల్లగా, ఉండాలాని, ప్రతి ఒక్కరికి శాంతి , సమాధానం కలగాలని, ప్రార్ధన చేసి, క్రిస్ మాస్ పండుగా శు భములు తెలిపారు. ఈ కార్యక్రమంలో లివింగ్ గాడ్ చర్చ్ సేవకు రాలు విజయ, సంఘ పెద్దలు సమ్మయ్య, తురుపాటి కుమార స్వామి, (యాకోబు) విశ్వాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ విఠల్‌కి జన్మదిన శుభాకాంక్షలు

విశాలాంధ్ర,కొమరం భీం : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ, సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ దండే విఠల్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా పాల్గొని విఠల్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి విఠల్ చేసిన కృషిని ఈ సందర్భంగా సీఎం ప్రశంసించారు. భవిష్యత్తులో సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు.కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు భారీగా హాజరై విఠల్ ను అభినందించారు. తమకు శుభాకాంక్షలు తెలిపిన నేతలు, కార్యకర్తలకు ఎమ్మెల్సీ విఠల్ ధన్యవాదాలు తెలిపారు.

విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచాలి

విశాలాంధ్ర-నల్గొండ బ్యూరో : విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనుకాకుండా చదువు పట్ల ఆత్మవిశ్వాసం పెంచేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.గురుకుల విద్యాలయాల్లో విద్యార్థులు ఒత్తిడితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్న కలెక్టర్, ఇందుకు కౌన్సెలింగ్ మరియు మానసిక అవగాహన కార్యక్రమాలు తప్పనిసరిగా చేపట్టాలని సూచించారు. అనుభవజ్ఞులైన కౌన్సెలర్లను అందుబాటులో ఉంచి, క్రీడలు మరియు సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థుల మానసిక ఆరోగ్యం మెరుగుపరచాలని తెలిపారు.అలాగే వెల్ఫేర్ హాస్టళ్లలో విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్ వార్షిక సాంస్కృతిక ఉత్సవం

విశాలాంధ్ర , కాప్రా : నాచారంలోని డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్ ఇనారా2,0 పేరుతో నిర్వహించిన వార్షిక సాంస్కృతిక ఉత్సవాలు ఘనంగా జరిగాయి. రెండు రోజుల పాటు జరిగిన ఈ ఉత్సవాల్లో విద్యార్థులు తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించి పలువురి మన్ననలు పొందారు. స్కూల్ ఈ యేడాది సర్వోత్కృష్టా ఇతివృతంగా నిర్వహించిన ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రఖ్యాత కళాకారిణి గీతాభాస్కర్ విద్యార్థుల కళాత్మక వ్యక్తీకరణలను, ప్రతిభను పెంపొందించడంలో పాఠశాల అంకితభావాన్ని ప్రశంసించారు. కార్యక్రమంలో పాల్గొన్న స్కూల్ చైర్మన్ నవనీతరావు తమ ప్రసంగంతో విద్యార్థుల్లో నూతన ఉత్తేజాన్నినింపారు.మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ కుమార్, సమగ్ర విద్య పట్ల పాఠశాల నిబద్ధతను నొక్కి చెప్పారు. రెండవ రోజు జరిగిన కార్యక్రమానికి ఐఏఎస్ అధికారి కట్టా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో పౌర విలువలు , సాంస్కృతిక అక్షరాస్యతను పెంపొందించడంలో పాఠశాల ప్రయత్నాలను ఆయన ప్రశంసించారు.

ఓటర్ జాబితా పకడ్బందీగా తయారు చేయాలి: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో ఖమ్మం : ఎస్ఐఆర్ ఓటర్ జాబితా పకడ్బందిగా తయారు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈఓ సుదర్శన్ రెడ్డి సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి పాల్గొన్నారు. ఎస్.ఐ.ఆర్. నిర్వహణ, ప్రిపరేటరీ కార్యాచరణలో పురోగతి ఉండాలని, రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈఓ సమీక్షించి, అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం అధికారులతో లిజిల్లా కలెక్టర్

మాట్లాడుతూలి ఖమ్మం జిల్లాలో ఉన్న ఓటరు జాబితాలో 40 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న వారి జాబితా, 40 సంవత్సరాల కంటే ఎక్కువ ఉన్న వారి జాబితా సిద్ధం చేసుకోవాలని అన్నారు. ఎస్.ఐ.ఆర్. ప్రక్రియ గతంలో 2002 లో నిర్వహించడం జరిగిందని, ఎస్.ఎస్.ఆర్. 2025 జాబితాలో 40 ఏళ్ళ కంటే ఎక్కువ వయస్సు ఉన్న వారిని ఎస్.ఐ.ఆర్. 2002 జాబితాతో మ్యాపింగ్ ప్రక్రియ బూత్ స్థాయిలో 15 రోజులలో పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఎస్.ఐ.ఆర్. నిర్వహణ కంటే ముందు ప్రతి పోలింగ్ బూత్ స్థాయిలో 2002 ఎస్.ఐ.ఆర్. డేటాను 2025 ఎస్.ఎస్.ఆర్. డేటా తో సరిపోల్చి చూసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో తహసిల్దార్లు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ఎం.ఏ. రాజు, ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ అన్సారి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ చికిత్సతో వ్యక్తిని బ్రతికించిన ప్రభుత్వ వైద్యులు

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : వ్యక్తిగత కారణాలతో క్షణికావేశానికి గురై గొంతు కోసుకున్న వ్యక్తిని ఉత్తమ చికిత్స అందించి బ్రతికించారని వైద్యులను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కొనియాడారు. వివరాల్లోకి వెళితే... రెండు వారాల క్రితం కొత్తగూడెంలో బస్టాండ్ దగ్గర నూడిల్స్ బండి నడిపే పశ్చిమ బెంగాల్ వ్యక్తి బిశాల్ తమంగ్ వ్యక్తిగత కారణాల దృష్ట్యా గొంతుకోసుకొని ఆత్మహత్య యత్నం చేసాడు. దింతో అతని గొంతు లోతుగా తెగడంతో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యలో కుటుంబ సభ్యుల ద్వారా సమాచారం అందుకున్న డాక్టర్ రవిబాబు పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలో అతనికి శస్త్ర చికిత్స చేశారు. ఆశలు వదులుకున్న తరుణం లో స్వతహాగా గొంతు స్పెషలిస్ట్ అయిన రవి బాబు పాల్వంచ ఆసుపత్రి సిబ్బంది తో కలిసి రెండు గంటలు శ్రమించి ఆపరేషన్ సక్సెస్ చేసారు.

అబ్సర్వేషన్ కోసం భద్రాచలం ఆసుపత్రిలోని ఐసీయూ కి తరలించారు. రెండు వారాలు పాటు చాలా శ్రద్ధతో చికిత్స అందించి సోమవారం డిశ్చార్జ్ చేశారు. ఈ సందర్భంగా భద్రాచలం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే వెంకట్రావు, పాల్గొని రోగి పరిస్థితిపై మాట్లాడారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో జరగాల్సిన ఆపరేషన్ ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో సాహసోపేతంగా గోల్డెన్ అవర్ లో ఆపరేషన్ చేసి ప్రాణాలు నిలిపిన డాక్టర్ రవి బాబు, పాల్వంచ ఆసుపత్రి బృందాన్ని అభినందించారు. అలాగే ఎంతో ఓపికతో ఇరవై నాలుగు గంటలు రోగికి చికిత్స చేస్తూ కోలుకోవడం లో విశేష కృషి చేసిన భద్రాచలం ఐసీయూ సేవల్నివారు ప్రశంసించారు. ఈ చికిత్స ప్రభుత్వ ఆసుపత్రి సేవలకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. వైద్యులకు సహకారం, మనోధైర్యం ఇస్తే ఏజెన్సీ లో అయినా గొప్ప వైద్య సేవలు జరుగుతాయని తెలిపారు. ఏజెన్సీ జిల్లాలో సూపర్ స్పెషాలిటీ సేవలు అందించిన డాక్టర్లు రవి బాబు, రామ్ ప్రసాద్, సోమరాజు దొర, ప్రసాద్, రామ కృష్ణ, మల్లేష్, నిఖిత, కౌండిన్య, తేజస్వి ఇతర వైద్య సిబ్బందిని కలెక్టర్, ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు.

సింగరేణి పురోభివృద్ధికి నిర్మాణాత్మకంగా పని చేయాలి

విశాలాంధ్ర, మంథని : గతంలో గుర్తింపు సంఘంగా అనుభవం కలిగిన తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నాయకులు కార్యకర్తలు కార్మికుల సంక్షేమానికి మరియు నిర్దేశిత బొగ్గు ఉత్పత్తికి కంపెనీ పురోభివృద్ధికి సైతం నిర్మాణాత్మక పాత్ర పోషించాలని ఓసి 1 ప్రాజెక్టు అధికారి ప్రవీణ్ వి ఫాటింగ్ పేర్కొన్నారు సోమవారం ఓసిపి 1 నూతన పిట్ కమిటీని పిఓ తో పాటు కాలరీ మేనేజర్ ఆర్ పాపయ్య మరియు సంక్షేమాధికారి సాయి స్వరూప్ గార్లకు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆర్జీ 3 ఉపాధ్యక్షులు నాగెల్లి సాంబయ్య నూతన కమిటీ సభ్యులను పరిచయం చేశారు. ఓసి 1 పిట్ సెక్రటరీ గా గిటుకు శ్రీనివాస్ , నాన్ ఆపరేషన్ ఫిట్ సెక్రటరీ భోగం పూర్ణాకర్, సెంట్రల్ కమిటీ నాయకులు జి చంద్రశేఖర్ బి శ్రీకాంత్ రావు తోపాటు సభ్యులను పరిచయం చేశారు అసిస్టెంట్ పిట్ సెక్రటరీలుగా చెలిమెల శ్రీనివాస్, సైన్ల

సత్యనారాయణ, కే మల్లేశం షిఫ్టు మరియు సెక్షన్ ఇంచార్జిలుగా దురికి తిరుపతి, అబ్దుల్ కమర్, ఎండి షఫీక్, కొండా రవి, డి శ్రీనివాస్, ఎం నర్సింగరావు, బి బాబురావు జి తిరుపతి ఎస్వి రావు, తో పాటు జాయింట్ సెక్రటరీలుగా మండల శ్రీనివాస్, గరిమెల రవీందర్, ఠాకూర్ రూపేష్ సింగ్, జె.సాయికుమార్, కుంట సత్యం, పి శ్రీకాంత్, కె.వి రాఘవరెడ్డి,కూతాటి వెంకటయ్య, సిహెచ్ శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సముద్రాల మహేందర్, నరివేద్దీ రవీందర్, కొండ తిరుపతి, అంబాల కొమరయ్య, వేణుగోపాల్ రెడ్డి, కే కొమ్మాలు, సిహెచ్ కుమార్, బ్రాంచ్ కమిటీ మెంబర్లు తొగరి ప్రవీణ్ నల్ల అశోక్ అల్లం తిరుపతి మైపాల్ రెడ్డి వేగోళం మల్లయ్య అదేవిధంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ప్రాజెక్ట్ అధికారి ప్రవీణ్ ఫాటింగ్ కు ఘనంగా స్వాగత సత్కారం నిర్వహించి పుష్పగుచ్చం అందించి శాలువాతో సన్మానించారు . ఈ సందర్భంగా ఉపాధ్యక్షులు నాగేల్లి సాంబయ్య మాట్లాడుతూ తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం అధికారంలో ఉన్న సందర్భంలో కార్మికుల సంక్షేమం కోసం మరియు కంపెనీ అభివృద్ధికి చేసిన కృషిని ఇప్పటికీ అందరూ మెచ్చుకుంటున్నారని వివరించారు ఈ కార్యక్రమంలో సెంట్రల్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ పింగిలి సంపత్ రెడ్డి, సెంట్రల్ నాయకులు దేవ శ్రీనివాస్ ,పాశం శ్రీనివాస్ రెడ్డి , కేశవరావు గట్టు శ్రీనివాస్, మరియు వివి గౌడ్ పూసల శేఖర్ గండి శ్రీనివాస్ , తదితరులు పాల్గొన్నారు.

ముస్లీం సమాజ సంక్షేమం లక్ష్యంగా కొత్త కార్యవర్గం

విశాలాంధ్ర బ్యూరో -పెద్దపల్లి: పెద్దపల్లి పట్టణంలో యునైటెడ్ ముస్లిమ్స్ వెల్ఫేర్ సొసైటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం పట్టణంలోని ఎంపీ గార్డెన్ లో ఏర్పాటు చేసిన ఎన్నికల బూతులో సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకొని సొసైటీ భవిష్యత్తు కార్యక్రమాలకు నాయకత్వం వహించబోయే వారిని ఎన్నుకున్నారు.ఈ ఎన్నికల్లో పట్టణ అధ్యక్షుడిగా అస్లాం పర్వేజ్, ప్రధాన కార్యదర్శిగా సైఫుల్లా ఖాన్ తబ్రోజ్ విజయం సాధించారు.యువత సీనియర్ సభ్యుల నుంచి వీరికి లభించిన మద్దతు వారి విజయానికి దోహదపడింది.అలాగే,పట్టణ

ఉపాధ్యక్షులుగా మహమ్మద్ లయాక్ ఉల్లాహ్ మౌలానా,కోశాధికారిగా మహమ్మద్ మిస్బాహుద్దీన్ లు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష,కార్యదర్శులు అస్లాం పర్వేజ్, సైఫుల్లా ఖాన్ తబ్రోజ్ మాట్లాడుతూ పట్టణంలోని ముస్లీం సమాజ సంక్షేమం మరియు అభివృద్ధికి పాటుపడతామని హామీ ఇచ్చారు.విద్య,ఆరోగ్య సంరక్షణ మరియు పేద విద్యార్థులకు సహాయం అందించడం వంటి కార్యక్రమాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నట్లు తెలిపారు.యువతను సామాజిక సేవలో భాగస్వామ్యం చేయడం తమ ప్రధాన లక్ష్యమని కూడా వివరించారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే,కొత్త కార్యవర్గానికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు,పుర ప్రముఖులు మరియు ముస్లీం మత పెద్దల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి.సొసైటీ సేవలు పట్టణ అభివృద్ధిలో మరింత కీలకంగా మారుతాయని పలువురు ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి : జేసీ

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో: ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులు సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ రెవిన్యూ సి. హెచ్. మహేందర్ జి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి. హెచ్. మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు అర్జీదారుల నుండి

దరఖాస్తులు స్వీకరించారు. ఈ రోజు ప్రజావాణి కార్యక్రమంలో 35 దరఖాస్తులు రాగా అత్యధికంగా భూ సమస్యలు 08, గృహ నిర్మాణ శాఖకు 04, పెన్షన్ 06, ఇతర ఇతర శాఖలకు సంబంధించినవి 17 దరఖాస్తులు స్వీకరించగా వాటిని వెంటనే సంబంధిత అధికారులకు బదిలీ చేసి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులు పూర్తి చేయాలి

విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల జిల్లా: జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డు లో చేపట్టిన ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న ప్రభుత్వ ఆసుపత్రి, క్రిటికల్ కేర్ విభాగం నిర్మాణ పనులను ఆకస్మికంగా సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలను మరింత అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం 129.25 కోట్ల రూపాయల వ్యయంతో ప్రభుత్వ ఆసుపత్రి, 23.75 కోట్ల రూపాయల వ్యయంతో క్రిటికల్ కేర్ విభాగం ఏర్పాటు చేస్తుందని తెలిపారు. వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ ప్రజలకు మరింత చేరువలో వేగవంతమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఇందులో భాగంగా ప్రభుత్వ వైద్య కళాశాల ద్వారా వైద్యులు, సిబ్బంది సంఖ్య పెంపొందించేందుకు కృషి చేస్తుందని తెలిపారు. ఈ క్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి, క్రిటికల్ కేర్ విభాగం నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు గుత్తేదారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. అంతకుముందు పాత మంచిర్యాల ప్రాంతంలో కొనసాగుతున్న ఇందిరా మహిళా శక్తి భవన్ నిర్మాణ పనులను పరిశీలించారు. మహిళల సంక్షేమం, అభివృద్ధి దిశగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని, ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక చేయూత అందించి మహిళలు ఆర్థిక స్వావలంబన పొందే విధంగా ప్రోత్సహిస్తుందని తెలిపారు. మహిళా భవన్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు.

పల్లెల్లో పౌరుషాలు వద్దు అందరి కలయికే ముద్దు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర బ్యూరో నిర్మల్ జిల్లా ఖానాపూర్ : మండలంలోని మస్కాపూర్ గ్రామపంచాయతీలో, సోమవారం రోజున జరిగిన సర్పంచ్ ఎలక్షన్ల ప్రమాణ స్వీకార మహోత్సవానికి, ఖానాపూర్ ఎమ్మెల్యే వేడుమ బొజ్జ పటేల్ ముఖ్యఅతిథిగా హాజరై, సర్పంచ్ గా గెలిచిన దొరికిన లక్ష్మి ప్రమాణ స్వీకారం జరిగిన తదుపరి ఎమ్మెల్యే మాట్లాడుతూ పంచాయితీ ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజం , సర్పంచ్ల ఎలక్షన్లు అంటే ఏ విధంగా ఉంటాయో నాకు తెలుసు ఎమ్మెల్యేగా గెలవాలంటే ఈజీగా గెలవచ్చు కానీ సర్పంచ్ గెలవాలంటే పల్లె పోరు ప్రాలో బాల పేతంగా ఉంటుందని, అలా కాకుండా సమస్యల పరిష్కార దిశగా అడుగులు వేస్తూ పల్లె ప్రజలంతా ఏకం కావాలి అంతేకానీ పౌరుషాలకు వెళ్లి కక్ష సాధింపుగా మెదులవద్దు, ఏ పార్టీలో పని చేసే వారైనా పల్లె అభివృద్ధి దశలో అడుగులు వేసే విధంగా అందరూ కలిసి కట్టుగా మెదులుతూ, పల్లెలను అభివృద్ధి పరచుకోవాలని నా యొక్క ఆకాంక్ష అని పల్లె ప్రజలందరికీ విన్నవించారు, అదేవిధంగా దొన్కెన లక్ష్మీ దయానంద్ లు కోరిన మేరకు కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలిచిన నుండి ఎన్నో నిధులు మంజూరీ చేయించాను అంతేకాకుండా చెరువుకట్ట పైన ఉన్న రోడ్డును మినీ ట్యాంక్బండ్ గా మార్చే ఎందుకు నిధులు మంజూరయ్యే విధంగా చర్యలు తీసుకుంటానని, అన్నారు ఈ కార్యక్రమంలో తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యం మాజీ చైర్మన్, అంకం రాజేందర్ నిమ్మల రమేష్ యూసుఫ్ ఖాన్ తదితర పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

అణగారిన వర్గాల ఆశాజ్యోతి వెంకటస్వామి

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి,సింగరేణి: అణగారిన వర్గాల ఆశాజ్యోతి మాజీ మంత్రి అమరజీవి జి.వెంకటస్వామి అని రామగుండం రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ అన్నారు. సోమవారం గోదావరి ఖని లో వెంకటస్వామి 11వ వర్ధంతి సందర్భంగా జియం ఆఫీస్ వద్ద గల వెంకటస్వామి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదల పెన్నిధి, ఎంతో మంది నిరుపేదలకు గూడు కల్పించిన తెలంగాణ ముద్దుబిడ్డ, మాజీ కేంద్ర మంత్రి మరియు పెద్దపల్లి మాజీ మొంత్రి కాకా వెంకటస్వామి ప్రజాహిత సేవలతో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెసు నాయకులు పాల్గొన్నారు.

డబ్బుతో కమ్యూనిస్టులను కొనలేరు : సురేష్

విశాలాంధ్ర , ఏదులాపురం మున్సిపాలిటీ : డబ్బుతో కమ్యూనిస్టులు కొనలేరని...సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అన్నారు. సోమవారం ఖమ్మం రూరల్ మండలంలోని గూడూరు పాడు గ్రామంలో సర్పంచ్ గెలుపు విజయోత్సవ సభను బండి మాధవరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. తొలుత గ్రామపంచాయతీ కార్యాలయంలో నూతన సర్పంచ్ గా పుచ్చకాయల కమలాకర్ శ్రీదేవి బాధ్యతలు స్వీకరించారు. ఉప సర్పంచ్ గా బట్టు సుభద్ర, వార్డు మెంబర్లుగా జూకంటి పుష్పవతి , ఎలటూరి నాగమణి, తరుణం అరుణ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ... కుల మతాలకతీతంగా ప్రజల పక్షాన సిపిఐ పార్టీ ఎనలేని సేవలు అందిస్తూ, గ్రామ అభివృద్ధిలో కృషి చేస్తుందన్నారు . అందుకు తగ్గట్టుగానే ఇక్కడి ప్రజలు ఎర్ర జెండాకు అండగా నిలుస్తున్న తీరే తార్కానంగా పేర్కొన్నారు.రాజకీయ ఊసరవెల్లులు డబ్బు రాజకీయాలు చేయాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. అటువంటి కుటిల రాజకీయాలు ఇక్కడ సాధ్యపడదు అన్నారు. కమ్యూనిస్టులకు పోరాటాలు కొత్తేమీ కాదన్నారు. నికార్సైన కమ్యూనిస్టులకు నెలవైన గూడూరు పాడులో ఎర్రజెండా రెపరెపలను ఆపలేరన్నారు. అనంతరం సర్పంచ్ పుచ్చకాయల శ్రీదేవి కమలాకర్ ఆధ్వర్యంలో టిఆర్ఎస్ నుంచి నాలుగు కుటుంబాలు సిపిఐ లో చేరాయి. వీరికి సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఎర్రజెండాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సిద్దినేని కర్ణ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు పుచ్చకాయల కమలాకర్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కర్, వెంపటి సురేందర్, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, మాజీ సర్పంచ్ బండి ఉపేందర్, మాజీ ఉపసర్పంచ్ చందన బోయిన రామారావు, సిపిఐ గ్రామ నాయకులు కుర్రి అచ్చయ్య, బండి నరేష్, మారుతి నరేష్, దాసరి పున్నయ్య, బండి మహేష్ పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి

విశాలాంధ్ర కారేపల్లి: గ్రామ అభివృద్ధే లక్ష్యంగా, ఎజెండాగా నూతనంగా ఎన్నికైన సర్పంచులు పెట్టుకొని పని చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రావి శివరామకృష్ణ పిలుపునిచ్చారు సోమవారం మండల పరిధిలోని బాజుమల్లాయిగూడెం గ్రామపంచాయతీలో సిపిఐ పార్టీ నుండి నూతనంగా ఎన్నికైన సర్పంచ్ కోరం కోటమ్మ తోపాటు ఉపసర్పంచ్ పోతురాజు ఉపేంద్ర పాలకమండలి ప్రమాణ స్వీకార మహోత్సవానికి అయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేయాలని గ్రామ అభివృద్ధికి అందరి సహాయ సహకారాలు అవసరమన్నారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీలకు ఇచ్చే నిధులను పెంచి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.బాజు మల్లాయిగూడెంలో పెండింగ్ లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం నూతనంగా ఎన్నికైన పాలకవర్గం కృషి చేయాలన్నారు.అనంతరం నూతన పాలకవర్గాన్ని అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల సిపిఐ పార్టీ కార్యదర్శి పాపినేని సత్యనారాయణ జిల్లా సమితి సభ్యులు ఉంగరాల సుధాకర్ ఏ ఐటీయుసి నాయకులు వీరు నాయక్,దుద్దుకూరు వెంకటేశ్వరరావు,రాయల రామారావు,భాగం వెంకన్న శాఖా కార్యదర్శి బొమ్మగాని మహేష్,వార్డు సభ్యులు ఈసాల వెంకటేశ్వర్లు,కోరం రాధ,జర కోటమ్మ,నాయకులు పుసులూరి రాంబాబు,రాజు తదితర నాయకులు పాల్గొన్నారు.

వీర్ బాల్ దివస్‌తో యువతలో ధైర్యం

విశాలాంధ్ర,కొమరం భీం : వీర్ బాల్ దివస్ ద్వారా యువతలో ధైర్యం, సమగ్ర మానవత్వ విలువలను ప్రోత్సహించడం జరుగుతుందని జిల్లా సంక్షేమ అధికారి ఆడెపు భాస్కర్ ఒక ప్రకటనలు తెలిపారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీ వరకు వీర్ బాల్ దివస్ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి సంవత్సరం డిసెంబర్ 26వ తేదీన జరగనున్న కార్యక్రమంలో భాగంగా వివిధ రకాల అంశాలపై పోటీలను నిర్వహించడం జరుగుతుందని, అంగన్వాడి పాఠశాలలలో కథలు చెప్పడం, ఆటలు, ప్రాథమిక పాఠశాలలలో బొమ్మలు గీయడం, కథలు చెప్పడం, బాల బాలికల ఉన్నత పాఠశాలలలో వ్యాసరచన పోటీలు, ముగ్గులు, కళాశాలలలో సందేశాత్మక నాటికలు సమగ్ర అంశాలపై చర్చ, వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి ఈ నెల 30వ తేదీన జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతుల ప్రధానోత్సవం జరుగుతుందని తెలిపారు.

పడమటి అనంతరెడ్డి ప్రమాణస్వీకారం

విశాలాంధ్ర బ్యూరో,సంగారెడ్డి : కొండాపూర్ మండలం గుంతపల్లి గ్రామసర్పంచ్‌గా బి ఆర్ ఎస్ యువ నాయకుడు పడమటి అనంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం సోమవారం నాడు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పాలకవర్గ సభ్యులు తమ బాధ్యతలను అధికారికంగా స్వీకరించారు. ప్రమాణ స్వీకారం అనంతరం సర్పంచ్ అనంత్ రెడ్డి మాట్లాడుతూ గ్రామము ఈ సమస్య వచ్చినా ముందుంటానని అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. గుంతపల్లి గ్రామ సర్వతోముఖాభివృద్ధికై కృషి చేస్తానని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సంపాదకీయం

మాయాలోకం కాదిది!

పేరుకే శాఖలు... నిష్క్రియాపరత్వమే వాటి చేతలు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పనిచేయని, చేయలేని మంత్రిత్వ శాఖలు కొన్ని ఉన్నాయి. అందులో సినిమాటోగ్రఫీ శాఖ ఒకటి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి స్టార్ హీరోల సినిమా టిక్కెట్లను పెంచే విషయంలో 'ఒక మాట చెప్పడానికి' తప్ప పూర్తిగా పనిచేయని శాఖ ఏదైనా ఉందంటే అదొక్కటే. విచిత్రమేమిటంటే, జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో అసలు ఈ శాఖ అనేది ఒకటుందన్న విషయమే మర్చిపోయారు. ఆనాడు కూడా టిక్కెట్లపై రచ్చకే తప్ప ఈ శాఖ ముందుకొచ్చిన సందర్భాలేమీ లేవు. తాజాగా రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ మీడియాతో మాట్లాడుతూ, వచ్చే ఉగాది నాటికి ఆంధ్రప్రదేశ్‌లో నంది అవార్డులతో పాటు నంది నాటకోత్సవాలను నిర్వహించాలనే ఆలోచనలో ఉన్నామని ప్రకటించడం తెలుగు సినీ పరిశ్రమకు ఊరటనిచ్చింది. దీని ఉద్దేశం అందరికీ అవార్డులు వస్తాయని కాదు, సినీ పరిశ్రమపై ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారిస్తుందన్న ఆశ రేకెత్తిస్తున్నందుకు సంతోషం. సినిమా ఓ మాయాలోకం కావచ్చు. అదొక జనచైతన్యవేదిక అన్న విషయాన్ని మర్చిపోరాదు. రెండు తెలుగు రాష్ట్రాలకూ ఒకటే సినీ పరిశ్రమ ఉంది. అది టాలీవుడ్. దీనికి తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ కేంద్రం. నిజానికి ఏపీకి ప్రత్యేకించి సినీ పరిశ్రమంటూ ఏమీ లేదు. దీనికి ప్రత్యేక కేంద్రమూ లేదు. బహుశా అందుకేనేమో, ఏపీలో సినిమాటోగ్రఫీ శాఖకు తాళాలు వేయాల్సి వచ్చింది. టాలీవుడ్ హైదరాబాద్‌దే అయినప్పటికీ, కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న పదేళ్లూ ఆ పరిశ్రమను జీరోస్థాయిలో పట్టించుకున్నారు. కనీసం నంది అవార్డులూ ఇవ్వలేదు. నంది అనేది ఆంధ్రా ప్రాంత నేతలు సృష్టించిన బొమ్మ అనీ, అందుకే ఆ అవార్డులు ఇవ్వకూడదన్న భ్రమలో ఆయన ఉండిపోయి ఉండవచ్చు. కానీ, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నంది అవార్డుల స్థానంలో గద్దర్ అవార్డులనే పేరుతో ఏకంగా పదేళ్ల కాలానికి పురస్కారాలిచ్చి శభాష్ అన్పించుకున్నది. రేవంత్‌రెడ్డి నిజమైన తెలుగోడు అని కీర్తనలు ఆలపించినా తక్కువే. అంతేకాదు, సినీ పరిశ్రమ ప్రముఖులతో చర్చలు జరిపి, టాలీవుడ్ అభ్యున్నతికి మూడడుగులు ముందుకేయడం ప్రశంసనీయం. ఇటు ఏపీలో అలాంటి ప్రయత్నమేదీ జరగకపోవడం విచారకరం. రాష్ట్ర విభజనానంతరం ఏర్పడిన టీడీపీ ప్రభుత్వం నంది పురస్కారాలు ప్రకటించి మంచి పనే చేసింది. వైసీపీ పాలనలో అది పూర్తిగా పడకేసింది. ఇప్పుడు కూటమి హయాంలో ఎలాంటి మార్పులేదు. మంత్రి కందుల దుర్గేష్ ఇప్పటికిప్పుడు సినీ పరిశ్రమను ఉద్ధరిస్తారని చెప్పలేం. కనీసం ఈ పరిశ్రమకు సంబంధించిన సమస్యలపై త్వరలోనే చర్చిస్తామని చెప్పడం ఒకింత శుభపరిణామం.

ఇక్కడొక మాట! సినీ పరిశ్రమను ప్రోత్సహించడమంటే...హరిహర వీరమల్లు, అఖండ–2 వంటి సినిమాలకు జేజేలు కొట్టి, అధునాతన సమాజాన్ని సనాతన సమాజంలోకి నెట్టేయడం కాదు. నేటి సమాజాన్ని అభివృద్ధివైపు నడిపించేది కావాలి. దేవుళ్లు, దయ్యాల పేరుతో ప్రజల మనోభావాలతో ఆటలాడుకొని, సొమ్ములు చేసుకోవడం గర్హనీయం. సినిమాల్లో ఇటీవల అత్యంత ప్రమాదకరమైన ధోరణి ఒకటి ప్రబలంగా కన్పిస్తోంది. సమాజ గమనాన్ని తిరోగమనంవైపు మోసుకుపోవడానికి చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేస్తుండటం బాధాకరం. మతతత్వ శక్తుల పాలనలోకి దేశం వెళ్లిపోయిన తర్వాతనే ఈ ధోరణులు పెరిగాయి. సినిమా అనేది ఒక ప్రధాన మాధ్యమం కావడంతో దాని ద్వారా అశాస్త్రీయ భావాలను పెంచిపోషించడం, కుదిరితే విద్వేషాలను రెచ్చగొట్టడం... ఇదీ ఈ తరహా సినిమాల వరుస. హిందూత్వ భావజాలంతో సంభాషణలు, కథలు రాస్తే కాసులు రాలుతాయన్న ప్రగాఢ విశ్వాసం కొంతమంది దర్శకుల్లో పాతుకుపోయింది. ప్రస్తుతం ఏపీలోని ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వంలో ఇద్దరు టాప్ హీరోలున్నారు. ఒకరు పవన్ కళ్యాణ్, ఇంకొకరు నందమూరి బాలకృష్ణ. ఇద్దరూ సనాతన ధర్మ ప్రచారకర్తలుగా మార్మోగిపోతున్నారు. ఓవైపు ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న చంద్రబాబు ఏఐ వంటి అత్యంత అధునాతన సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధిపై దృష్టిపెడుతుంటే, ఈ ఇద్దరు హీరోలు మాత్రం ఆరువేల శతాబ్దాల క్రితం నాటికి దేశాన్ని తీసుకుపోవాలని తహతహలాడి పోతున్నారు. వారు నటించిన తాజా సినిమాల్లో ఈ విషయం స్పష్టంగా గోచరించింది. వీరు మాత్రమే కాదు, బీజేపీ పెద్దలను సంతృప్తిపర్చడానికి బాలీవుడ్‌లోనూ దర్శకనిర్మాతలు తెగ ఉత్సాహపడిపోతున్నారు. 'ఆర్టికల్ 370', 'బెంగాల్ 1947', 'కశ్మీర్ ఫైల్స్', 'కేరళ స్టోరీ', 'గోద్రా', 'మై అటల్ హూ', 'జేఎన్‌యూ', 'స్వతంత్రవీర్ సావర్కర్' వంటి సినిమాలతోపాటు ఈమధ్యనే తెలంగాణలో విడుదలైన 'రజాకార్' వంటి చిత్రాలు మహోన్నత భారత చరిత్రను పక్కదారి పట్టించేవే. నేటి తరానికి తప్పుడు చరిత్రను అందించడానికి మతోన్మాద శక్తులు ఏ మాత్రం వెనుకాడటం లేదని చెప్పడానికి మచ్చుకు ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. దీనికి కేంద్ర ప్రభుత్వం నూటికి నూరు శాతం తోడ్పాటునిస్తున్నది. ఇలాంటి సినిమాలకు టిక్కెట్ల రాయితీలు, అభిమాన వెర్రితో ఊగిపోయే ఫ్యాన్స్‌ను నట్టేట ముంచడాలు వంటి దారుణ ఆగడాలు అడ్డూఅదుపూ లేకుండా 'అధికారికంగానే' సాగుతుండటం దేశ ప్రతిష్టకే అవమానకరం. ఆర్ఎస్ఎస్ అనేది దేశంలో ఓ విద్రోహశక్తి. బ్రిటీష్‌వారి కాలంలో ఈ సంఘపరివార్ సాంతం బ్రిటీష్‌వారి తొత్తులుగా వ్యవహరించి జాతీయోద్యమ స్ఫూర్తికే వెన్నుపోటు పొడిచింది. నాటి ఆర్ఎస్ఎస్ నాయకులను ఒక సినిమాలో స్వాతంత్ర్య సమరయోధులుగా చూపిస్తుంటే, సగటు భారతీయుల ఆగ్రహావేశాలు కట్టలు తెంచుకోకుండా ఉంటాయా? ఓ బీజేపీ నేత తీసిన రజాకార్ సినిమాను చూస్తే, వీర తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో కనీసం పది పుటలు చదివిన వ్యక్తిని అడిగినా, ఆ సినిమా ఎంత తప్పుదారి పట్టిస్తుందో ఇట్టే అర్థమైపోతుంది. అదృష్టవశాత్తూ ఈ సినిమా అట్టర్‌ఫ్లాప్ కావడంతో జనం బతికిపోయారు. కేరళ ప్రభుత్వం ఇటీవలనే ఒక చలన చిత్రోత్సవం నిర్వహించింది. ఈ ఉత్సవంలో జనజాగృతిని తట్టిలేపే 19 సినిమాలు ప్రదర్శనకు నోచుకున్నాయి. కానీ కేంద్ర ప్రభుత్వం కేవలం నిమిషాల వ్యవధిలో ఈ 19 సినిమాలపై నిషేధం విధించి, తమ ఫాసిజాన్ని బయటపెట్టుకున్నది. ఈ విషయాలన్నీ ఏపీ ప్రభుత్వం మననం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఏపీలో ప్రత్యేక చలనచిత్ర పరిశ్రమ అనేది లేదన్న వాస్తవాన్ని ముందుగా దృష్టిలో పెట్టుకొని, ఆ దిశగా షూటింగ్స్‌కూ, స్టుడియోల నిర్మాణానికి, సాంకేతిక అభివృద్ధికి ప్రోత్సాహకాలను ఇవ్వడంతోపాటు తక్షణమే నంది అవార్డులను ప్రకటించి సినీ పరిశ్రమను ఉత్సాహపరచాలి. సినీ రంగాన్ని ఓ మాయాప్రపంచంగా భావించకుండా, దీనిపై ఆధారపడి బతికే లక్షలాది మంది సినీ కార్మికుల సంక్షేమానికి దోహదపడే పథకాలు చేపట్టడం అత్యవసరం, అనివార్యం.

'కల' కలము

చింతపట్ల సుదర్శన్

అదో పెద్ద కోట. కోట లోపల ఓ మేడ, మేడ లోపల ఓ పెద్ద హాలు. హాలులో ఈ పక్కా ఆ పక్కా ఆసనాలు. హాలులో ఎత్తయిన వేదిక. వేదిక నెక్కడానికి మెట్లు. వేదిక మీద ఓ సింహాసనం. ఇలాంటిదీ అలాంటిదీ కాదు. బంగారు సింహాసనం. సింహాసనంలో, ఆనుకోడానికి 'మఖమల్ బాలీసులు'. ఆ పక్కా ఈ పక్కా 'ఫంకా' లు పట్టుకున్న సుందరీమణులు. అక్కడంతా హడావిడిగా ఉంది. హాలు ప్రధాన ద్వారం నుంచి తలపాగాలు సర్దుకుంటూ వస్తున్నారు 'వీఅయిపీ' లు. నిశ్శబ్దంగా ఉన్న హాలు క్రమక్రమంగా ప్రాణం పోసుకుంది. ఆసనాల్లో సర్దుకు కూచున్నారు ప్రముఖులు, రాజ ప్రముఖులు, పుర ప్రముఖులు. అంతా బానేవుంది కానీ వేదిక మీద గాలి విసరడానికి 'రడీ'గా ఉన్న 'పంఖామణులు' తప్ప ఎవరూలేరు. కనకపు సింహాసనంలో కూర్చోబోయేది ఎవ్వరో తెలీడం లేదు.

ఉన్నట్టుండి తల పొగరు వాళ్లూ, తలపాగాల వాళ్లూ లేచి నిలబడసాగారు. ఎక్కడ్నించో రాజాధిరాజ, రాజమార్తాండ, రాజగంభీర బహుపరాక్! అన్న మాటలు వినపడ్డయి. అప్పుడు కనిపించాడు కనకపు సింహాసనంలో కూచోబోయే వాడు. పొడుగాటి సిల్కు అంగరఖా వీపుని కప్పేసి ఉంది. అది నేలను ఊడుస్తూ ఉంటే

ఈ పక్కా ఆ పక్కా విచ్చు కత్తులతో అంగరక్షకులు, ఆ వెనుక గొంతు చించుకుంటున్న భజంత్రీగాళ్లు. సింహాసనం ఎక్కబోయే వాడు సింహంలానో, పులిలానో నడవడం లేదు. ముందు కాళ్లు ముందుకు రెండడుగులు వేస్తే, వెనక కాళ్లు ముందు కాళ్లు వేసి దాటిన అడుగుల్ని అనుసరిస్తూ నడిచేయి. నాలుగు కాళ్లూ మోస్తున్న ఓ శరీరం మెట్లు ఎక్కి సభాసదుల వైపు తిరిగి ముందుకాళ్లు పైకెత్తి లేచి నిలబడ్డ సభలోని జనాన్ని కూర్చోండంటూ సైగచేస్తూ సింహాసనంలో ఠీవిగా కూచుంది, బాలీసుల కానుకుని తలమీది కిరీటం ధగధగలాడుతుంటే!

కనకపు సింహాసనం మీద కూచున్నది ఎవరో కాదు. 'డాగీనే'. 'మన డాగీనే' అని ఆశ్చర్యపడుతూ మంచం మీది నుంచి కిందపడ్డాడు అబ్బాయి. కల కరిగిపోయింది, 'కనకపు సింహాసనమున ఒక శునకము కూర్చుండ తగునా?' అన్న పాట గుర్తొచ్చింది కానీ, కలలో కనకపు సింహాసనం మీద తన ఫ్రెండ్ 'డాగీ' కూర్చుని ఉండటం కన్నుల పండుగగా అగుపించింది.

మధ్యాహ్న సమయం సాయంత్రంలోకి చొరబడకుండానే అరుగు ఎక్కాడు అబ్బాయి తనకు వచ్చిన కలను గురించి డాగీకి చెప్పాలని ఉత్సాహంగా ఉల్లాసంగా. అప్పటికే అరుగు మీద ఉన్న డాగీ, డాంకీ 'బ్రో' వైపు ఆశ్చర్యంగా చూశారు. ఇదేంటి 'బ్రో' ఇవాళ ఇంత 'అర్లీ' గా వచ్చేశావు అంది డాంకీ. నాలాంటి డాగీ ఎముకల్ని కొరకడానికి బదులు, చలి కొరికేస్తున్నది కదా అందుకే తొందరగా వచ్చినట్టున్నాడు అంది డాగీ. చలి సంగతి వదిలెయ్యండి. స్వెట్టరు, క్వార్టరూ చూసుకుంటయి కానీ కల సంగతి చెబ్దామని వచ్చాను అన్నాడు బ్రదరబ్బాయి. 'కలా' అనగానేమిటి బ్రదర్ అంది డాంకీ. మీకు అనగా డాగీలకు, డాంకీలకు కలలు వస్తాయో లేదో నాకు తెలీదు. ఈ విషయంలో సిగ్మండ్ ఫ్రాయిడ్ ఏం చెప్పాడో చదవలేదు. నేను పండుకుని నిద్ర పోతున్నప్పుడు కనపడింది ఓ దృశ్యం. దాన్నే మేం కల అంటాం, నా కల్లో కోట, కోట లోపల మేడ, మేడలో హాలు, హాలులో వేదిక మీద కనకపు సింహాసనం ఆ సింహాసనం మీద 'డాగీ' వింటున్నావా! డాగీ... నువ్వే...నువ్వే కనపడ్డావు. తలమీద సింహాసనం ఉంది. ఒంటి మీద సిల్కు అంగరఖా అంటే 'చొక్కా' అనుకో ఉంది. సింహాసనం అనగా బంగారంతో చేసిన కుర్చీ అందులో కూచుని నువ్వు...మామూలుగా లేవు. ఆ దృశ్యం చూసినప్పట్నించీ ఎప్పుడెప్పుడు అరుగు ఎక్కాలా, మీకు వివరంగా చెప్పాలా అని చూస్తున్నాను అన్నాడు అబ్బాయి. 'వావ్! యూ ఆర్ గ్రేట్!' డాగీ అని అరిచింది డాంకీ ఆనందం తట్టుకునే బలంలేక. డాగీ మాత్రం 'లైట్' తీసుకుంది. జోకులెయ్యకు 'బ్రో' నేనేమిటి సింహాసనం ఎక్కడమేమిటి? నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు అనమంటావా. నాకు సిగ్గే బాబూ! జరగనిదాన్ని గురించి ఎందుకులే అంది డాగీ.

నా కల నిజమవునో కాదో కానీ డాగీ వర్తమాన ప్రపంచంలో జరుగుతున్నది అదే అనిపిస్తున్నది. చదువూ, జ్ఞానమూ, ఇంగితమూ, మనిషితనమూ, మంచితనమూ లేని వాళ్లంతా సింహాసనం ఎక్కి కూచుంటున్నారు. వాళ్లు రెండు కాళ్ల వాళ్లే అయినా, నాలుగు కాళ్ల డాగీల్లాంటి వాళ్లే. కనకపు సింహాసనం మీద శునకం కూర్చోవద్దంటారు కానీ కూర్చుంటున్న వాళ్లంతా నీలాంటి వాళ్లే! నువ్వు తోక ఊపుతావు. వాళ్లూ పార్టీలు మార్చేటప్పుడూ, పదవులు అడిగేటప్పుడూ కనపడని తోక ఊపుతారు. పొద్దస్తమానం అదేపనిగా నువ్వు మొరుగుతుంటావు. వాళ్లు ప్రతినిధుల సభల్లోనూ, పత్రికల వాళ్ల ముందూ చేసే పని అదేగా అన్నాడు అబ్బాయి.

భలే కల కన్నావబ్బాయి. కానీ నీకు డాగీ అంటే పక్షపాతం. నా గురించి కల కనొచ్చు గదా. మీ నాయకులు నా మీద ఎక్కి స్వారీ చేసినట్టో లేదా నా వెనుక నిలబడ్డ నాయకుల్ని వెనక్కాళ్లతో 'ఫుట్‌బాల్' ఆడినట్టో అంది డాంకీ. నాకు మీ ఇద్దరిలోనూ మా ప్రజాప్రతినిధులు దర్శనం ఇస్తున్నారు. డాగీ కల్లోకి వచ్చినట్టే, డాంకీ! నువ్వూ కల్లోకి వస్తావని నమ్ముతున్నా అంటూ అరుగు దిగాడు అబ్బాయి.

మోదీని వెంటాడుతున్న "నెహ్రూ"ఫోబియా

ఎంసీ వెంకటేశ్వర్లు

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ శతాబ్దపు మేటి నాయకుడు, భారతదేశాన్ని ప్రపంచాన్ని మార్గదర్శిగా రూపొందించిన దార్శినికుడు. కేవలం దశాబ్ద కాలంలోనే 70 సంవత్సరాలలో లేని అభివృద్ధిని చేసి చూపించిన అగ్రగణ్యుడు. అత్యంత సమర్థవంతమైన ప్రధానిగా బీజేపీ నాయకులు, శ్రేణులు కీర్తిస్తున్న మోదీ' కి 60 సంవత్సరాల క్రితం చనిపోయిన 'జవహర్‌లాల్ నెహ్రూ" ఫోబియా వెంటాడటం ఆశ్చర్యకరం. మోదీ ప్రధాని పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి "నెహ్రూ" పేరును స్మరించకుండా నిద్ర పోయిన రోజు లేదంటే హాస్యాస్పదం కాదు. కశ్మీర్ సమస్యకు కారకుడు నెహ్రూ. దేశ విభజనకు కారకుడు నెహ్రూ. ముస్లింల బుజ్జగింపునకు కారకుడు నెహ్రూ. భారతదేశం వెనుకబాటుకు కారణం నెహ్రూ. ఒక్కమాటలో చెప్పాలంటే భారతదేశం ఎదుర్కొంటున్న సకల రుగ్మతలకు నెహ్రూ కారకుడని నిందించినంత మాత్రాన ప్రజలందరూ నమ్ముతారనుకోవడం మోదీ అమాయకత్వానికి నిదర్శనం. ఇటీవల "వందేమాతర గీతం"ను రాజకీయం చేసి నెహ్రూ ముస్లింలీగ్ నాయకుడు మహ్మదాలీజిన్నాకు తలవంచాడంటూ నీచ ఆరోపణ చేసి తనకు తానుగా ఆత్మహననం చేసుకున్నాడు. అదే రోజు దేశ విభజనకు ఆజ్యం పోశాడంటూ చరిత్రను వక్రీకరించి మోదీ తన అల్పబుద్ధిని చాటుకున్నాడు. వందేమాతర గీతం జాతీయోద్యమంలో ప్రజలను ఉత్తేజితులను చేసిన విషయాన్ని కాదనలేం. కాని ఆనాడు గాంధీ నాయకత్వాన కాంగ్రెస్ స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్నది. కుల, మత ప్రాంత భేదాలు లేకుండా దేశ ప్రజలందరూ ఆ ఉద్యమంలో భాగస్వాములయ్యారు. కాని వందేమాతరం గీతంలో ప్రజల మధ్య ఐక్యతకు భంగం కలిగించే చరణాలు కొన్ని ఉన్నాయని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో 1937లో చర్చ జరిగింది. ఆ చర్చలలో రాజేంద్రప్రసాద్, సర్దార్ వల్లభాయ్‌పటేల్, మౌలానా అబ్దుల్ కలాం, సుభాస్‌చంద్రబోస్ తదితరులందరు ఉన్నారు. గాంధీ, రవీంద్రనాథ్ ఠాగూర్‌తో కూడా చర్చించారు. చివరకు సుభాస్‌చంద్రబోస్ కొంతమేర భిన్నాభిప్రాయం వ్యక్తం చేసినా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఏకగ్రీవంగా కొన్ని చరణాలను తొలగించి పాడాలని నిర్ణయించిందని చరిత్ర చెపుతోంది. ఈ చర్చ 1947 వరకు జరిగి 1950 జనవరి 24న జరిగిన రాజ్యాంగ పరిషత్ సమావేశంలో "జనగణమన" జాతీయగీతంగా, వందేమాతరం గీతం జనగణమనతో సమానంగా గౌరవం పొందుతుందని, సమాన హోదా కల్పించబడుతుందని రాజేంద్రప్రసాద్ ప్రకటించటంతో చర్చకు ముగింపు పలికారు. ఈ చారిత్రక వాస్తవాలను మరుగుపరిచి నెహ్రూపై దాడి చేయడం మోదీ రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనం.

జాతీయ, ప్రపంచ రాజకీయ పరిజ్ఞానం, పరిపాలనలో నెహ్రూకు, మోదీకి హస్తిమశకాంతరం తేడా ఉంది. నెహ్రూ స్వాతంత్ర్యం కోసం జీవితాన్ని త్యాగం చేసిన వ్యక్తి. స్వాతంత్ర్యోద్యమంలో బ్రిటీష్ వాళ్లకు దాసోహం అన్న ఆర్ఎస్ఎస్ వారసుడు మోదీ. భారతదేశ, ప్రపంచ దేశాల సామాజిక, సాంస్కృతిక, రాజకీయ పరిస్థితులను, వైవిధ్యాలను అధ్యయనం చేసి భారతదేశానికి సెక్యులరిజం, ప్రజాస్వామ్యం, సోషలిస్టు విధానాలు అవసరమని, జాతీయ సమైక్యతను కాపాడగలమని నమ్మి దానికనుగుణంగా రాజ్యాంగ రచనలో తనదైన లౌకికవాద ముద్ర వేసుకున్న దేశాభిమాని నెహ్రూ. గుజరాత్ ముస్లింలపై జరిగిన హత్యాకాండకు బాధ్యుడుగా, అంతర్జాతీయంగా వీసా నిరాకరించబడిన రాజకీయ నాయకుడు మోదీ. నెహ్రూపై బీజేపీ, ఆర్ఎస్ఎస్, మోదీ, అమిత్‌షా చేసే విష ప్రచారాన్ని జవహర్‌లాల్ రాజకీయ చరిత్ర, స్వాతంత్ర్యోద్యమ చరిత్ర తెలియనివారు కొంతమంది నమ్మవచ్చేమో కాని, దేశ ప్రజలెవరు నమ్మరు. భారతదేశ సామాజిక వైరుధ్యాలను, సంస్కృతిని అధ్యయనం చేసిన నెహ్రూ కుల, మతాలకు భిన్నమైన సామాజిక ఐక్యతను కోరుకున్న గాందేయవాది. హిందూ, ముస్లిం మత సిద్ధాంతాలతో రాజీపడని స్వాతంత్ర్య సమర యోధుడు. స్వాతంత్ర్యోద్యమంలో గాంధీ, పటేల్, రాజేంద్రప్రసాద్, మౌలానా అబ్దుల్‌కలాం తదితరులతో కొన్ని సందర్భాలలో విభేదించినా స్వాతంత్ర్యం కోసం కాంగ్రెస్‌ను ఐక్యంగా ఉంచి పోరాటం సాగించిన వ్యక్తి నెహ్రూ. కోడిగుడ్డుపై ఈకలు ఒలిచిన చందంగా పటేల్, నెహ్రూను వ్యతిరేకించాడని, గాంధీ అండతో పటేల్‌ను తప్పించి ప్రధానమంత్రి అయ్యాడని ఉద్దేశ పూర్వకంగా ఆర్ఎస్ఎస్, ప్రధాని మోదీ, అమిత్‌షా, బీజేపీ శ్రేణులు అసత్య ప్రచారానికిపాల్పడటం సిగ్గుచేటు. "జవహర్‌లాల్, నేను స్వాతంత్ర్యోద్యమంలో సహచరులం, కలిసి పనిచేసిన సైనికులం" అని వల్లభాయ్‌పటేల్ చెప్పినట్లు చరిత్ర పుటలు లిఖించాయి. "ప్రధానమంత్రి పదవికి ఇద్దరు సమర్థులున్నారు (నెహ్రూ, పటేల్). అయినా నెహ్రూకున్న జనాకర్షణ, స్వాతంత్ర్యోద్యమంపై పట్టు, దేశ సమైక్యత అవగాహన కలిగిన నెహ్రూ" నా వారసుడు. నేనున్నా లేకపోయినా నా విధానాలను అమలు పరచగలడన్న నమ్మకం నాకున్నదని" గాంధీ ప్రకటించినప్పుడు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు ఎవరూ అభ్యంతరం చెప్పకపోగా, తరువాత కాలంలో పటేల్ గాంధీ అభిప్రాయాన్ని అభినందించినట్లు రాజ్‌మోహన్ గాంధీ లాంటి చరిత్రకారులు వెల్లడించారు. ఈ వాస్తవాలు ఏవి ఆర్ఎస్ఎస్ నాయకులకు, మోదీ, అమిత్‌షాలకు తెలియదనుకోవడం పొరపాటు. భారతదేశ రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాలపై ఆర్ఎస్ఎస్, బీజేపీ ప్రత్యేకించి అమిత్‌షా, మోదీ ముద్రపడాలి. కాని జాతీయోద్యమం, స్వాతంత్ర్యం తరువాత ఆర్థికరంగంలో సాధించిన విజయాలు, విదేశాంగ విధానం తదితర రంగాలలో కాంగ్రెస్, నెహ్రూ, ఇందిరాగాంధీ పాత్ర గురించి చెప్పకుండా భారతదేశ చరిత్రను చెప్పడం సాధ్యం కాదు. కాబట్టి స్వాతంత్ర్యోద్యమ చరిత్రను వక్రీకరించి దురుద్దేశ పూర్వకంగా నెహ్రూ, కాంగ్రెస్ ప్రతిష్టను దిగజార్చి అసత్యాలను పథకం ప్రకారం ప్రచారం చేస్తున్నారు. తప్పొప్పులకు ఏ రాజకీయ పార్టీ, ఏ రాజకీయ నాయకుడు అతీతులు కాదు. వాస్తవాలను చెప్పుకోవాలి కాని చరిత్రను మొత్తం తిరగరాసి దుష్ప్రచారం చేయాలనుకోవడం సూర్యునిపై ఉమ్మి వేయాలనుకోవడం వెర్రితనమని బీజేపీ నాయకులు గుర్తించాలి.

భారతదేశం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో 5వ స్థానంలోకి చేరిందని, 2047 నాటికి 5 ట్రిలియన్ డాలర్ల జీడీపీకి చేరుతుందని ఇదంతా ప్రధాని మోదీ వలనే సాధ్యమని బీజేపీ శ్రేణులు ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. కనీసం దశాబ్దకాలంలోనే ఇది సాధ్యమా! అన్న ఇంగిత జ్ఞానం కూడా లేదు. శాస్త్ర, సాంకేతిక రంగాల అభివృద్ధికి, అంతరిక్ష ప్రయోగాలు, చంద్రయాన్–3 విజయవంతానికి మోదీ కారకుడని ప్రచారం చేయడానికి మోదీ భజంత్రీలు ఏమాత్రం సిగ్గుపడటంలేదు. ఏడుదశాబ్దాలుగా భారతదేశం శాస్త్ర, సాంకేతిక రంగాలు, అంతరిక్ష పరిశోధనలు, పారిశ్రామిక, వ్యావసాయక రంగాల అభివృద్ధికి జవహర్‌లాల్ నెహ్రూ దూరదృష్టితో వేసిన పునాదులే ప్రాతిపదిక అని చెప్పడానికి మోదీ –షా, బీజేపీ, ఆర్ఎస్ఎస్ శ్రేణుల వెన్నులో వణుకు పుడుతుందన్నది వాస్తవం. స్వాతంత్ర్యోద్యమ కాలంలోనే నెహ్రూ యూరప్ దేశాలు, సోవియట్ యూనియన్‌లలో పర్యటించి శాస్త్ర, సాంకేతికాభివృద్ధి ప్రాధాన్యతను, ప్రణాళికాబద్ధమైన ఆర్థిక విధానాలను, ప్రజాస్వామ్యం లక్షణాలను అవలోకన చేసుకున్నాడు. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ 34వ మహాసభ (1947),దానికి ముందు 1938లో జరిగిన సైన్సు కాంగ్రెస్ మహాసభలో నెహ్రూ సందేశమిస్తూ దేశాభివృద్ధికి శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాభివృద్ధి పాత్రను నొక్కి చెబుతూ, ఆకలి, పేదరికం, నిరక్షరాస్యత సమస్యల పరిష్కారం, మూఢ నమ్మకాలు, చలనరహితమైన ఆచారాలు, సాంప్రదాయాల నిర్మూలనకు, సంపన్న దేశంగా రూపొందుట శాస్త్ర విజ్ఞానంతోనే సాధ్యమని స్పష్టం చేశాడు. కాని నేడు మోదీ చెబుతున్నదేమిటి? గుడులు, గోపురాల చుట్టూ తిరుగుతూ సాయిబాబా చూపినమార్గంలో నడవాలని మూఢనమ్మకాలను బోధిస్తున్నారు. పూర్వకాలంలోనే ప్లాస్టిక్ సర్జరీ చేసి ఏనుగు తలకాయను వినాయకుడుకి తగిలించారని, విమానాలు రామాయణ కాలంలోనే తయారుచేశారంటూ మోదీ అశాస్త్రీయ భావాలను ప్రచారం చేస్తున్నాడు.

కుల, మత, సనాతన సాంప్రదాయాలు, మూఢ నమ్మకాలు శాస్త్ర, సాంకేతికాభివృద్ధికి ఆటంకాలుగా నిలిచినా, వలసవాద సంకెళ్లను బద్దలు కొట్టి భారతదేశం పారిశ్రామిక, వ్యావసాయక రంగాలలో అభివృద్ధి సాధించడానికి నెహ్రూ అనుసరించిన ప్రణాళికాబద్ధ ఆర్థిక విధానాలేనని జగమెరిగిన సత్యం. నెహ్రూ మంత్రివర్గంలో రక్షణమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన బల్దేవ్‌సింగ్ "భారతదేశ అవసరాలకు, సమస్యల పరిష్కారానికి శాస్త్ర విజ్ఞానమే కీలకమని గుర్తించిన ప్రముఖ మేధావి నెహ్రూ. 1938లోనే కాంగ్రెస్ ఏర్పాటుచేసిన ప్లానింగ్‌కమిటీ చైర్మన్‌గా బాధ్యతలుచేపట్టి మోఘనాథ్‌షా, మహలనోబిస్ లాంటి ఆర్థికవేత్తలతో తరుచుగా చర్చించేవాడు" అని వెల్లడించాడు. బ్రిటీష్ ఇండియా 1942లో ఏర్పాటు చేసిన కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ ఇండిస్ట్రియల్ రీసెర్చి (సీఎస్ఐఆర్)కి స్వాతంత్ర్యం తరువాత ప్రధానిగాఉన్న నెహ్రూ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టాడు. ఆయన అధ్యక్షుడుగా ఉన్న 16 సంవత్సరాలలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్, ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ, ఎలక్ట్రో, ఫ్యూయల్, రసాయన, గ్లాస్, సిరామిక్స్, ఫుడ్, డ్రగ్స్, రక్షణ, ఆటమిక్ ఎనర్జీ తదితర 17 పరిశోధనా సంస్థలను నెలకొల్పి భారతదేశ అభివృద్ధికి భౌతిక వనరులను సృష్టించడంలో నెహ్రూ తనదైన ముద్ర వేశాడు. చరిత్ర చెరిపేస్తే పోయేది కాదు. ప్రజలకు అర్థంకానిభాషలో వివిధసంస్థలకు పేర్లు మార్చినంత సులభం కాదు. రాజకీయ ప్రయోజనాలకు చరిత్రను వక్రీకరించడం రాజకీయవిజ్ఞత కాదు. అసత్యాలు, తప్పుడు ఆరోపణలు, భావోద్వేగ ప్రసంగాలు నేటియువతరాన్ని కొంతకాలం నమ్మించవచ్చు. కాని వాస్తవాలను అర్థం చేసుకున్న రోజున యువతరం నాయకత్వాన ఉప్పొంగిన జన్–జడ్ సోషల్ మీడియా తిరుగుబాటులో శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ నియంతలు, అవినీతి పరులకు పట్టినగతే ఎన్డీఏ పాలకులకు పడుతుందనటంలో సందేహంలేదు.

విజయ్‌కుమార్ కుర్రా

భారత్‌లో ఏఐ అవకాశాలు, సవాళ్లు, భవిష్యత్తు మార్గాలు

గత వ్యాసంలో ఏఐ ఎలా నేర్చుకుంటుంది? అనే అంశంలో భాగంగా 'యంత్ర అభ్యాసం, పర్యవేక్షించిన, పర్యవేక్షణలేని, ఉపబల అభ్యాసం' వంటి అభ్యాస విధానాలను చూశారు. ఇప్పుడు మన దృష్టిని భారతదేశంపై నిలిపి ఏఐ భారతదేశంలో ఎలా ఎదుగుతోంది? మనకు ఉన్న అవకాశాలు, సవాళ్లు ఏమిటి? అనే అంశాలను విశ్లేషిద్దాం. ప్రపంచంలో రెండవ అతిపెద్ద జనాభా గల దేశం భారత్ కావడంతో పాటు, డిజిటల్ మార్ఫోసిస్‌లో వేగంగా పురోగమిస్తున్న దేశంగా నిలుస్తోంది. ప్రభుత్వ విధానాలు, స్టార్టప్‌ల పెరుగుదల, విద్యా రంగంలో మార్పులు ఇవన్నీ కలిసి ఏఐ అభివృద్ధికి మంచి వాతావరణం కల్పిస్తున్నాయి. 2023 నాటికి భారతదేశంలో ఏఐ మార్కెట్ విలువ 12.3 బిలియన్ డాలర్ల స్థాయిని దాటింది. 2025 నాటికి ఇది 20 బిలియన్ డాలర్లకు పైగా పెరిగే అవకాశముంది.

ప్రభుత్వం చేపట్టిన ప్రాథమిక చర్యలు:

1. ఏఐ (2018) కోసం జాతీయ వ్యూహం (2018): నీతి ఆయోగ్ రూపొందించిన ఈ ప్రణాళిక "అందరికీ ఏఐ" అనే లక్ష్యంతో ఆరోగ్యం, వ్యవసాయం, విద్య, స్మార్ట్ సిటీలు, న్యాయ వ్యవస్థ మొదలైన రంగాలలో ఏఐని ప్రవేశపెట్టే దిశగా రూపుదిద్దుకుంది. 2. యువతకు బాధ్యతాయుతమైన ఏఐ: ఈ ప్రోగ్రామ్ ద్వారా ప్రభుత్వం విద్యార్థులకు ఏఐ పట్ల అవగాహన, ప్రాజెక్ట్‌లు, పాఠశాల స్థాయిలోనే అందుబాటులోకి తీసుకువచ్చింది. 3.భారత్ ఏఐ పోర్టల్: ఇది ఒక కేంద్ర ఏఐ నోలేడ్జ్ హబ్‌గా పనిచేస్తోంది. పరిశోధనలు, సమాచారం, వార్తలు అందించే ప్రభుత్వ వెబ్‌సైట్. 4. ఐరావత్: భారత ప్రభుత్వ ఆధ్వర్యంలో అభివృద్ధి చేస్తున్న ఏఐ-నిర్దిష్ట క్లౌడ్ కంప్యూటింగ్ ప్లాట్‌ఫాం, ఇది పరిశోధకుల, స్టార్టప్‌లకు బలమైన మద్దతును అందిస్తుంది.

ఏఐ ఆధారిత డ్రోన్‌లు, పొలంలో సాళ్ల గుర్తింపు సిస్టమ్స్ (అటానమస్), వాతావరణ అంచనాల ఆధారంగా పంట సలహాలు ఇవ్వడం మొదలైనవి అభివృద్ధిలో ఉన్నాయి. ఏఐ ఆధారంగా రేడియాలజీ స్కానింగ్, కేన్సర్ నిర్ధారణ, టెలీ మెడిసిన్ ద్వారా గ్రామీణ ప్రాంతాలకూ వైద్య సేవల విస్తరణ. ఏఐ ఆధారంగా వ్యక్తిగత విద్యా విధానాలు, తగిన కంటెంట్ సూచన. బైజూస్, వేదాంత వంటి సంస్థలు ఏఐ ద్వారా విద్యార్థుల అభ్యాస శైలిని విశ్లేషించి వ్యక్తిగత కంటెంట్ అందిస్తున్నాయి. ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీ, స్మార్ట్ సిటీలలో ట్రాఫిక్ మానేజ్మెంట్, సైబర్ క్రైం రిపోర్టింగ్ వ్యవస్థలు. రీసెంట్‌గా మహారాష్ట్రలో మైక్రోసాఫ్ట్‌తో కలిసి



క్రైమ్ డిటెక్షన్ యాప్ ఓ వినూత్న ప్రక్రియ.

భారత యువతకు అవకాశాలు:

ఏఐ రంగంలో భారతదేశం ప్రపంచంలో అత్యధికంగా టెక్నికల్ గ్రాడ్యుయేట్లను ఉత్పత్తి చేసే దేశం. డేటా సైన్స్, ఏఐ ఎథిక్స్, మెషిన్ లెర్నింగ్ ఇంజినీరింగ్, నాచురల్ లాంగ్వేజ్ ప్రోసెసింగ్ (ఎన్‌ఎల్‌పీ) వంటి ఉద్యోగ అవకాశాలు వేగంగా పెరుగుతున్నాయి. ఏఐ ఇండియా టాలెంట్ పూల్ ప్రపంచంలో మూడవ స్థానంలో ఉంది.

సవాళ్లు: 1. సాంకేతిక అసమానత: గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య డిజిటల్ విభజన. **2. డేటా ప్రైవసీ చట్టాల లోపం:** ఏఐకు అవసరమైన డేటా సేకరణకు సరైన నిబంధనలు లేకపోవడం. **3.అభ్యాస లోపాలు:** ప్రభుత్వ పాఠశాలల, గ్రామీణ విద్యాసంస్థలలో ఏఐ బోధన ఇంకా పరిమితంగానే ఉంది.

4. భాషా అవరోధం: ఎక్కువ ఏఐ టూల్స్ ఇంకా ఇంగ్లీషులో ఉండటం వల్ల, స్థానిక భాషలలో అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో ఏఐ విద్యను పాఠశాల స్థాయిలో ప్రవేశపెట్టాలి. ప్రజా-ప్రైవేట్ భాగస్వామ్యం ద్వారా పరిశోధనలపై పెట్టుబడులు పెంచాలి. భారతీయ భాషల ఎన్‌ఎల్‌పీ పరిశోధనలకు ప్రోత్సాహం ఇవ్వాలి. డేటా ప్రైవసీ చట్టాలను బలపరచాలి.

ఏఐ భారతదేశానికి ఒక బలమైన సాధనం. ఇది గ్రామీణాభివృద్ధి నుంచి పరిశ్రమల దిశగా, ఆరోగ్య సంరక్షణ నుంచి న్యాయ వ్యవస్థ దాకా -ప్రతి రంగంలో వినూత్న మార్పులు తేగలదు. అయితే దీనిని బాధ్యతతో, పారదర్శకంగా, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయడం ప్రభుత్వాలకు ఎంతో అవసరం. తదుపరి వ్యాసంలో "ఏఐ నైతికత- మానవీయ విలువలు, కృత్రిమ మేధస్సు మధ్య సమతుల్యత" గురించి తెలుసుకుందాం.

టెక్ జర్నలిస్ట్, పరిశోధకుడు, 9949690009

గ్రామీణ పేదలకు విపత్కర పరిస్థితులు

- ఎంజీఎన్ఆర్ఈజీఏను మోదీ సర్కార్ కూల్చివేసింది
- కాంగ్రెస్ అగ్ర నేత సోనియా గాంధీ

న్యూఢిల్లీ: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్ఆర్ఈజీఏ) రద్దు గ్రామీణ భారతదేశంలోని కోట్లాది మందికి విపత్కర పరిణామాలను కలిగిస్తుందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ అన్నారు. ఈ చర్యను సమష్టి వైఫల్యంగా అభివర్ణించిన ఆమె... దానిని వ్యతిరేకించడానికి అందరూ కలిసి రావాలని కోరారు. ఎంజీఎన్ఆర్ఈజీఏ స్థానంలో వచ్చే వీబీ-జీ రామ్ జీ అని పిలువబడే భారత గ్రామీణ ఉపాధి జీవనోపాధి మిషన్ (గ్రామీణ) బిల్లును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించిన నేపథ్యంలో సోనియా ఈ వ్యాఖ్యలు చేశారు. కొత్త చట్టం గ్రామీణ కార్మికులకు 125 రోజుల ఉపాధిని హామీ ఇస్తుంది. కాగా సోనియా గాంధీ ఒక ఆంగ్ల వార్తాపత్రికలో 'బుల్డోజర్ కూల్చివేత' అనే శీర్షికతో రాసిన తన వ్యాసంలో ఆమె నాలుగు ఆరోపణలు చేశారు. 'ఎంజీఎన్ఆర్ఈజీఏ మహాత్ముడి సర్వోదయ (అందరికీ సంక్షేమం) కు చెందిన దార్శనికతను గ్రహించింది. రాజ్యాంగబద్ధమైన పని హక్కును అమలు చేసింది. మనందరినీ రక్షించే హక్కులను ఐక్యంగా కాపాడుకోవడం ఇప్పుడు చాలా అవసరం' అని పేర్కొన్నారు. గ్రామీణ దుస్థితిని ఎదుర్కోవడానికి ఉపాధి హామీ పథకాన్ని ఇప్పుడు 'అణచివేయడం, కూల్చివేయడం' జరిగిందని సోనియా అన్నారు. వీబీ-జీ రామ్ జీ ని 'అధికారిక నిబంధనల సమితి తప్ప మరొకటి కాదు' అని అభివర్ణించారు. ఎంజీఎన్ఆర్ఈజీఏ అనేది భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 41 నుంచి ప్రేరణ పొందిన హక్కుల ఆధారిత చట్టమని, ఇది పౌరుల పని హక్కును కాపాడాలని ప్రభుత్వానికి పిలుపునిస్తుందని తెలిపారు. 'గత కొన్ని రోజులుగా నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎటువంటి చర్చ, సంప్రదింపులు లేదా పార్లమెంటరీ ప్రక్రియలు లేదా కేంద్ర-రాష్ట్ర సంబంధాల పట్ల గౌరవం లేకుండా ఎంజీఎన్ఆర్ఈజీఏ ను బుల్డోజ్ చేయడానికి పని చేసింది. మహాత్మా గాంధీ పేరును తొలగించడం మొదటి అడుగు మాత్రమేనని, వాస్తవానికి మొత్తం పథకం రద్దు చేయబడింది' ఆమె అన్నారు.

ప్రమాదంలో గ్రామీణ వేతనాలు

ఎంజీఎన్ఆర్ఈజీఏ గొప్ప ప్రభావాలలో ఒకటి గ్రామీణ భారతదేశంలో భూమిలేని పేదల బేరసారాల శక్తి పెరగడమని, ఇది వ్యవసాయ వేతనాలను పెంచిందని సోనియా పేర్కొన్నారు. 'కొత్త చట్టం ప్రకారం ఈ బేరసారాల శక్తి కచ్చితంగా క్షీణిస్తుంది. మోదీ ప్రభుత్వం వేతన వృద్ధిని అణచివేయడానికి ప్రయత్నిస్తోంది. అది కూడా స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొదటిసారిగా వ్యవసాయంలో ఉపాధి నిష్పత్తి పెరిగిన సమయంలో, అలా ఉండాల్సిన దానికి విరుద్ధంగా' అని తెలిపారు.

నిధుల పరిమితిపై ఆందోళనలు

మరో అంశంగా... సోనియా గాంధీ కొత్త చట్టాన్ని కేంద్ర ప్రభుత్వానికి పథకంపై పూర్తి నియంత్రణను ఇచ్చే బ్యూరోక్రాటిక్ నియమాల సమితిగా అభివర్ణించారు. 'గతంలో స్థిర బడ్జెట్ పరిమితి లేదు. కానీ ఇప్పుడు పరిమిత బడ్జెట్ రాష్ట్రాలలో అందుబాటులో ఉన్న పని దినాల సంఖ్యను పరిమితం చేస్తుంది. ఈ మార్పు ఏడాది పొడవునా ఉపాధి హామీని ముగించింది' అని తెలిపారు. వీబీ-జీ రామ్ జీ బిల్లు ప్రకారం, కేంద్రం, రాష్ట్రాల మధ్య ఖర్చు-భాగస్వామ్య విధానం 60:40, ఈశాన్య, హిమాలయ రాష్ట్రాలకు 90:10, అలాగే శాసన సభలు లేని కేంద్రపాలిత ప్రాంతాలకు 100 శాతం కేంద్ర నిధులు. కార్యక్రమానికి సంబంధించిన డిమాండ్ ఆధారిత స్వభావాన్ని కూల్చివేసి, మోదీ ప్రభుత్వం పథకం వికేంద్రీకృత స్వభావాన్ని ముగించిందని సోనియా అన్నారు. ఖర్చులో గణనీయమైన భాగాన్ని రాష్ట్రాలకు బదిలీ చేయడం ద్వారా మోదీ ప్రభుత్వం ఈ పథకం కింద పని అందించకుండా వారిని నిరుత్సాహపరుస్తోందని కూడా ఆమె అన్నారు. ఇప్పటికే తీవ్ర ఒత్తిడిలో ఉన్న రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులు మరింత నాశనమవుతాయని కాంగ్రెస్ నాయకురాలు తెలిపారు.

125 రోజుల పని దినాల వాదన 'తప్పు'

ఉపాధిని 100 నుంచి 125 రోజులకు పెంచినట్లు ప్రభుత్వం తప్పుడు వాదన చేస్తోందని సోనియా ఆరోపించారు. గత 10 సంవత్సరాలుగా మోదీ ప్రభుత్వం బడ్జెట్‌లను తగ్గించడం, సాంకేతిక అడ్డంకులు సృష్టించడం, కార్మికులకు చెల్లింపులను ఆలస్యం చేయడం ద్వారా ఎంజీఎన్ఆర్ఈజీఏను బలహీనపరిచిందని పేర్కొన్నారు. ఇది ప్రధాన మంత్రి సభలో ఈ పథకాన్ని అపహాస్యం చేయడంతో ప్రారంభమయింది. స్తబ్ధుగా ఉన్న బడ్జెట్‌లు, హక్కులు తొలగించే సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం, కార్మికులకు చెల్లింపులను ఆలస్యం చేయడం ద్వారా 'వెయ్యి కోతలతో మరణం' వ్యూహం ద్వారా వేగంగా కొనసాగింది' అని ఆమె తన వ్యాసంలో పేర్కొన్నారు.

రాజ్యాంగ హక్కులపై దాడి

పని హక్కును అంతం చేయడం రాజ్యాంగంపై విస్తృత దాడిలో భాగమని సోనియా గాంధీ తన వ్యాసంలో రాశారు. ఓటు హక్కు, సమాచార హక్కు, విద్యా హక్కు, అటవీ హక్కుల చట్టం, భూసేకరణ చట్టం అన్నీ బలహీనపడ్డాయని అన్నారు. మూడు వ్యవసాయ చట్టాల ద్వారా ప్రభుత్వం రైతుల కనీస మద్దతు ధర హక్కును హరించిందని ఆమె ఆరోపించారు. జాతీయ ఆహార భద్రతా చట్టం కూడా ఇప్పుడు ముప్పులో ఉందని హెచ్చరించారు. ఓటు వేసే అత్యంత ప్రాథమిక హక్కు అపూర్వమైన దాడికి గురవుతోందన్నారు. 'సమాచార హక్కును సమాచార కమిషనర్ల స్వయంప్రతిపత్తిని బలహీనపరిచే శాసన మార్పులతో, తప్పుగా నిర్వచించబడిన 'వ్యక్తిగత సమాచార డేటాకు చట్టం నుంచి పూర్తిగా మినహాయింపులు ఇవ్వడం ద్వారా అపవిత్రం చేశారు' అని పేర్కొన్నారు.

హోంగార్డ్‌ల ఎంపికకు 8 వేల మంది

భువనేశ్వర్: హోంగార్డ్ ఎంపికకు 8 వేల మందికిపైగా అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్ష నిర్వహించడం పోలీసులకు సవాల్‌గా మారడంతో ఏకంగా రన్‌వేపై వారికి రాత పరీక్ష నిర్వహించారు.సుమారు 200లోపు ఉన్న హోంగార్డుల పోస్టుల భర్తీకి అభ్యర్థులు అసాధారణ సంఖ్యలో దరఖాస్తు చేశారు. నియామక పరీక్ష కోసం 8,000 మందికిపైగా హాజరయ్యారు. కాగా, ఇంతమంది అభ్యర్థులకు పరీక్ష నిర్వహించడం పోలీస్ అధికారులకు సవాల్‌గా మారడంతో ఈ నెల 16న జమదర్‌పాలిలోని రన్‌వేపై అభ్యర్థులకు రాత పరీక్ష నిర్వహించారు. దీంతో ఆ రన్‌వే పొడవునా వేలాది మంది అభ్యర్థులు వరుసగా కూర్చొని పరీక్ష రాశారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లు, భద్రత కోసం భారీగా పోలీస్ అధికారులు, సిబ్బందిని మోహరించారు. అలాగే అభ్యర్థుల పరీక్షను డ్రోన్ల ద్వారా పర్యవేక్షించారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మరోవైపు 187 హోంగార్డుల పోస్టుల భర్తీకి కనీస అర్హత ఐదో తరగతి ఉత్తీర్ణత.ఉన్నత విద్యావంతులు వేల సంఖ్యలో దరఖాస్తు చేశారు. సంబల్‌పూర్ జిల్లాకు చెందిన గ్రాడ్యుయేట్లు, ఇంజినీర్లు, కంప్యూటర్ సైన్స్, ఎంసీఏ, ఎంబీఏ చదివినవారు, డిప్లొమా హోల్డర్లు, ఐటీఐ అభ్యర్థులు ఈ ఉద్యోగం కోసం పోటీ పడ్డారు. దీంతో ఒడిశాలో నిరుద్యోగ సమస్యకు ఇది అద్దంపట్టింది. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి.

ఫీజు పెంపుపై విద్యార్థుల నిరసన

జైపూర్: రాజస్థాన్‌లో విద్యార్థుల పరీక్షల ఫీజు పెంపును వ్యతిరేకిస్తూ ధర్నా చేస్తున్న విద్యార్థులను పోలీసులు అరెస్టు చేశారు. అయితే బార్మర్ కలెక్టర్ టీనా దాబిపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో ఇద్దరు విద్యార్థి నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఆ గొడవ ముదిరింది. ఇద్దరి విద్యార్థుల అరెస్టును ఖండిస్తూ కాలేజీ స్టూడెంట్స్ కొత్వాల్ పోలీసు స్టేషన్‌లో బైఠాయించారు. ముల్తాన్‌బాల్ బిక్‌చాంద్ వుమెన్స్ కాలేజీ వద్ద ఏబీవీపీ విద్యార్థి నేతలు ధర్నా చేపట్టారు. ఫీజు మూడు రెట్లు పెరగడాన్ని విద్యార్థులు నిరసించారు. ఆర్థికంగా బలహీనంగాఉన్నవారికి ఉన్నత విద్య దూరం అవుతుందని విద్యార్థులు ఆరోపించారు. కలెక్టర్ టీనా దాబీకి విద్యార్థుల సమస్యలు పట్టవని, ఆమె కేవలం సోషల్ మీడియాలో రీల్ స్టార్ మాత్రమే అని ఓ విద్యార్థి ఆరోపించారు. ఆ వ్యాఖ్యలను తప్పుపట్టిన పోలీసులు వారిని అరెస్టు చేశారు. కలెక్టర్ టీనా దాబీ తరుచూ తమ జిల్లా అభివృద్ధి పనులను ఎప్పుడూ సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారు. 'దీంతో ఆమె ఆన్‌లైన్‌లో పాపులర్ అయ్యారు. అయితే కలెక్టర్ వద్దకు వెళ్లి సమస్యను చెప్పుకునే పరిస్థితి లేదని, ఆమె ఇప్పుడు ఓ రీల్ స్టార్' అని విద్యార్థి నేత ఆరోపించారు. ఆ విద్యార్థుల్ని అరెస్టు చేయడంతో ఉమెన్స్ కళాశాల విద్యార్థినులు పోలీసు స్టేషన్ ముందు ధర్నా చేపట్టారు. దీనిపై కలెక్టర్ టీనా స్పందిస్తూ... అది విద్యార్థులు, జోధ్‌పూర్ వర్సిటీ మధ్య సమస్య అని, దానికి జిల్లా యాజమాన్యంతో సంబంధంలేదన్నారు. ఫీజును వెనక్కి తీసుకుంటామని వర్సిటీ వీసీ హామీ ఇచ్చినట్లు దాబీ పేర్కొన్నారు. విద్యార్థులను అరెస్టు చేయలేదని బార్మర్ పోలీసులు స్పష్టం చేశారు.

ఉత్తరభారతంలో మంచు వర్షం

శీతల వాతావరణాన్ని ఆస్వాదిస్తున్న పర్యాటకులు

న్యూఢిల్లీ: శీతాకాలం కావడంతో హిమాలయాలకు అనుకుని ఉన్న జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ తదితర రాష్ట్రాల్లో జోరుగా మంచు కురుస్తోంది. దాంతో ఆయా రాష్ట్రాల్లోని వివిధ పర్యాటక ప్రాంతాలను మంచు దుప్పటి కప్పేసింది. భూతల స్వర్గంగా పిలువబడే జమ్మూకశ్మీర్ లో గత రెండు రోజులుగా భారీగా మంచు కురుస్తోంది. దీంతో వివిధ ప్రాంతాలు కనుచూపు మేర శ్వేతవర్ణాన్ని సంతరించుకున్నాయి. కశ్మీర్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతం గుల్మార్గ్ పూర్తిగా మంచుతో కప్పుకుపోయింది. నిరంతరం మంచు వర్షం కురుస్తోంది. దీంతో రోడ్లు, ఇళ్లను మంచు కప్పేసింది. స్థానికులు, పర్యాటకులు శీతల వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నారు. గుల్మార్గ్‌లో అత్యంత శీతల పరిస్థితులు నెలకొన్నాయి. అక్కడ గరిష్ట ఉష్ణోగ్రతలు 3.4 డిగ్రీల సెల్సియస్‌గా, కనిష్ట ఉష్ణోగ్రతలు మైనస్ 1.5 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. గుల్మార్గ్‌తోపాటూ ప్రముఖ పర్యాటక ప్రాంతాలు శ్రీనగర్, సోనామార్గ్, కుప్వారా, పహల్గామ్‌లో కూడా భారీగా హిమపాతం పడుతోంది. దక్షిణ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో గరిష్ట ఉష్ణోగ్రతలు 5.6 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రతలు 2.8 డిగ్రీల సెల్సియస్‌కాగా, శ్రీనగర్‌లో పగటి ఉష్ణోగ్రతలు 6 డిగ్రీల సెల్సియస్‌గా, రాత్రి ఉష్ణోగ్రతలు 4 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి.

భారత్-న్యూజిలాండ్ మధ్య

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

న్యూఢిల్లీ: భారత్-న్యూజిలాండ్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరింది. ఆర్థిక సంబంధాలు బలోపేతం చేసుకునే దిశగా, ఎగుమతిదారులకు మరింత మార్కెట్ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఈ ఒప్పందాన్ని ఖరారు చేసుకున్నాయి. సోమవారం భారత ప్రధాని నరేంద్ర మోదీ, న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టఫర్ లక్సన్ ఫోన్‌లో సంభాషించుకున్న అనంతరం దీనిపై ప్రకటన చేశారు . మార్చిలో న్యూజిలాండ్ ప్రధాని భారత పర్యటనకు వచ్చిన సమయంలోనే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు ప్రారంభమయ్యాయి. తొమ్మిది నెలల్లోనే ఇది ఖరారవడంపై ఇరువురు నేతలు హర్షం వ్యక్తంచేశారు. దీనిపై మూడు నెలల్లో సంతకాలు చేసే అవకాశం ఉందని, వచ్చే ఏడాది నుంచి అమల్లోకి రావొచ్చని భారత వాణిజ్య కార్యదర్శి వెల్లడించారు. రెండు దేశాల మధ్య వాణిజ్యం వృద్ధి చెందుతోన్న తరుణంలో ఈ ఎఫ్‌టీఏ కుదిరింది. దీంతో న్యూజిలాండ్ కంపెనీలు తమ వస్తువులు, సేవలను భారత మార్కెట్‌లో విక్రయించుకోవడాన్ని సులభతరం చేయనుంది. ఆ దేశానికి చెందిన 95 శాతం ఎగుమతులపై సుంకాలు తగ్గనున్నాయి. దాంతో రానున్న రెండు దశాబ్దాల్లో భారత్‌కు తమ ఎగుమతుల విలువ పెరగనుందని, ఏటా 1.1 బిలియన్ డాలర్ల నుంచి 1.3 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులను ఎగుమతి చేసే అవకాశం ఉందని లక్సన్ పేర్కొన్నారు. రానున్న ఐదేళ్లలో ద్వైపాక్షిక వాణిజ్యం రెట్టింపు కాగలదని, రానున్న 15 ఏళ్లలో న్యూజిలాండ్ నుంచి 20 బిలియన్ డాలర్ల పెట్టుబడులకు అవకాశం ఉందని మోదీ, లక్సన్ విశ్వాసం వ్యక్తంచేశారు. ఈ మేరకు భారత ప్రధానమంత్రి కార్యాలయం పేర్కొంది. భారత మార్కెట్‌లోకి పాల ఉత్పత్తులు, తాజా పండ్లు, వైన్, ఉన్నిని ప్రధానంగా ఎగుమతి చేయాలని న్యూజిలాండ్ భావిస్తోంది. అయితే న్యూజిలాండ్ నుంచి డిమాండ్ ఉన్నప్పటికీ... పాల ఉత్పత్తులపై సుంకాలకు ఎలాంటి రాయితీ ఇవ్వలేదు. ఇక, భారత్ నుంచి ఎగుమతులపై ఎలాంటి సుంకాలు ఉండవు. మనదేశంలోని నైపుణ్యం కలిగిన కార్మికులకు అవకాశాలు మెరుగుపడనున్నాయి. అక్కడి సర్వీస్ సెక్టార్‌ను మన సప్లయర్లు అందిపుచ్చుకోవడానికి వీలు కలగనుంది. దుస్తులు, ఫ్యాబ్రిక్స్, జౌళి, ఔషధాలు, శుద్ధ పెట్రోలు, వ్యవసాయ సామగ్రి, ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలు, వాహనాలు, ఇనుము-ఉక్కు, కాగితం ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్స్, రొయ్యలు, బాస్మతి బియ్యం, వ్యవసాయ ఉత్పత్తులను భారత్ ఎగుమతి చేసే అవకాశం ఉంది. కాగా.. ఈ ఏడాదిలో ఇప్పటికే యూకే, ఒమన్‌తో వాణిజ్య ఒప్పందాలు కుదిరాయి. అమెరికా, ఐరోపాతో చర్చల దశలో ఉన్నాయి.

బెంగళూరులో పరువు హత్య

బెంగళూరు: కులాంతర వివాహం చేసుకున్నందుకు గర్భిణీ అయిన కూతురిని ఆమె తండ్రి కొట్టి చంపిన ఘటన కర్నాటకలోని హుబ్బళ్లి జిల్లాలో జరిగింది. ఈ ఏడాది మేలో మాన్య (19) కులాంతర వివాహం చేసుకుంది. ఇది తల్లిదండ్రులకు ఇష్టం లేదు. కుటుంబం నుంచి ప్రాణ హాని ఉండటంతో కొన్ని నెలలు హావేరి జిల్లాలో ఆ జంట నివసించింది. ఈ నెల ఎనిమిదో తేదీన హుబ్బళ్లి జిల్లాలోని సొంత గ్రామానికి వారు తిరిగి వచ్చారు. మాన్య ఆరు నెలల గర్భిణి. అయితే కులాంతర వివాహం చేసుకోవడంపై ఆమె కుటుంబం కక్షగట్టింది. భర్త, మామ పొలంలో ఉండగా మాన్య తండ్రి ప్రకాశ్, మరి కొందరు వారిపై దాడికి ప్రయత్నించారు. ఆమె భర్త, మామ అక్కడి నుంచి తప్పించుకుని పారిపోయారు. మాన్య తండ్రి ప్రకాశ్, బంధువులు ... కూతురి అత్తమామల ఇంట్లోకి బలవంతంగా ప్రవేశించారు. గర్భిణీ అయిన మాన్యపై నినుపరాడ్‌తో తండ్రి దాడి చేశాడు. ఆమె అక్కడికక్కడే మరణించింది. అయితే మాన్యను రక్షించేందుకు అత్తమామలు రేణుకమ్మ, సుభాశ్ ప్రయత్రించారు. వారిని కూడా దారుణంగా కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. మాన్య మృతదహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రకాశ్ మరో ఇద్దరు బంధువులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సంఘటనపై దర్యాప్తు కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు. దాడిలో పాల్గొన్న నిందితులను అరెస్ట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు.

విమానానికి తప్పిన ముప్పు

న్యూఢిల్లీ: ఎయిరిండియా విమానానికి పెద్ద ప్రమాదం తప్పింది. విమానం గాల్లో ఉండగా... ఇంజిన్ ఆయిల్ ప్రెజర్ ఒక్కసారిగా తగ్గిపోయింది. ఆయిల్ ప్రెజర్ సున్నాకి పడిపోయింది. గమనించిన పైలట్లు వెంటనే భద్రతా చర్యలు చేపట్టారు. విమానాన్ని ఢిల్లీ ఎయిర్‌పోర్టులో సురక్షితంగా దించేశారు. బోయింగ్ 777-337 ఈఆర్ ఏ1 887... సోమవారం తెల్లవారుజామున 3.20 గంటల సమయంలో ఢిల్లీ ఇందిగా గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి ముంబైకి బయల్దేరింది. అయితే, విమానం టేకాఫ్ అయిన కాసేపటికే ఇంజిన్‌లో ఆయిల్ ప్రెజర్ గణనీయంగా తగ్గిపోయింది. కుడివైపు ఇంజిన్‌లో అసాధారణంగా తక్కువ ఆయిల్ ప్రెజర్‌ను పైలట్లు గమనించారు. కాసేపటికే ఆయిల్ ప్రెజర్ సున్నాకి పడిపోయింది . అప్రమత్తమైన పైలట్లు వెంటనే అధికారులకు సమాచారాన్ని చేరవేశారు. అధికారుల సూచనల మేరకు విమానాన్ని వెనక్కి మళ్లించారు. ఢిల్లీ ఎయిర్‌పోర్టులో విమానం సురక్షితంగా దిగింది. ఈ ఘటనపై ఎయిర్ ఇండియా సంస్థ స్పందించింది. 'డిసెంబర్ 22న ఢిల్లీ నుంచి ముంబైకి బయల్దేరిన ఏ1 887 విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో టేకాఫ్ అయిన కాసేపటికే విమానం తిరిగి ఢిల్లీ ఎయిర్‌పోర్టులో సురక్షితంగా ల్యాండ్ దిగింది అని ఎయిర్ ఇండియా ప్రతినిధి తెలిపారు. ప్రయాణికులు, సిబ్బందికి ఎలాంటి ప్రమాదం జరగలేదని వెల్లడించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

శాన్‌ఫ్రాన్సిస్కోకు నేరుగా విమానాలు బంద్

ఎయిరిండియా... బెంగళూరు, ముంబై నుంచి అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోకు నేరుగా విమాన సర్వీసులను నిలిపేసింది. వచ్చే ఏడాది మార్చి ఒకటో తేదీ నుంచి నాన్‌స్టాప్ విమాన సర్వీసులను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఉత్తర అమెరికా నెట్‌వర్క్‌ను పునర్వ్యవస్థీకరించడంలో భాగంగా ఈ మార్పులు చేపట్టినట్లు ఎయిరిండియా తెలిపింది. విమానాల వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించడం, అలాగే ప్రస్తుతం కొనసాగుతున్న గగనతల పరిమితుల కారణంగా పెరుగుతున్న నిర్వహణ ఖర్చులను నియంత్రించడానికే ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొంది. కేవలం ఢిల్లీ నుంచి మాత్రమే శాన్‌ఫ్రాన్సిస్కోకు నాన్‌స్టాప్ విమాన సర్వీసులను నడిస్తామని వెల్లడించింది. ప్రస్తుతం ఢిల్లీ నుంచి వారానికి ఏడు విమానాలు శాన్‌ఫ్రాన్సిస్కోకు వెళ్తున్నాయి. వీటి సంఖ్యను 10కి పెంచుతున్నట్లు తెలిపింది. అలాగే ఢిల్లీ నుంచి టొరంటోకు కూడా వారానికి 10 విమానాలను నడిపించనున్నారు. తమ నిర్ణయంతో ప్రభావితమయ్యే ప్రయాణికులను ఇతర విమానాల్లో సర్దుబాటు చేయడం లేదా డబ్బు పూర్తి రీఫండ్ అందిస్తామని ఎయిరిండియా ప్రకటించింది.

ప్రజాస్వామ్య అణచివేతను ప్రతిఘటిస్తా

- ఎస్ఐఆర్ కసరత్తులో తీవ్ర లోపాలు
- బెంగాల్‌లో 58 లక్షల పేర్లు తొలగింపు
- రాష్ట్రంలోకి బీహార్ సాయుధ గూండాలు
- సీఎం మమతా బెనర్జీ

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సోమవారం ఎన్నికల సంఘంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు నిర్వహించిన ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) లో 'తీవ్ర లోపాలు' ఉన్నాయని ఆరోపించారు. నేతాజీ ఇండోర్ స్టేడియంలో జరిగిన టీఎంసీ బూత్ స్థాయి ఏజెంట్ల సమావేశంలో ప్రసంగించిన మమతా బెనర్జీ... రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేయకుండా ఈసీ పరిశీలకులను నియమిస్తోందని, బీజేపీ ప్రయోజనాలను పెంపొందించడానికి కృషి చేస్తోందని విమర్శించారు. 'ఎన్నికల కమిషన్ బీజేపీ ఆదేశాల మేరకు మాత్రమే పని చేస్తోంది. రాష్ట్రంలో ఎస్ఐఆర్ కసరత్తు సమయంలో ఓటర్ల మ్యాపింగ్‌లో తీవ్ర లోపాలు ఉన్నాయి. ఓటర్ల జాబితా నుంచి 58 లక్షల పేర్లు తొలగించారు' అని సీఎం తెలిపారు. ఎస్ఐఆర్ విచారణల కోసం సూక్ష్మ పరిశీలకులుగా నియమించబడిన కేంద్ర అధికారులకు స్థానిక భాషపై తక్కువ జ్ఞానం ఉందని, కొనసాగుతున్న సవరణ కసరత్తు రెండవ దశలో ధ్రువీకరణలు నిర్వహించడానికి వారు అనర్హులు అని కూడా టీఎంసీ అధినేత్రి నొక్కి చెప్పారు. రాష్ట్ర ఎన్నికలకు ముందు బీహార్ నుంచి సాయుధులైన బయటి వ్యక్తులను తీసుకువచ్చి 'బ్యాలెట్లను దోచుకోవడానికి' కుట్ర జరిగిందని ఆరోపించారు. కేంద్ర సంస్థల మద్దతుతో బీజేపీ ఈ ఆపరేషన్‌ను నిర్వహిస్తోందని తెలిపారు. బీహార్ రిజిస్ట్రేషన్ ప్లేట్లు ఉన్న మోటార్ సైకిళ్లు అనుమానిత నేరస్థులతో బర్ధమాన్ జిల్లాలోకి ప్రవేశిస్తున్నాయని బెనర్జీ అన్నారు. 'నేను దాదాపు 50 బీహార్-రిజిస్టర్డ్ బైక్‌లు బర్ధమాన్‌లోకి వస్తున్నట్లు చూశాను. బ్యాలెట్లను దోచుకోవడానికి డబుల్ బ్యారెల్ తుపాకులను తీసుకువస్తున్నారు' అని ఆమె ఆరోపించారు. రాబోయే ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేయడానికి వ్యవస్థీకృత ప్రయత్నం జరుగుతుందని సూచించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తాను చూసిన 'అత్యంత పనికిరాని హోంమంత్రి' గా అభివర్ణించారు. ఆయన ప్రధాన మంత్రిని, దేశ పరిపాలనా యంత్రాంగాన్ని రెండింటినీ నియంత్రించారని విమర్శించారు. కాగా ముఖ్యమంత్రి ఈ సందర్భాన్ని ఉపయోగించుకుని, కొనసాగుతున్న ఎస్ఐఆర్ కోసం టీఎంసీ బీఎల్‌వోలకు వివరణాత్మక ఆదేశాలు జారీ చేశారు. ఇంటింటికీ తిరిగి తనిఖీ చేస్తున్నప్పుడు మరణించిన, బదిలీ చేయబడిన, తప్పిపోయిన ఓటర్ల జాబితాలను బహిరంగంగా ప్రదర్శించాలని ఆమె వారిని ఆదేశించారు. ఎన్నికల కమిషన్‌పై సీఎం మమత తన విమర్శలను కొనసాగిస్తూ, బెనర్జీ ఎన్నికల కమిషన్ (ఈసీ) లో సమన్వయం సరిగా లేదని, అస్థిరమైన సూచనలు, పారదర్శకత లేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వ అధికారులను పరిశీలకులుగా నియమించడాన్ని ఆమె ప్రశ్నిస్తూ... బెంగాల్ భాషలు, సంస్కృతి గురించి తెలియని 'బీజేపీ సానుభూతిపరులు' అని విమర్శించారు. కోల్‌కతా కార్యాలయం నుంచి ఓటర్ల పేర్లను తొలగించడానికి, ఆన్ లైన్‌లోనే జాబితాలను తారుమారు చేయడానికి బీజేపీ ఏజెంట్లను కార్యాలయంలోనే పని చేయడానికి ఈసీ అనుమతి ఇచ్చిందని ఆరోపించారు. ఓటర్ల సవరణ కార్యక్రమాన్ని 'చట్టవిరుద్ధం, రాజ్యాంగ విరుద్ధం, అప్రజాస్వామికం' అని అభివర్ణిస్తూ.... నిజమైన ఓటర్లను వేధించడానికి కొత్త, పాత ఎపిక్ నంబర్లలోని వ్యత్యాసాలను ఉపయోగిస్తున్నారని బెనర్జీ ఆరోపించారు. బీహార్, ఉత్తర ప్రదేశ్ నుంచి వలస వచ్చిన కార్మికులను బెదిరిస్తున్నారని, ఓటర్ల జాబితాల నుంచి వారి పేర్లను తొలగిస్తామని, వారి ఆస్తులను స్వాధీనం చేసుకుంటామని బెదిరిస్తున్నారని ముఖ్యమంత్రి తెలిపారు. బెంగాల్ నివాసితులు, వారి మూలంతో సంబంధం లేకుండా, ఓటు లేదా ఆస్తి హక్కులను తొలగించలేరని ఆమె నొక్కి చెప్పారు. మ్యాపింగ్, డీలిమిటేషన్, పేర్లలో తప్పులు లోపాలు వంటి అంశాలను బెనర్జీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. పేద ఓటర్లను ఓటు హక్కును తొలగించే ప్రయత్నంలో భాగమని అన్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికలకు ముందు బలమైన రాజకీయ సందేశం ఇస్తూ, టీఎంసీ కార్యకర్తలు అప్రమత్తంగా, ఐక్యంగా ఉండాలని అన్నారు. ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితాలను తారుమారు చేయడానికి కుట్ర పన్నాయని విమర్శించారు. 'ఇప్పుడు విహార యాత్రలు' లేవు. 2026లో గెలిచిన తర్వాతే అవన్నీ జరుగుతాయి' అని ఆమె పార్టీ కార్యకర్తలతో అన్నారు. బెంగాల్‌లో ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కే ప్రయత్నాలుగా ఆమె అభివర్ణించిన వాటిని ప్రతిఘటించడం కొనసాగిస్తానని ప్రతిజ్ఞ చేశారు.

భారత్ హిందూ దేశం: భగవత్

కోల్‌కతా: భారతదేశం ఇప్పటికే హిందూ దేశమని ... దానికి రాజ్యాంగ ఆమోదం అవసరం లేదని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అధినేత మోహన్ భగవత్ కీలక వ్యాఖ్యలు చేశారు. కోల్‌కతాలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రసంగిస్తూ 'సూర్యుడు తూర్పున ఉదయిస్తాడు... దీనికి రాజ్యాంగం నుంచి ప్రత్యేకంగా ఆమోదం అవసరమా... భారత్ హిందూ దేశం అన్నది కూడా అలాంటి సత్యమే. హిందుత్వ భావజాలాన్ని విశ్వసించే ఆర్ఎస్ఎస్... భారతదేశాన్ని హిందూ దేశంగా మార్చడానికి పార్లమెంటు చట్టాన్ని సవరించాలా... వద్దా... అనే దాని గురించి పట్టించుకోదు. ఎందుకంటే మేము హిందువులం. మన దేశం హిందూ దేశం. రాజ్యాంగ పీఠికలో ఆ పదాన్ని చేర్చినా, చేర్చకపోయినా మాకు అభ్యంతరం లేదు. భారతదేశాన్ని మాతృభూమిగా భావించి, భారతీయ సంస్కృతిని గౌరవించి, ఇక్కడి పూర్వీకుల వారసత్వాన్ని గౌరవించే వ్యక్తి ఉన్నంత వరకూ భారత్ హిందూ దేశంగానే ఉంటుంది. ఎందుకంటే హిందుస్థాన్ అనేది పుట్టుకతోనే హిందూ దేశం. ఇది సత్యం' అని వ్యాఖ్యానించారు.

విశాలాంధ్ర హైదరాబాద్

నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలి :ఎంపీ

విశాలాంధ్ర - మొయినాబాద్: నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాలాభివృద్ధికి కృషి చేయాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం బాకారం, శ్రీరాంనగర్, కేతిరెడ్డిపల్లి గ్రామాల సర్పంచులుగా ఎల్గని వెంకటేష్ గౌడ్, ఏర్పుల మహిపాల్ , గొడుగు యాదయ్యలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం ఆయన హాజరయ్యారు. అనంతరం ఎల్గని వెంకటేష్ గౌడ్, ఏర్పుల మహిపాల్ , గొడుగు యాదయ్యలకు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందేలా చూడాలని తెలిపారు. గ్రామాభివృద్ధికి వచ్చే నిధులతో గ్రామాన్ని సుందరవనంగా అభివృద్ధి చేసుకోవాలని అన్నారు. గ్రామ అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి హామీ ఇచ్చారు. అనంతరం నూతనంగా ఎన్నికైనా ఆయా గ్రామాల సర్పంచులు మాట్లాడుతూ ప్రజలు మాపై నమ్మకంతో ఎన్నికల్లో ఆశీర్వదించారని వెలిపారు. ముందుగా వారికి ధన్యవాదాలు తెలిపారు. గ్రామాల ప్రజలకు నిత్యం అందుబాటులో గ్రామ సమస్యలను కషిచేస్తామన్నారు. ఎలాంటి సమస్య తలెత్తిన మా తమవద్దకు తీసుకువారాలని తెలిపారు. ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకుండా వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ , వార్డు సభ్యులు ,నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్, ఉప సర్పంచి ప్రమాణ స్వీకారోత్సవం

విశాలాంధ్ర, షాద్ నగర్,రూరల్: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం కేశంపేట్ మండలం పాపిరెడ్డిగూడ గ్రామ నూతన సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డ్ మెంబర్ల ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమానికి హాజరైన కేశంపేట మండల మాజీ జెడ్పీటీసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి. ఈ సందర్భంగా నూతన సర్పంచ్ శశిరేఖ యాదయ్య, డిప్యూటీ సర్పంచ్ తాండ్ర జ్యోతి తోపాటు వార్డ్ మెంబర్ లందరికీ అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. మన జాతిపిత మహాత్మా గాంధీ గారు కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారి ఆశయాలను ఆచరిస్తూ మన గ్రామాలలో త్రికరణశుద్ధితో పాలనను కొనసాగిస్తూ ముందుకు సాగాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధే తన ధ్యేయం

విశాలాంధ్ర- కొత్తూరు: ప్రజలు ఆశీర్వదించి తనను సర్పంచ్ గా గెలిపించిన ఆయుధంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించి ఉత్తమ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దడమే తన ప్రధాన లక్ష్యంగా తీసుకొని ముందుకు సాగుతానని ప్రమాణస్వీకారోత్సవంలో మేకగూడ నూతన సర్పంచ్ రామావత్ మారు రాజు నాయక్ అన్నారు. ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో నూతనంగా గెలుపొందిన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవంలో భాగంగా సోమవారం నందిగామ మండలం, మేకగూడ పంచాయతీ కార్యదర్శి రాంచందర్ నాయక్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో ఘనంగా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నందిగామ మండల వ్యవసాయ అధికారి రామశివరావ్ ప్రత్యేక అధికారిగా వ్యవహరించి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ ఎంతో నమ్మకంతో ప్రజలు ఎన్నుకున్న సర్పంచ్, వార్డుసభ్యులు వారి ఆకాంక్ష మేరకు సూపరిపాలన అందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అధికారులు సూచించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. అందుకని పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరు సహకరించి ఆదర్శ వంత గ్రామపంచాయతీగా తీర్చిదిద్దుకుందాం అని ఆమె కోరారు. ప్రజలు ఎంతో నమ్మకతో ఆశీర్వదించి సర్పంచుగా అవకాశం కల్పించినందుకు సేవకురాలిగా పనిచేసి ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటానని హామీ ఇచ్చారు. వార్డుల్లో ఏసమస్య ఉన్న ఎప్పటికప్పుడు పరిష్కరించి ప్రజల మన్ననలు పొందుతామని వార్డుసభ్యులు భరోసా ఇచ్చారు. ఎన్నికలు వస్తాయి పోతాయి, ఎంతో మంది పోటీలో ఉన్న చివరికి మిగిలేది ఒకరే కాబట్టి వారికి పార్టీలకు అతీతంగా అందరు సహకరించి అభివృద్ధికి సంహరించాలని, అవేశాలకు వెళ్లకుండ ఆలోచనతో అభివృద్ధి చేసుకోవాలని కావలి కృష్ణ, ఎర్ర రాజు కోరారు. అదేవిధంగా మద్యపానం, గంజా యి నిషేధం, ప్లాస్టిక్ నివారణకు కృషిచ్చేయాలని అరెటి మల్లేష్ యాదవ్ పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ నూతన కార్యవర్గాన్ని బిఆర్ ఎస్ మండలపార్టీ అధ్యక్షుడు నోముల పద్మారెడ్డి, మాజీ జెడ్పి వైస్ ఛైర్మెన్ ఈట గణేష్, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, నాయకులు, అధికారులు, ప్రజలు, అభిమానులు, యువకులు శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు నూతన సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డుసభ్యులు, మాజీ ఎంపిటిసి రాజునా యక్,నాయకులు గ్రామంలోని బొడ్రాయి, దేవాలయాల వద్ద ప్రత్యేక పూజలు, దర్గా వద్ద ప్రార్థన, గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

కమ్యూనిటి హోల్ నిర్మాణ పనులు ప్రారంభం

విశాలాంధ్ర, మల్కాజిగిరి : ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని న్యూ శ్రీనగర్ కాలనీ కమ్యూనిటీ హోల్ రూ.10 లక్షల వ్యయంతో ఫస్ట్ ఫ్లోర్ నిర్మాణ పనులను కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ భూమి పూజ చేసి పనులు ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా మురికి నీరు పొంగి పొరలు అవుతున్నారని, డ్రైనేజీ కావాలని కోరడం జరిగింది. అలాగే మంజీరా వాటర్ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు ఎండి రషీద్, బక్క ఏబీఎస్ భక్త సలోమి సంపూర్ణ, సుజాత, ప్రభావతి కాలనీవాసులతోపాటు బాబు, సత్యనారాయణ, సంపత్ రావు, కిషోర్, శంకర్రావు, వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ అభివృద్ధికి విద్యే మూలాధారం : మంత్రి

విశాలాంధ్ర - హైదరాబాద్ : సమాజ అభివృద్ధికి విద్యే మూలాధారం అని మరోసారి రుజువు చేస్తూ, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి విద్యా ప్రదాతగా నిలుస్తున్నారని తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మహబూబ్‌నగర్ నగరంలోని బీసీ బాలికల సంక్షేమ హాస్టల్ ప్రాంగణంలో, ఎమ్మెల్యే తన తండ్రి యెన్నం జానకి రామిరెడ్డి జ్ఞాపకార్థంగా, తన స్వంత నిధులతో ఏర్పాటు చేసిన డిజిటల్ లెర్నింగ్ సెంటర్‌ను రాష్ట్ర మంత్రులు వాకిటి శ్రీహరి, గడ్డం వివేక్ వెంకటస్వామి, మహ్మద్ అజారుద్దీన్‌తో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఉన్నత విద్యను అభ్యసించిన వ్యక్తి మాత్రమే కాకుండా, ఆ విద్య విలువలను సామాజిక బాధ్యతగా మలచిన నాయకుడు. తన నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులు కూడా ప్రైవేట్ విద్యార్థులకు సమానంగా ఆధునిక అవకాశాలు పొందాలనే సంకల్పంతో ఈ డిజిటల్ లెర్నింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం ప్రశంసనీయమన్నారు. దివంగత యెన్నం జానకి రామిరెడ్డి విద్య, విలువలు, సేవాభావానికి ప్రతీకగా నిలిచారని గుర్తుచేస్తూ, వారి జ్ఞాపకార్థంగా ఏర్పాటు చేసిన ఈ కేంద్రం వందలాది బాలికల జీవితాల్లో జ్ఞానవెలుగులు నింపుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సేవా కార్యక్రమానికి గాను ఎమ్మెల్యేని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టి ఖాళీలను భర్తీ చేసిందని తెలిపారు. కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా, డిజిటల్ టెక్నాలజీ, కంప్యూటర్ నైపుణ్యాలు, ఆన్‌లైన్ లెర్నింగ్ వంటి అంశాల్లో విద్యార్థులు నైపుణ్యం సాధించాలని సూచించారు. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులు తమను తాము తీర్చిదిద్దుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తన తండ్రి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే తన లక్ష్యమని, ముఖ్యంగా వెనుకబడిన వర్గాల బాలికలకు నాణ్యమైన విద్య, ఆధునిక సదుపాయాలు అందించాలనే ఉద్దేశంతో ఈ డిజిటల్ లర్నింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా విద్యా రంగానికి మరింత తోడ్పాటు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జ్ గోనెల శ్రీనివాసులు, టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, మహబూబ్ నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్ తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కైట్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించాలి : సీఎస్

విశాలాంధ్ర - హైదరాబాద్ : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని హైదరాబాద్ నగరంలో వచ్చే నెల 13 నుంచి నిర్వహించనున్న కైట్ ఫెస్టివల్ ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సంక్రాంతి పండుగ వాతావరణానికి తగిన విధంగా హైదరాబాద్ నగరపు సాంస్కృతిక వైభవం ప్రతిబింబించేలా కైట్ ఫెస్టివల్ ను ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఈ కైట్ ఫెస్టివల్ కు ప్రత్యేక గుర్తింపు, విస్తృత ప్రచారం కల్పించేలా సరైన పేరు, ప్రత్యేక బ్రాండింగ్, ఆకర్షణీయమైన లోగోను రూపొందించాలని సంబంధిత శాఖలను ఆయన ఆదేశించారు. హైడ్రా ద్వారా పునరుజ్జీవింపబడిన చెరువుల వద్ద ఈ కైట్ ఫెస్టివల్ ను నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షను సిఎస్ తెలిపారు. దీని ద్వారా నగరంలోని నీటి వనరుల పునరుద్ధరణలో సాధించిన విజయాలను ప్రజలకు తెలియజేయడం లక్ష్యమని ఆయన అన్నారు. గుర్తించిన ప్రదేశాల్లో కైట్ ఫెస్టివల్ కు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించి సమన్వయం చేయడానికి జిహెచ్ఎంసి హెచ్ఎండిఎ , హైడ్రా తరఫున ఒక్కొక్క ప్రత్యేక అధికారిని నియమించాలని ఆయన ఆదేశించారు. జనవరి మొదటి వారం నుంచి మంత్రులు పునరుద్ధరించబడిన చెరువులను సందర్శించి ఏర్పాట్లను సమీక్షిస్తారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ నగరవ్యాప్తంగా హైడ్రా ద్వారా పునరుజ్జీవింపబడిన చెరువులపై సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. నీటి నిల్వ సామర్థ్యం పెంపు, పర్యావరణ స్థిరత్వం , ప్రజాప్రయోజనాల కోసం చేపట్టిన పునరుద్ధరణ పనులను వివరించారు.పర్యాటక శాఖ మేనేజింగ్ డైరెక్టర్ వి. క్రాంతి మాట్లాడుతూ, సంక్రాంతి పండుగ సందర్భంగా పలు కార్యక్రమాలను పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. వచ్చే నెల 13 నుంచి 15 వరకు పరేడ్ గ్రౌండ్స్ లో అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్ ను నిర్వహించను న్నామని, ఇందులో దేశీ-విదేశీ గాలిపటాల కళాకారులు పాల్గొంటారని చెప్పారు. అదేవిధంగా నగర పరిసర ప్రాంతాల్లో హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్‌ను కూడా నిర్వహించి సందర్శకులకు ప్రత్యేక అనుభూతిని అందించనున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా డ్రోన్ పైలట్లు పాల్గొనే డ్రోన్ ఫెస్టివల్‌ను కూడా నిర్వహించనున్నట్లు, ఇది పండుగ వేడుకలకు ఆధునిక సాంకేతికతను జోడిస్తుందని వివరిం చారు. అన్ని కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, సంక్రాంతి వేడుకలను ప్రజలకు మరపురాని అనుభవంగా మార్చాలని సిఎస్ ఆదేశించారు. ఈ సమావేశంలో స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్, హెచ్ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, హైదరాబాద్ , రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లు హరిచందన, నారాయణ రెడ్డి, మను చౌదరి, టీజి ఎస్పిడిసిఎల్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్, సమాచారశాఖ అదనపు సంచాలకులు డిఎస్ జగన్ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనదీ : మంత్రి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిదేనని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.వలసలను అరికట్టేందుకు, వెట్టి చాకిరి నుంచి గ్రామీణ ప్రజలను విముక్తి చేయాలనే లక్ష్యంతో తీసుకొచ్చిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని మంత్రి సీతక్క ఆరోపించారు. ఉపాధి హామీ చట్టం నుంచి గాంధీ పేరు తొలగించడం ద్వారా బీజేపీ మరోసారి గాంధీని హత్య చేసినట్లేనని వ్యాఖ్యానించారు. గాంధీ భవన్‌లో ఏఐసీసీ కార్యదర్శి కొప్పుల రాజు రాజుతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క జాతీయ ఉపాధి హామీ చట్టంపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం పని దినాలను తగ్గిస్తూ, గ్రామీణ కూలీల సొంత ఊర్లో పని చేసే హక్కును కాలరాస్తోందని అన్నారు. కార్పొరేట్ల మైనింగ్ అవసరాలకు తక్కువ కూలీకి కార్మికులను సరఫరా చేయాలనే ఉద్దేశంతోనే ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ఈ చట్టం రద్దయితే గ్రామాల్లో ఉపాధి లేక కూలీలు కార్పొరేట్ల దోపిడీకి గురవుతారని హెచ్చరించారు. ఉపాధి హామీ పథకం బిక్ష కాదని, హక్కుగా లభించాల్సిన పథకమని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. నాలుగేళ్ల కష్టంతో రూపొందించిన చట్టాన్ని నాలుగు గంటల చర్చ కూడా లేకుండా కొత్త జీ-రామ్-జీ చట్టంగా తీసుకురావడం ప్రజాస్వామ్య విరుద్ధమని అన్నారు. గతంతో పోలిస్తే కోట్లాది పని దినాలు తగ్గించారని, 125 రోజుల పని అనే ప్రకటన పూర్తిగా బోగస్ అని పేర్కొన్నారు. ఉపాధి హామీ పనుల్లో మహిళలు, ఎస్సీ-ఎస్టీలకు పెద్ద ఎత్తున ఉపాధి లభించిందని, తెలంగాణలో మహిళల భాగస్వామ్యం 62 శాతం, ఎస్సీఎస్టీలతో కలిపితే సుమారు 90 శాతం ఉందని తెలిపారు. కరోనా కాలం లో చదువుకున్న యువతకు కూడా ఉపాధి కల్పించిన ఘనత ఈ చట్టానిదేనని గుర్తు చేశారు. కేంద్రం తీసుకొచ్చిన కొత్త చట్టాన్ని తీవ్రంగా ఖండిస్తూ, ఉపాధి హామీ చట్టాన్ని కాపాడేందుకు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి తీర్మానాలు చేసి కేంద్రానికి పంపిస్తామని తెలిపారు. జి రాంజీ చట్టాన్ని తమ ప్రభుత్వం వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. 27 లేదా 28 తేదీల్లో కొత్తగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులతో కలిసి గ్రామాల్లో ర్యాలీలు, ధర్నాలు నిర్వహిస్తామని ప్రకటించారు. నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన సర్పంచులు, ఉపసర్పంచులకు మంత్రి సీతక్క అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. పేదల హక్కులను హరించే మోడీ ప్రభుత్వ కుట్రలను ప్రజలంతా ఐక్యంగా ఎదుర్కొని, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.

పెరిగిన నేరాలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాచకొండ 2025 క్రైమ్ వార్షిక నివేదికను సీపీ సుదీర్ బాబు వెల్లడించారు. ఈ ఏడాది రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేరాలు పెరిగాయని తెలిపారు. ఈ ఏడాది పెరిగిన నేరాలుసంఖ్య, గత ఏడాది28,626 కేసులు నమోదు కాగా, 2025 లో 33,040 కేసులు నమోదైనట్లు తెలిపారు. రాచకొండ లో పెరిగిన కిడ్నాప్ కేసులు, ఫోక్సో కేసులు సంఖ్య పెరిగాయి. కిడ్నాప్ లు 579 కేసులు నమోదు, ఫోక్సో 1224 కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది నమోదైన కేసులు మర్డర్ ఫర్ గెయిన్ కేసులు 3.. దోపిడీ 3, దొంగతనాలు 67, ఇళ్లలో చోరీ 589, వాహనాల చోరీలు 876, సాధారణ చోరీలు 1, 161, హత్యలు 73, అత్యాచారలు 330, వరకట్నం చావులు 12, గృహ హింస కేసులు 782, గత ఏడాదితో పోలిస్తే మహిళ పై నేరాల సంఖ్య 4శాతం పెరిగినట్లు తెలిపారు.

ఈఏడాది రూ.20 కోట్లు విలువైన డ్రగ్స్ స్వాధీనం

డ్రగ్స్ కేసుల్లో 668 మంది నిందితులు అరెస్ట్. 256 డ్రగ్స్ కేసులు నమోదు, ఇందులో 2090 కిలోల గంజాయి, 35 కిలోల గంజాయి చాక్లెట్లు, 34 కేజీల హ్యాష్ ఆయిల్ , 216 గ్రాముల ఎండిఎంఏ, 10 కిలోల ఓపిఎం, 242 గ్రాముల హెరాయిన్ , 35 కిలోల గసాగసల సామగ్రి సీజ్ చేశారు. ఎక్సైజ్ యాక్ట్ కింద 656 కేసులు నమోదు , 689 మంది అరెస్ట్ , 6824 లీటర్ల మద్యం సీజ్ చేశారు. గేమింగ్ యాక్ట్ క్రింద 227 కేసులు నమోదు కాగా అందులో 1472 మంది అరెస్ట్, 69 లక్షల ప్రాపర్టీ సీజ్ చేసినట్లు వెల్లడించారు. అలాగే మానవ అక్రమా రవాణాకు సంబంధించి ఈ ఏడాది 73 కేసులు నమోదు, 8 స్థావరాలు గుర్తించామన్నారు. ఈ ఏడాది 5, 647 కేసుల్లో 146 మందికి జైలు శిక్ష ఖరారు కావడంతో గత ఏడాది తో పోలిస్తే 74శాతం కన్విక్షన్ రేటు పెరిగిందన్నారు. స్పెషల్ ఆపరేషన్ టీమ్ ఈఏడాది 186 డ్రగ్స్ కేసుల్లో 356 మంది అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అదే సమయంలో గత ఏడాదితో పోలిస్తే సైబర్ క్రైమ్ కేసులు తగ్గుమొహం పట్టాయన్నారు. గత ఏడాది 4618 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 3734 కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. ఆపరేషన్ ముస్కాన్ కింద 2479 మంది ని రెస్క్యూ చేయగా. ఆపరేషన్ స్మైల్ 1071 మంది రెస్క్యూ చేసినట్లు వివరించారు. గత ఏడాది తో పోలిస్తే ఈ ఏడాది పెరిగిన రోడ్డు ప్రమాదాల సంఖ్య తగాయని, గత ఏడాది 3207 కేసులు నమోదు కాగా, ఈఏడాది 3488 కేసులు నమోదు అయినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో 659 మంది మృతి చెందగా ఓఆర్ ఆర్ పై జరిగిన ప్రమాదాల్లో 37 మంది మృతి చెందారని సీపీ సుధీర్ బాబు వెల్లడించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ లో 17 ,760 కేసులు నమోదు కాగా డ్రంక్ డ్రైవ్ ద్వారా 3.89 కోట్లు జరిమానాలు వసూలు చేయగా 5821 లైసెన్స్ లు రద్దు అయినట్లు తెలిపారు.

పదవి అలంకారం కాదు బాధ్యత: నూతి

విశాలాంధ్ర, హైదరాబాద్ : పదవి అనేది దర్పం కోసమో, అలంకారం కోసమో కాదని, పదవి అనేది ఒక బాధ్యత అని ప్రజలు ఇచ్చిన అధికారాన్ని దుర్వినియోగం చేయకుండా, ప్రజలతో మమేకమ వుతూ, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను అట్టడుగు స్థాయి ప్రజలకు అందజేయవలసిన అవసరం స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు ఉందని తెలంగాణ బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ అన్నారు. సోమవారం ఆయన పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేస్తూ ప్రజాప్రతినిధులుగా ఈరోజు ప్రమాణం చేస్తున్న సర్పంచులుగా, ఉప సర్పంచ్లుగా, వార్డు సభ్యులుగా విజయం సాధించిన అందరికీ తన అభినందనలు తెలియజేస్తూ, ప్రజలతో మమేకమై పనిచేస్తేనే ప్రజలలో గుర్తింపు లభిస్తుందని, ప్రజలలో గుర్తింపు పొందితే ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశం మీకు మళ్ళీ ప్రజలు ఇస్తారని, పదవిని ఒక దర్పంగానో, అది ఒక హెూదాగానో భావించకుండా, ఒక బాధ్యతగా దానిని స్వీకరించాలని అన్నారు. ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే, అపజయం పాలవుతా మని, అధికారానికి రాకముందు అధికారంలోకి వచ్చినాక నేతల పనితీరును ప్రజలతో గడిపేందుకు వారు కేటాయిస్తున్న సమయాలను రాష్ట్ర ప్రజలు అనేక సందరాలేలో పరిశీలిస్తూ తమకు దూరంగా ఉంటున్న నేతలను తాము కూడా దూరం పెట్టాలనే నిర?యాలో ఉంటారని , అలాంటి పరిస్థితిని ఏ స్థానిక ప్రజా ప్రతినిధి తెచ్చుకోవద్దని, సూచించారు. ప్రజా సమస్యలతో మమేకమవుతూ, సమస్యల పరిష్కారానికి ముందుంటే, ప్రజా ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూపొందించిన అనేక సంక్షేమ అభివ ృద్ధి కార్యక్రమాలను ప్రతి గడపకు చేర్చే బాధ్యత ప్రతి సర్పంచ్ తన బ ృందం తీసుకోవాలని కోరారు. బడుగు బలహీన వర్గాల అభివ ృద్ధి కొరకు ప్రభుత్వం రూపొందిస్తున్న పథకాలను వారికి చేరువ చేయాలని, ప్రజలలో మంచి పేరు తెచ్చుకుంటూ, రాష్ట్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీకి మంచి పేరు తేవాలని, తమ పార్టీ మద్దతు ఇచ్చి గెలిచిన ప్రతి సర్పంచ్ కృషి చేయాలని, అందరు సర్పంచులు రాజకీయాలక తీతంగా, ప్రజాసేవకు అంకితం కావాలని, ఆకాంక్షించారు.

ఢిల్లీకి పయనమైన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : ఈనెల 17న శీతాకాల విడిదికై హైదరాబాద్ వచ్చి వివిధ కార్యక్రమాలలో పాల్గొని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరిగి ఢిల్లీకి బయలుదేరారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, పంచాయతీ రాజ్, మహిళాభివ ృద్ధి శాఖ మంత్రివర్యులు సీతక్క, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, మహేష్ భగవత్, మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి, హకీంపేట ఎయిరోఫోర్స్ స్టేషన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్మ్‌కు ఘనంగా వీడ్కోలు తెలిపారు. అనంతరం ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ప్రత్యేక విమానంలో రాష్ట్రపతి ఢిల్లీకి బయలుదేరారు.

కృష్ణమూర్తి సేవలు మరువలేనివి

విశాలాంధ్ర, మల్కాజిగిరి : సీపీఐ నాయకులు రొయ్యల కృష్ణమూర్తి ప్రథమ వర్ధంతిని ఆదివారం రాత్రి ఓల్డ్ సఫిల్‌గూడలోని భరత్ నగర్లో బంధుమిత్రుల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి బత్తిని నరసింహగౌడ్ అధ్యక్షత వహించగా పలువురు వక్తలు మాట్లాడుతూ కృష్ణమూర్తి బడుగు బలహీన వర్గాల నాయకుగా అంచెలంచెలుగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడిగా ఎదిగారని, నిరంతరం పేద ప్రజల అభివృద్ధి కోసం నిత్యం ప్రజా ఉద్యమాలు చేసేవారని మల్కాజిగిరిలోని వినాయక నగర్, జవహర్ నగర్‌లోని డెంటల్ కాలేజ్, కీసర భూదాన్ పోరాటాల్లో చురుకైన పాత్ర వహించి పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించిన ఘనత క ృష?మూర్తికి దక్కుతుందని, ఆయన సేవలు మరువ లేనివని పలువురు వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆయన సతీమణి రొయ్యల గిరిజ, పలు కాలనీ సంక్షేమ సంఘాల అధ్యక్షులు చుంకు శ్రీనివాస్, వెంకటేశ్వర్ రావు, సంఘాల నాయకులు నాయకులు కామల్ల ఐలన్న, కాసర్ల నాగరాజు, పిట్టల భాస్కర్, పేపర్ శ్రీను, భరత్ నగర్ కాలనీ అధ్యక్షులు మందభాస్కర్, జోగు శ్రీను, ఎస్.కె అజీజ్, చిలుముల కృష్ణ, చెరుకు సాంబరాజు, కే.సంపత్, నగేష్, రమణ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

దరఖాస్తులు పరిష్కరించాలి : జేసీ

విశాలాంధ్ర, హైదరాబాద్ : జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలు ప్రజావాణిలో అందచేసిన ఆర్జీలపై అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కదిరవన్ పలని అధికారులను సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ జి.ముకుంద రెడ్డి, మరియు జిల్లా అదనపు కలెక్టర్ కదివన్ పలని సంయుక్తంగా ప్రజల వద్ద నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కదివన్ పలని మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రజావాణి యొక్క ముఖ్య ఉద్దేశమని, దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆయన సూచించారు. దివ్యాంగులు అలాగే వయోవృద్ధుల వాట్సాప్ నెంబరు ద్వారా వచ్చే ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పరిష్కరించాలని ఆయన సూచిం చారు. అలాగే జిల్లాలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్ లో వచ్చిన ధరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, అవరమైతే క్షేత్రస్థాయిలో పర్యటించి, త్వరితగతిన పరిష్కరించి, పెండింగ్ ఉన్న ఆర్జీల పై జాప్యం లేకుండా ప్రత్యేక ద ృష్టి సారించి, త్వరగా పరిష్కరించి, సంబంధిత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆయన స్పష్టం చేశారు. ప్రజలకు ప్రజావాణి నిర్వహణపై నమ్మకం కల్పించే బాధ్యత అధికారులపై ఉందని ఆయన తెలిపారు. ప్రజావాణిలో హౌసింగ్ శాఖ (2బిహెచ్‌కె 04 , ఇందిరమ్మ ఇండ్లు 208), రెవెన్యూ 55, ఇతర శాఖలు 16 కలిపి మొత్తం 283 ఆర్జీలు అందాయని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పిడి అశోక్ చక్రవర్తి, లా ఆఫీసర్ శ్రీధర్, కార్పొరేషన్ ఈడి రమేష్, దివ్యాంగుల శాఖ ఏ . డి రాజేందర్, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు, ఆశన్న, కోటాజి, ప్రవీణ్ , జిల్లా పరిశ్రమల శాఖ జియం ప్రవణ్ కుమార్, జిల్లా సర్వే అధికారి శ్రీరామ్, డిసిఓ ప్రసన్న, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్జీదారులు, పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

విశాలాంధ్ర, మల్కాజిగిరి : మిర్జాల్‌గూడ, రాజ శ్రీనివాస నగర్ కాలనీలో స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రామ యాదవ్ సర్కిల్ అధికారులతో కలిసి సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా రాజా శ్రీనివాస నగర్ కాలనీలో ఆర్‌సిసి పైపులైన్ ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కార్పొరేటర్‌ను కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మేకల సునీత రామ యాదవ్ మాట్లాడుతూ మల్కాజిగిరి శాసనసభ్యులు మరి రాజశేఖర్ రెడ్డి సహకారంతో గౌతమ్ నగర్ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నానని అన్ని కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. రాజ శ్రీనివాస నగర్ కాలనీలో ఆర్సీసీ పైప్లైన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సర్కిల్ ఏఈ దివ్య జ్యోతికి సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల రాము యాదవ్ నర్సింగ్ రావు, కిట్టుతో పాటు రాజా శ్రీనివాస్ నగర్ కాలనీవాసులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అప్రమత్తతతో నష్టాలను నివారించవచ్చు

విశాలాంధ్ర, హైదరాబాద్ :అత్యవసర సమయాల్లో అప్రమత్తత ద్వారా నష్టాలను నివారించవచ్చని మేజర్ జనరల్ ఎన్డిఎంఏ లీడ్ కన్సల్టెంట్ సుధీర్ భాల్ అన్నారు. సోమవారం హైదరాబాద్ నెక్లెస్ రోడ్ లోని వ్యూ పాయింట్ వద్ద విపత్తుల సమయంలో సమర్థవంతమైన స్పందన కోసం విస్తృతమైన మాక్ ఎక్సర్సైజ్ విజయవంతంగా నిర్వహించబడింది. మాక్ ఎక్సర్సైజ్ కార్యక్రమాన్ని నోడల్ అధికారి జిల్లా ఫైర్ శాఖ అధికారి వెంకన్న ఆధ్వర్యంలో, ఎన్‌డీఆర్ఎఫ్ పర్యవేక్షణలో నిర్వహించబడింది. బిజీ ఫైర్ సర్వీసెస్ విక్రమ్ సింగ్ మాన్ తో కలసి కలిసి మాక్ ఎక్సర్సైజ్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, అత్యవసర సమయంలో అప్రమత్తత ద్వారా నష్టాలను నివారించవచ్చని, యువత, శాఖల అధికారులు సమన్వయంతో చురుగ్గా పాల్గొనాలి అని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో వారు ఏ విధంగా స్పందించాలో, ఎలాంటి చర్యలు చేపడతారో తెలుసుకున్నారు. మాక్ డ్రిల్ ఎక్సర్సైజ్ ద్వారా జిల్లా యంత్రాంగం అత్యవసర పరిస్థితులలో సమన్వయంతో, క్రమశిక్షణతో పనిచేయగల సామర్థ్యాన్ని ప్రదర్శించిందని, భవిష్యత్తులో సంభవించే ప్రక ృతి వైపరీత్యాలను ఎదుర్కోవడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో కీలకమని తెలిపారు. కార్యక్రమాలపై డి.ఆర్.ఓ ఈ. వెంకటాచారి, సంబంధిత అధికారులు వివరించారు. విద్యుత్ శాఖ చీఫ్ ఇంజనీర్ వి ప్రభాకర్, ఎన్ డి ఆర్ ఎఫ్ డిప్యూటీ కామాండెంట్ డాక్టర్ హరీష్, జిల్లా ప్రస్తుత సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ప్రవీణ్, హైడ్రా బిఎఫ్ యజ్ఞ నారాయణ, జిల్లా అగ్నిమాపక అధికారి వెంకన్న, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి, జిహెచ్ఎంసి ఎస్సి వెంకట శేషయ్య, పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

విశాలాంధ్ర-దుండిగల్: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కంటెస్టెడ్ కార్పొరేటర్ కూన శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు.సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలంగౌడ్ ఆదేశాల మేరకు నియోజకవర్గం నుండి కంటెస్టెడ్ కార్పొరేటర్ కూన శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున కార్యకర్తలు నాయకులతో కలిసి డిసిసి అధ్యక్షులుగా నియమితులైన తోటకూర వజ్రేష్ యాదవ్ ని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి,శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కూన శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ డిసిసి అధ్యక్షుడిగా వజ్రేష్ యాదవ్ ని నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని,రాబోయే జిహెచ్ఎంసి ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కె జయరాం,మాజీ కార్పొరేటర్లు నేను కూడా శ్రీనివాసరెడ్డి, ఆగం పాండు,యువజన కాంగ్రెస్ నాయకులు సిహెచ్ బుచ్చిరెడ్డి,కూన రాఘవేంద్ర గౌడ్,చౌడ శ్రీనివాస్,మోతే శ్రీనివాస్ యాదవ్,షాకీర్,రమేష్ మంజుల్కర్,యాము సాగర్,డాన్ శీను,తోఫిక్,కుమార్ యాదవ్,పులి సందీప్, శరత్,మౌనిష్ యాదవ్, నర్సింగరావు, మురళి,కృష్ణ యాదవ్,వీరబాబు,అఖిల్ గౌడ్,రాజిరెడ్డి,లింగంపేట్, వెంకటేష్, మల్లం శ్రీను,తోకల శ్రీను,బాలప్ప,ప్రభాకర్ రెడ్డి, చోటు,అరుణ్, శ్రావణ్,భూషణం గౌడ్,భరత్,పూలమ్మ,లక్ష్మి, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యం

విశాలాంధ్ర-బందరవిరాల: బందరవిరాల గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరచడమే ప్రధాన లక్ష్యంగా పని చేస్తానని సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్ పేర్కొన్నారు.సోమవారం ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలలో గెలుపొందిన ప్రజా ప్రతినిధులు సోమవారం తమ బాధ్యతలను స్వీకరించారు.అబ్దుల్లాపూర్ మెట్టు మండలంలోని కొత్తగా ఎన్నికైన బందరవిరాల గ్రామ పంచాయతీ సర్పంచ్ ప్రమాణ స్వీకారాలతో గ్రామ పంచాయతీ సందడిగా మారింది.అనంతరం సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్,ఉప సర్పంచ్,వార్డ్ మెంబర్లు ప్రజల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేసి ప్రత్యేక అధికారుల పాలన నుంచి నూతన పాలకవర్గం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్ మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేసి గెలిచినందుకు సంతోషంగా ఉందని తెలిపారు.స్వలాభం కోసం కాకుండా నిరంతరం గ్రామ అభివృద్ధికై పాటుపడతామని,గత సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోని బందరావిరాల గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు.తమపై ఎంతో నమ్మకంతో గొప్ప అవకాశం కల్పించిన బందరావిరాల గ్రామ పంచాయతీ ప్రజలకు పేరుపేరునా ప్రత్యేక అభినందనలు,కృతజ్ఞతలు తెలియజేశారు.ఆయన గురువు డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ నేర్పిన క్రమశిక్షణ,రాజ్యాంగ బద్ధంగా గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు తమ వంతు కృషి చేస్తామని వ్యక్తం చేశారు.

పంచాయతీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర- కొత్తూరు: ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో నూతనంగా గెలుపొందిన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమం సోమవారం కొత్తూరు, నందిగామ మండలాల్లో ప్రత్యేక అధికారులు ప్రభుత్వ లాంచనాల ప్రకారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పంచాయతీల నూతన పాలకవర్గాన్ని ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలు ఎంతో నమ్మకంతో సర్పంచు, వార్డు సభ్యులుగా గెలిపించారు. వారి నమ్మకాన్ని వొమ్ము చేయకుండా వారి ఆకాంక్ష మేరకు గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్ది వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వారు సూచించారు. నూతనంగా గెలుపొంది పదవి బాధ్యతలు స్వీకరించిన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులను పలువురు నాయకులు, అభిమానులు, యువకులు పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, ప్రజలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయరహదారి విస్తరణ పనులతీరుపై ఎంపీ ఆగ్రహం

విశాలాంధ్ర, పటాన్ చెరువు : జాతీయ రహదారి విస్తరణ పనుల తీరుపై ఎంపీ రఘునందన్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. మియాపూర్ నుంచి సంగారెడ్డి వరకు చేపట్టిన విస్తరణ పనులపై సోమవారం పటాన్చేరు లో స్థానిక ఎమ్మెల్యే మహిపాల్రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారుల తీరుపై ఆయన మండిపడ్డారు.కావాల్సినన్ని నిధులు ఇచ్చి పనులు చేయమంటే సమన్వయ లోపంతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని నిలదీశారు. పనులు చేసేప్పుడు ఎదురయ్యే ఇబ్బందులను తమ దృష్టికి ఎందుకు తీసుకు రావడంలేదని ప్రశ్నించారు. సర్వీస్ రోడ్ పూర్తి చెయ్యకుండా ప్రధానరహదారిపైకి రాకుండా గ్రిల్స్ ఏర్పాటు చేస్తే ప్రజలకు ఎంత ఇబ్బంది అవుతుందో ఆలోచించరా అని ప్రశ్నించారు.లింగంపల్లి బ్రిడ్జి నుంచి రింగ్‌రోడ్ వరకు సర్వీస్ రోడ్ పనులను యుద్ధ ప్రాతిపదికన పక్షం రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. తిరిగి జనవరి పదో తేదీన సమీక్ష నిర్వహిస్తామన్నారు. జిహెచ్ఎంసి వారు ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ ను తొలగించడం పై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరువు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ఆయా శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు హాజరైనారు.

బహిరంగ ప్రకటన

మా క్లయింటు అయిన హైదరాబాద్ సిటీ, ఫలక్‌నామా,చార్మినార్,లాల్‌దర్వాజా,మేకల బండ, డోర్.నెం.18-5-736 కాపురస్తుడు బద్దెపురం శ్రీకాంత్, S/o.హరిదాస్ గారి సూచనలమేరకు యావన్మందికీ తెలియచేయు నదిఏమనగా, నా క్లయింటు ది.11-12-2025న ఒరిజినల్ దస్తావేజు నెంబర్లు 1)విక్రయ ద.నెం.709/1987 యస్.ఆర్.ఓ.ఆజంపుర 2) విక్రయ దస్తావేజు నెం.797/1992 యస్.ఆర్.ఓ. ఆజంపుర మరియు 3) గిఫ్ట్ సెటిల్‌మెంట్ దస్తావేజు నెం.997/2012 యస్.ఆర్.ఓ. ఆజంపుర గల దస్తావేజులను తీసుకొని కాచిగూడ వద్ద జిరాక్స్ కొరకు చూసుకొనగా సదరు పై తెలిపిన మూడు దస్తావేజులు కనిపించలేదు. కావున సదరు దస్తావేజులు ఎవరికైనా దొరికిన యెడల మాకు గానీ మా క్లయింటుకు గానీ అందజేయగలరు. అట్లుగాక ఎవరైనా సదరు దస్తావేజులను ఉపయోగించి ఏవిధమైన అన్యాక్రాంతములు చేసినయెడల మాక్లయింటు తీసుకొను చట్టపరమైన సివిల్ & క్రిమినల్ చర్యలకు బాధ్యులు కాగలరు.

మున్నవ శ్రావణ్ కుమార్,మున్నవ అపరాజిత, మున్నవ మధాలస, అడ్వకేట్స్
కూరగాయల మార్కెట్ దగ్గర, చిక్కడపల్లి, హైదరాబాద్. సెల్: 9440260814

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

విశాలాంధ్ర రాజేంద్రనగర్ : శ్రీ విద్యానికేతన్ హై స్కూల్, బాబుల్‌రెడ్డి నగర్‌లో మహా గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జన్మదినాన్ని పురస్కరించుకొని జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజి కౌన్సిలర్ ఎస్. వెంకటేష్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎస్. వెంకటేష్ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో గణితంపై ఆసక్తిని పెంపొందిస్తాయని తెలిపారు. పాఠశాలలో నిర్వహించిన గణిత క్విజ్‌లు, గణిత నమూనాల ప్రదర్శన, సమస్య పరిష్కార కార్యక్రమాలు, సంఖ్యలతో వినోదాత్మక కార్యకలాపాలు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నా యని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని తమ గణిత ప్రతిభను ప్రదర్శించగా, ప్రత్యేకంగా తయారు చేసిన గణిత నమూనాలు అందరి ప్రశంసలను పొందాయి. కార్యక్రమంలో మాట్లాడిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు, శ్రీనివాస రామానుజన్ గణిత రంగంలో చేసిన అమూల్యమైన కృషి ప్రపంచానికి ఆదర్శమని తెలిపారు. గణిత శాస్త్రం విద్యార్థుల తార్కిక ఆలోచనా శక్తిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని, ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకతతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని అన్నారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులకు గణిత శాస్త్ర ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తూ, గణితాన్ని భయపడకుండా ఆసక్తితో నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమం చివరలో పాఠశాల యాజమాన్యం బోయ లక్ష్మన్, నాగలక్ష్మి ఆధ్వర్యంలో రాజేంద్ర నగర్ మండల అధ్యక్షుడు ఎం. ప్రభాకరాచారి, ప్రధాన కార్యదర్శి జి. శ్రవణ్ కుమార్, ట్రెజరర్ ఎస్.ఆర్. రజినీకాంత్, ఏ. యాదగిరి, ఎం.డి. వాజిద్, కరుణాకర్, మనోహర్, కిరణ్, మధుసూదన్ రావు, రాజేంద్ర ప్రసాద్ తదితరులు ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఉపాధ్యాయులు శ్రీనాథ్, హారిక, సౌజన్యలకు పాఠశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది.

క్రికెట్ గ్రౌండ్‌ను ఐపీఎల్ వేదికగా అభివృద్ధి చేస్తాం:మంత్రి గడ్డం

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహబూబ్‌నగర్ క్రికెట్ గ్రౌండ్‌ను ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లకు అనువుగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. కాకా వెంకటస్వామి వర్ధంతి సందర్భంగా నిర్వహించిన అంతర్ జిల్లా టీ20 క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్ , మహ్మద్ అజారుద్దీన్, ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక ప్రతినిధి జితేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జనుంపల్లి అనిరుధ్ రెడ్డి, గడ్డం వినోద్ వెంకటస్వామి పాల్గొని టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మహ్మద్ అజారుద్దీన్ మాట్లాడుతూ ఈ వేదికను సద్వినియోగం చేసుకుని క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ కాకా వెంకటస్వామి వర్ధంతి సందర్భంగా నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్ యువ క్రీడాకారుల ప్రతిభను మెరుగుపర్చుకునేందుకు దోహదపడుతుందని అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మంచి ఆలోచనతో ప్రారంభించిన కార్యక్రమాలు ఎప్పుడూ మంచి ఫలితాలను ఇస్తాయని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను వెలికి తీయడానికి ఈ టోర్నమెంట్ గొప్ప అవకాశమని తెలిపారు. ఐపీఎల్ వంటి వేదికల ద్వారా ఎంతో మంది క్రీడాకారులు తమ ప్రతిభను దేశవ్యాప్తంగా చాటుతున్నారని పేర్కొన్నారు. మన జిల్లా నుంచి కూడా ఐపీఎల్‌తో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు ఎదిగేలా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మిథున్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడు సత్తూరు చంద్రకుమార్ గౌడ్, వనపర్తి డీసీసీ అధ్యక్షుడు శివసేన రెడ్డి, మహబూబ్‌నగర్ డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, హెచ్‌సీఏ, డీసీఏ ప్రతినిధులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

రిజర్వాయర్ల వద్ద రక్షణ చర్యలు తీసుకోవాలి :ఎండీ అశోక్ రెడ్డి

విశాలాంధ్ర, హైదరాబాద్ : రెండు సంవత్సరాల్లో ప్రారంభించిన ఓఆర్ఆర్ ఫేజ్-2 ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్మించిన రిజర్వాయర్ల చుట్టూ రక్షణ చర్యలు తీసుకోవాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన బృందవన్ కాలనీ, మంచిరేవుల, నార్సింగి రిజర్వాయర్లను సోమవారం ఆయన అధికారులతో కలసి సందర్శించారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా రిజర్వాయర్ల చుట్టూ రక్షణగా ప్రహరీ గోడలను నిర్మించాలని, దానికి సంబంధించిన ప్రధిపాదనలు సమర్పించాలి అధికారులను ఆదేశించారు. ప్రాంగణంలో చెత్తా.. చెదారం తొలగించి రిజర్వాయర్ ఆవరణ శుభ్రంగా ఉండేలాగా చూసుకోవాలని అన్నారు. అలాగే గార్డెనింగ్ పనులు, అంతర్గ రహదారులు నిర్మాణం చేపట్టి సుందరీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు ఎండీ సూచించారు. కొందరు ప్రైవేట్ వ్యక్తులు కొన్ని జలమండలి స్థలాల్లో వాహనాల్లో తెచ్చిన నిర్మాణ వ్యర్థాలు వేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని.. అలాంటి వాహనాలను సీజ్ చేసి, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఎత్తయిన గేటును నిర్మించి అందరికీ కనిపించే విధంగా రిజర్వాయర్ వివరాలు రాయించి, రక్షిత స్థలము, ప్రవేశం నిషిద్ధం అని సైన్ బోర్డ్ ఏర్పాటు చేయమని చెప్పారు. అలాగే జలమండలి స్థలాలను రెవెన్యూ రికార్డులో నమోదు చేయాలని తగు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులతో అన్నారు. అందుకుముందు గండిపేట సెక్షన్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో గోదావరి ఫేజ్ 2%డ% 3ప్రాజెక్టు లో భాగంగా జన్వాడ లో నిర్మించే వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అలాగే నియాపోలిస్ వద్ద నిర్మించతలపెట్టిన మాస్టర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణ పనుల వివరాలు ఆరాతీశారు. జంట జలాశయాల వద్ద నిర్మించతలపెట్టిన ఎస్టీపీ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, గ్రామ పంచాయతీలు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలకు నీటి సరఫరా చేసేందుకు గానూ జలమండలి ఓఆర్ఆర్ ఫేజ్ - 2 పనులను చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో సిజీఎం కిరణ్ కుమార్, జీఎంలు శ్రీనివాస్ రెడ్డి, సంతోష్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సొంతింటి కల సాకారం దిశగా అడుగులు

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: దశాబ్దాలుగా శేరిలింగంపల్లి జర్నలిస్టులు ఎదురుచూస్తున్న సొంతింటి కల సకారం దిశగా అడుగులు పడుతున్నాయని టీయుడబ్ల్యూజే నాయకులు తెలిపారు. శేరిలింగంపల్లి మండల పరిధిలోని చందానగర్ పీజేఆర్ స్టేడియంలో సోమవారం శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి టీయుడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి పైళ్ల విట్టల్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర, ఉపాధ్యక్షుడు గంట్ల రాజిరెడ్డి, శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఉప్పరి రమేష్ సగరలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు, మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ అండదండలతో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ సహకారంతో చందానగర్ లో శేరిలింగంపల్లి జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం గత ప్రభుత్వం 1 ఎకరా స్థలాన్ని కేటాయించిందని అన్నారు. సదరు స్థలంలో జర్నలిస్టులకు సొంతింటి కలను సాకారం చేసేందుకు టీయుడబ్ల్యూజే, ప్రెస్ క్లబ్ ల ఆధ్వర్యంలో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. శేరిలింగంపల్లిలో జర్నలిస్టుల సంఖ్య ఎక్కువగా ఉన్న కారణంగా ఈ స్థలం పక్కనే ఉన్న మరో ఎకరా స్థలం మంజూరు కోసం ప్రయత్నిస్తున్నామని, ఇప్పటికే ఈ విషయాన్ని ఎమ్మెల్యే గాంధీ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. శేరిలింగంపల్లిలో పనిచేస్తున్న అర్హులైన ప్రతి జర్నలిస్టుకు న్యాయం జరిగే విధంగా టీయూడబ్ల్యూజే కృషి చేస్తుందన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ ఆధ్వర్యంలో జర్నలిస్ట్ వెల్ఫేర్ ఫండ్ ను ప్రభుత్వం నుంచి మంజూరు చేయించిన ఘనత తమదని.. ఎక్కడా లేని విధంగా అక్రిడేషన్ కార్డులను పెంచి వర్కింగ్ జర్నలిస్టులకు గుర్తింపు కార్డులను అందజేశామని అన్నారు. కానీ ప్రస్తుతం రాష్ట్రంలో జర్నలిస్టుల అక్రిడేషన్ కాలపరిమితి ముగిసి 20 నెలలు గడుస్తున్నా రెన్యువల్ చేయడం లేదని వాపోయారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం టీయుడబ్ల్యూజే ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు. శేరిలింగంపల్లిలో పనిచేస్తున్న జర్నలిస్టులందరినీ సమన్వయం చేసుకుంటూ ఇళ్ల నిర్మాణం కోసం ప్రయత్నిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీయుడబ్ల్యూజే శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్, టెంజు కార్యవర్గ సభ్యులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: దైవచింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,నిజాంపేట్ రాజీవ్ గృహకల్ప శ్రీ శ్రీ శ్రీ ఉమామహేశ్వర స్వామి శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ దేవస్థానముల చైర్మన్ కొలన్ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.దేవస్థానం అధ్యక్షులు పితాని శ్రీనివాసరావు రాజీవ్ గృహకల్ప ఆలయ అభివృద్ధికి రూ.50 వేల విరాళాన్ని సోమవారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి ఆయన నివాస కార్యాలయంలో ఆలయ కమిటీ సభ్యులకు వారి చేతుల మీదుగ అందజేశారు.ఈ సందర్భంగా కొలను శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఆలయాలు మానసిక ప్రశాంతతకు ఆలవాలమని, అలాంటి ఆలయాలను అభివృద్ధి చేసుకోవడం ద్వారా మరింత మందికి ప్రశాంతతను చేకూర్చిన వారం అవుతామని తెలిపారు.అదే విధంగా నిజాంపేట్ తో పాటు మరికొంత ప్రాంతాల్లో ఆలయాల అభివృద్ధిలో తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. రాజీవ్ గృహకల్ప ఇల్లా సముదాయ నివాసితులతో పాటు చుట్టుప్రక్కల ప్రాంతాల వారు పెద్ద సంఖ్యలో విచ్చేసి ఇక్కడి ఉమామహేశ్వర స్వామిని, నల్ల పోచమ్మ అమ్మవారిని దర్శించుకుంటారని, వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయాలను అభివృద్ధి చేయడం జరిగిందని వ్యక్తం చేశారు.అనంతరం ఆలయ అభివృద్ధిలో పితాని శ్రీనివాసరావు తీసుకుంటున్న చొరవను శ్రీనివాస్ రెడ్డి అభినందించారు.సొంత నిధులను వెచ్చించి ఆలయ అభివృద్ధిలో భాగస్వాములు కావడం పట్ల ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు పితాని శ్రీనివాసరావు,సలహాదారుడు రామచంద్రనాయక్,వర్కింగ్ ప్రెసిడెంట్ రామకృష్ణ,కమిటీ సభ్యుడు బాలకృష్ణ పాల్గొన్నారు.

పాలన 'జయప్రదం'గా సాగా : ఎమ్మెల్సీ

విశాలాంధ్ర - కొత్తూరు : ప్రజా ఆశీస్సులతో సర్పంచిగా విజయం సాధించిన బీరంగూడ జయప్రద జగన్మోహన్ రెడ్డి తన పాలనను జయ ప్రదంగా సాగించాలని మహబూబ్ నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నగరకుంట నవీన్ కుమార్ రెడ్డి ఆకాంక్షించారు. తీగాపూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గా ఎన్నికైన జయప్రద జగన్ మోహన్ రెడ్డి ప్రజా సమక్షంలో సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి సర్పంచ్, వార్డు సభ్యులను శాల్వలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ఐదేళ్ల పాలనను కొనసాగించాలని కోరారు. కొత్తూరు మండల మాజీ ఎంపీపీ మధుసూదన్ రెడ్డి సర్పంచ్ కి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో..గ్రామస్థులు, నాయకులు, యువకులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌గా ప్రవీణ్ కుమార్ ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర,షాద్ నగర్, రూరల్: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలం లింగారెడ్డిగూడ గ్రామంలో వైభవంగా ప్రమాణ స్వీకారోత్సవం కార్యక్రమం సోమవారం జరిగింది. అత్యంత వైభవంగా జరిగిన గ్రామపంచాయతీ పాలకవర్గం ప్రమాణస్వీకారం మహోత్సవంలో ప్రత్యేక అధికారి రాజు పాల్గొన్నారు. పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకార ఉత్సవం జరిగింది. సర్పంచ్ గా ఎన్నికైన ఎంసీ ప్రవీణ్ కుమార్ (రాజు) ప్రమాణ స్వీకారం చేయగా, అనంతరం ఉప సర్పంచ్ గా ఎన్నికైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రధాన అనుచరుడు ఎర్రోళ్ల అశోక్ ఉప సర్పంచ్ గా ప్రమాణ స్వీకారం చేశాడు. వార్డు సభ్యులుగా మేహరాజ్, మాధవి లత, గోదా లక్ష్మయ్య యాదవ్, రంగంపల్లి దీపిక వీరేష్ గౌడ్, ఎర్రోళ్ల మమత అరుణ్ కుమార్, వట్టెల మల్లేష్ యాదవ్, భీష్మ బలమని యాదయ్య, కొన్నింటి సాయిరాం, రంగంపల్లి శశాంకం గౌడ్ ఈ సందర్భంగా ప్రమాణస్వీకారం చేశారు. భారీ ఎత్తున జరిగిన ఈ ప్రమాణ స్వీకార మహోత్సవంలో గ్రామ పెద్దలు మాజీ ఎంపీపీ చల్లా వెంకటేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఎర్రోళ్ల సుజాత, లక్ష్మయ్య, మాజీ ఉప సర్పంచ్ నరేందర్ రెడ్డి, అప్పన్న గారి భాస్కర్ రెడ్డి, భూపతి రెడ్డి, రంగంపల్లి రమేష్ గౌడ్, ఫకీర్ భాష, లక్ష్మీకాంత్ రెడ్డి, ఖదీర్, గంటల శంకరయ్య, పరమేష్, రంగంపల్లి బాలరాజు గౌడ్, హరికృష్ణ యాదవ్, సామల వెంకటయ్య బక్కని శీను, ఎర్రోళ్ల రామకృష్ణ, బక్కని రమేష్, చంద్రశేఖర్, షాబాద్ శంకరయ్య,, బక్కని కృష్ణయ్య, దాదేమియా, సుధాకర్, లావని అశోక్, నరేష్, దేవా, అరుణ్ కుమార్, బస్తపురం అంజయ్య, బస్తాపురం రమేష్, వివిధ పార్టీల నాయకులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రహసనంగా ప్రజావాణి

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: ప్రజావాణి ప్రహసనంగా మారిందని, ఇచ్చిన ఫిర్యాదులకు పరిష్కారం చూపకపోగా చెత్త బుట్టల పాలు చేస్తున్నారేమో అనే అనుమానం కలుగుతుందని 'జనం కోసం' అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కరరెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. డిపార్ట్మెంట్ హెడ్లు కూడా ప్రజావాణి కి హాజరు కాకుండా ప్రజావాణిని చిన్నచూపు చూస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని డీసీని కోరారు.

హెచ్‌ఆర్‌ఏ 24శాతం పెంచాలి

విశాలాంధ్ర ప్రతినిధి- రంగారెడ్డి : జిహెచ్ఎంసికి 8 కిమీటర్ల పరిధిలో హెచ్ఆర్ఏ 24శాతం పెంచాలని టీజీవోపి ఆర్ టి యు టి ఎస్ ఉద్యోగ సంఘాల నేతలు కోరారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...విస్తరించిన జీహెచ్ఎంసీ పరిధికి చుట్టుపక్కల 8 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ప్రాంతాలకు ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని, 24శాతం ఇంటి అద్దె భత్యం (హెచ్ఆర్ఏ) మంజూరు చేయాలన్నారు. (జీఓ ఎంఎస్ నెం. 53 ఆర్థిక (హెచ్ఆర్ఎం-4) శాఖ, తేదీ: 11.06.2021) తెలంగాణ ప్రభుత్వాన్ని కోరుతూ, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్, ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పిఆర్‌టియు) టిఎస్, రంగారెడ్డి జిల్లా తరపున చంద్రారెడ్డి , అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సంగీత , డిఆర్ఓ గారి ద్వారా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ , మేజిస్ట్రేట్ కి వినతిపత్రం సమర్పించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో టీజీవో అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు డాక్టర్ కే రామారావు,పి ఆర్‌టియుటి ఎస్ రంగారెడ్డి జిల్లా శాఖ అధ్యక్ష కార్యదర్శులు సామల మహేందర్ రెడ్డి, కొనగారి కృష్ణారెడ్డి, నాలుగవ తరగతి ఉద్యోగుల ప్రెసిడెంట్ శ్రీ సుధాకర్, పెద్దమారు రాఘవేందర్, శ్రీమతి శాంతి శ్రీ, శ్రీమతి సైదమ్మ, శ్రీ రాకేష్, శ్రీ నాగేశ్వరావు, శ్రీ మసూద్ అలీ,శ్రీ జగన్మోహన్ గుప్తా ఎనిమిది మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు

ఆధునిక వసతులతో డిఎస్పీ కార్యాలయం

విశాలాంధ్ర, పటాన్ చెరువు :నియోజకవర్గ కేంద్రమైన పటాన్ చెరువు పట్టణంలో ఆధునాతన వసతులతో అత్యధిక సౌకర్యాలతో సబ్ డివిజన్ పోలీస్ కార్యాల యాన్ని నిర్మించబోతున్నట్లు పటాన్ చెరువు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్ చెరువు డివిజన్ పరిధిలోని ఎక్సైజ్ ఆఫీస్ సమీపంలో 12 కోట్ల రూపాయల సి ఎస్ ఆర్ నిధులతో 44010 చదరపు అడుగుల విస్తీర్ణంలో నూతనంగా నిర్మించ తలపెట్టిన డిప్యూటీ సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ కార్యాలయం భవన నిర్మాణ పనులకు సోమవారం ఉదయం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ కలిసి శంకుస్థాపన చేశారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా భవిష్యత్తు అవసరా లకు అనుగుణంగా ఆధునిక వసతులతో విశాలమైన గదులతో 44 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో సెల్లార్, జి ప్లస్ టు అంతస్తులతో కార్యాలయాన్ని నిర్మించబోతున్నట్లు తెలిపారు. జాతీయ రహదారి విస్తరణలో డీఎస్పీ కార్యాలయం భవనాన్ని పూర్తిగా తొలగిస్తున్న నేపథ్యంలో నూతన కార్యాలయాన్ని త్వరితిగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వస్తామని తెలిపారు. నియోజకవర్గం పరిధిలో పాత పోలీసు స్టేషన్ భవనాల స్థానంలో నూతన భవనాలు నిర్మించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ ఎంపీపీలు శ్రీశైలం యాదవ్, యాదగిరి యాదవ్, దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు శంకర్ యాదవ్, సపాన దేవ్, గూడెం మధుసూదన్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి, పాండు, నరసింహ రెడ్డి, శ్యామ్ రావు, అంతి రెడ్డి. నర్రా బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

బోరుకు మరమ్మతులు

విశాలాంధ్ర, మల్కాజిగిరి : బాలసరస్వతినగర్ కాలనీలో గత నాలుగు సంవత్సరాల నుంచి బోర్ పాడవడం వల్ల కాలనీ వాసులకు చాలా ఇబ్బందులు కలగడంతో ఈ విషయాన్ని మాజీ కార్పొరేటర్ నిరుగొండ జగదీష్ గౌడ్ దృష్టికి తేవడంతో అ బోర్‌కి మరమత్తులు చేయించి కాలనీ వాసులతో పూజ చేసి ప్రారంభం చేయడం జరిగింది. దానికి కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే కాలనీ వాసులతో సమస్యల గురించి అడిగి తెలుసుకోవడం జరిగింది. కాలనీ వాసులు కృష్ణ యాదవ్, శకుంతల, కమలమ్మ, లలిత, రేణుకా, సువర్ణ, లలితమ్మ, శాలిని, సన్నీ యాదవ్, శంకర్ రావు, రఘు బాబు, లక్ష్మయ్య, నర్సింహ చారి, మోహన్ రావు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, లక్ష్మణ్ రావు, రాములు, సతీష్, సుధా, శ్రీకాంత్, కాలనీ వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మైనంపల్లి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర, మల్కాజిగిరి : మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు మల్కాజిగిరి నియోజకవర్గంలోని వాణి నగర్‌లో విజయ వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ స్థలంలో మఠం నిర్మాణానికి ఎండోమెంట్ కమిషనర్‌తో మాట్లాడి ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. వాణి నగర్‌లోని రోడ్డు, డ్రైనేజీ పైప్ లైన్ సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కోరగా జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్, వాటర్ వర్క్స్ అధికారులతో ఫోన్లో మాట్లాడి సంబంధిత పనికి నిధులను మంజూరు చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో నక్క ప్రభాకర్ గౌడ్, వెంకటేష్ యాదవ్, శ్రీనివాస్, గుండా నిరంజన్, జీడి సంపత్ గౌడ్, పార్థసారథి ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్యాటరాక్ట్ సర్జరీ మెషీన్‌ను వితరణ

హైదరాబాద్ : హైదరాబాద్ మావెరిక్స్ రోటరీ క్లబ్ సౌజన్యంతో, ఎన్ఎండీసీ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) పరిధిలో రూ. 26 లక్షల విలువ చేసే అత్యాధునిక క్యాటరాక్ట్ సర్జరీ మెషీన్‌ను ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌లోని కంటి ఆసుపత్రి విభాగానికి అందచేసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రాకేష్ సహాయ్, ఉస్మానియా మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డా. రాజారావు, కంటి ఆసుపత్రి విభాగాధిపతి డా. అతుల్ గుప్తా, NMDC CSR జనరల్ మేనేజర్ (పి. శ్యామ్, రోటరీ డిస్ట్రిక్ట్ సెక్రటరీ శ్రీ. బిబో శ్రీనివాస్ , హైదరాబాద్ మావెరిక్స్ రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ డా. సురేష్ బాబు, సభ్యులు డా. ఎన్‌కే నందా, పి. వనశ్రీ, డి. లక్ష్మీనారాయణ, శేఖర్ గోగినేని, సీతా ఆనంద్, అజయ్ కుమార్, డా. భరత్ కుమార్ మరియు ఉస్మానియా మెడికల్ కాలేజ్ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. ఈ అత్యాధునిక సాంకేతిక పరికరం ద్వారా, ఉస్మానియా ఆసుపత్రిలో కంటి చికిత్స సేవలు మరింత మెరుగవుతాయి, ప్రత్యేకించి పేద మరియు అవసరంలో ఉన్న రోగులకు ఉచిత/సబ్సిడీ కంటి శస్త్రచికిత్సలు అందుబాటులోకి వస్తాయి. ఎన్ఎండీసీ, హైదరాబాద్ మావెరిక్స్ రోటరీ క్లబ్ ఈ సహకారం ద్వారా ప్రాంతీయ ఆరోగ్య సంరక్షణను మెరుగుపరచడంలో తమ నిబద్ధతను చాటుకున్నారు.

ఉపాధికి తూట్లు పొడిచిన మోదీ

- దేశ వ్యాప్తంగా వామపక్షాల నిరసన
- ఎంఎన్ఆర్ఈజీఏ యథాతథంగా కొనసాగించాలని డిమాండ్
- జిల్లా మెజిస్ట్రేట్‌ల ద్వారా రాష్ట్రపతికి వినతి పత్రాలు

న్యూఢిల్లీ: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంఎన్ఆర్ఈజీఏ) ను నిర్వీర్యం చేస్తున్న మోదీ సర్కార్ చర్యలను వామపక్ష పార్టీలు తీవ్రంగా నిరసించాయి. ఎంజీఎన్ఆర్ఈజీఏ ను కాపాడేందుకు వామపక్ష పార్టీలు దేశ వ్యాప్తంగా సోమవారం నిరసన కార్యక్రమాలు నిర్వహించాయి. ఉపాధి పథకానికి బడ్జెట్ కోతలు, కొత్త నిబంధనలను వ్యతిరేకిస్తూ రాష్ట్రపతికి వినతి పత్రాన్ని కూడా పంపించాయి. ఉత్తర ప్రదేశ్ వ్యాప్తంగా సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్), ఇతర వామపక్షాలు ఉధృత ఆందోళనలు నిర్వహించాయి. లక్నోలో వామపక్ష కూటమి భారీ నిరసన ప్రదర్శన నిర్వహించాయి. జాతిపిత మహాత్మా గాంధీ పేరును తొలగించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఎంజీఎన్ఆర్ఈజీఏ ప్రధాన స్ఫూర్తిని బలహీనపరుస్తోందని నిరసనకారులు విమర్శించారు. ఈ సందర్భంగా జిల్లా మెజిస్ట్రేట్ ద్వారా రాష్ట్రపతికి ఒక వినతి పత్రం సమర్పించారు. మధురలో కూడా వీబీ-రామ్ జీ బిల్లును వ్యతిరేకిస్తూ వామపక్ష పార్టీల జిల్లా నాయకత్వం సోమవారం జిల్లా మెజిస్ట్రేట్ ద్వారా వినతి పత్రం సమర్పించింది. ఇందులో ఎంజీఎన్ఆర్ఈజీఏను భారత గణతంత్రం ముఖ్యమైన విజయంగా అభివర్ణించాయి. యూపీఏ ప్రభుత్వ హయాంలో వామపక్షాల మద్దతుతో అమలు చేయబడిన ఈ చట్టం గ్రామీణ ప్రజలకు 100 రోజుల ఉపాధిని అందించడం ద్వారా పని హక్కుకు సంబంధించి రాజ్యాంగ భావనను బలపరుస్తుందని వారు తెలిపారు. అయితే ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వం ఈ చట్టాన్ని నిరంతరం బలహీనపరుస్తుందని, దాని బడ్జెట్‌ను తగ్గిస్తుందని ఆరోపించాయి. ప్రతిపాదిత కొత్త నిబంధనల ప్రకారం, ఎంజీఎన్ఆర్ఈజీఏ ఖర్చులో 40 శాతం రాష్ట్ర ప్రభుత్వాలపై భారం పడుతుందని విమర్శించాయి. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీలో రాష్ట్రాల న్యాయమైన వాటాను కూడా సకాలంలో విడుదల చేయడం లేదని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. గ్రామీణ ఉపాధిని తొలగించడానికి, ఎంజీఎన్ఆర్ఈజీఏను క్రమం రద్దు చేయడానికి కుట్రగా పార్టీలు అభివర్ణించాయి. రాష్ట్రపతి జోక్యం, వీబీ-రామ్ జీ బిల్లును తిరస్కరించడం, ఎంజీఎన్ఆర్ఈజీఏ ను పూర్తిగా అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ వినతి పత్రంపై సీపీఐ జిల్లా అధ్యక్షుడు ఉత్కర్ష్ చతుర్వేది, సీపీఎం జిల్లా అధ్యక్షుడు తికేంద్ర సింగ్ షాద్, సీపీఐ(ఎంఎల్) జిల్లా అధ్యక్షులు యాకుబ్ షా సంతకం చేశారు. అలాగే భదోహిలో సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్), ఫార్వర్డ్ బ్లాక్ కార్యకర్తలు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వామపక్ష పార్టీ సీనియర్ నాయకుడు ఇంద్రదేవ్ పాల్ మాట్లాడుతూ ఎంఆర్ఈజీఏ కోట్లాది మంది వ్యవసాయ కార్మికులకు పని హామీ ఇస్తుందని అన్నారు. ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వం ఎంజీఎన్ఆర్ఈజీఏను రద్దు చేయడానికి పార్లమెంటులో వీబీ-రామ్ జీ బిల్లు ప్రవేశపెట్టిందని, దీనికి ఎంజీఎన్ఆర్ఈజీఏ 'హత్య' గా ఆయన అభివర్ణించారు. బస్తీలో ఎంజీఎన్ఆర్ఈజీఏలో మార్పులకు వ్యతిరేకంగా వామపక్షాలు నిరసన వ్యక్తం చేశాయి. ఈ విషయంలో రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలని కోరాయి. సీపీఐ, సీపీఎం కార్యకర్తలు కలెక్టరేట్‌కు చేరుకుని జిల్లా మెజిస్ట్రేట్ ద్వారా రాష్ట్రపతికి వినతి పత్రం సమర్పించారు. ఎంజీఎన్ఆర్ఈజీఏను 'విధ్వంసం' చేసే సవరణలను ఆమోదించబోమని తెలిపారు. ఉపాధి పథకానికి పేరు మార్చడంతో సహా అన్ని ప్రతిపాదిత సవరణలను ఉపసంహరించుకోవాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. ప్రస్తుత ఎంజీఎన్ఆర్ఈజీఏ చట్టాన్ని కొనసాగించాలని, 100 రోజుల ఉపాధి హామీని 365 రోజులకు పొడిగించాలని, పట్టణ ప్రాంతాలను దాని పరిధిలోకి చేర్చాలని కూడా వారు డిమాండ్ చేశారు. అంతేకాకుండా కనీస వేతనాన్ని రోజుకు రూ.800 కు పెంచాలని, ఉపాధి పథకంలో శారీరక శ్రమతో పాటు మేధో శ్రమను కూడా చేర్చాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి అష్రఫీ లాల్, వామపక్ష నాయకులు కె.కె.త్రిపాఠి, రామ్ లౌత్, శేష మణి, బల్వంత్, కుసుమ్, గుడియా, రాంజీ, రాందయాళ్ పాల్గొన్నారు.

సామాన్యుల్ని దోచుకోవడమే మోదీ సర్కారు పని

రైల్వే చార్జీల పెంపుపై ఖర్గే ఆగ్రహం

న్యూఢిల్లీ: సామాన్య ప్రజలను దోచుకోవడానికి మోదీ ప్రభుత్వం ఏ అవకాశాన్నీ వదలడం లేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇందుకు రైల్వే చార్జీలను పెంచడమే నిదర్శనమన్నారు. రైలు చార్జీల పెంపు సామాన్య ప్రజలపై భారం మోపిందని ఖర్గే అన్నారు. రైల్వేలు ప్రస్తుతం నిర్లక్ష్యం, ఉదాసీనత, నకిలీ ప్రచారానికి గుర్తుగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ప్రత్యేక రైల్వే బడ్జెట్‌ను రద్దు చేసినప్పటి నుండి రైల్వేలలో జవాబుదారీతనం తగ్గిపోయిందని, ప్రస్తుతం దిగజారుతున్న రైల్వే పరిస్థితిని పరిష్కరించడం కంటే కేంద్ర ప్రభుత్వం ప్రచారంపైనే దృష్టి పెట్టిందని ఖర్గే దుయ్యబట్టారు. కేంద్ర బడ్జెట్‌కు కొద్ది రోజుల ముందు చార్జీలు పెంచడం దారుణమని, ఇది ఏడాదిలో రెండోసారి చేసిన పెంపు అని గుర్తు చేశారు. రైల్వే భద్రతపైనా ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. రైలు ప్రయాణం ఇప్పుడు సురక్షితం కాదని, అది ప్రాణాలతో చేసే జూదంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్‌సీఆర్‌బీ గణాంకాల ప్రకారం, 2014 నుంచి 2023 మధ్య కాలంలో రైలు ప్రమాదాల్లో ఏకంగా 2.18 లక్షల మంది మరణించారని గుర్తు చేశారు. 'కవచ్' భద్రతా వ్యవస్థ గురించి ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందని, కానీ ఆచరణలో అది శూన్యమని విమర్శించారు. ఐదేళ్లుగా ప్రచారం చేస్తున్నా, కేవలం 3 శాతం రూట్లలో, 1 శాతం రైళ్లలో మాత్రమే కవచ్ అందుబాటులో ఉందని తెలిపారు. రైల్వేలో ఖాళీలు, అభివృద్ధి పనులపైనా ఖర్గే విమర్శలు గుప్పించారు. రైల్వేలో 3.16 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. యువత శాశ్వత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తుంటే... ప్రభుత్వం మాత్రం కాంట్రాక్టు నియామకాలను పెంచుతోందని ఆరోపించారు. 'అమృత్ భారత్' పథకం కింద 453 స్టేషన్లను అభివృద్ధి చేస్తామని చెప్పి, ఇప్పటివరకు కేవలం ఒక్క స్టేషన్‌ను మాత్రమే పూర్తి చేశారని ఎద్దేవా చేశారు. ఇది అభివృద్ధి పేరుతో జరుగుతున్న క్రూరమైన పరిహాసమని వ్యాఖ్యానించారు. రైల్వే ఆర్థిక నిర్వహణపైనా ఖర్గే ప్రశ్నల వర్షం కురిపించారు. కాగ్ నివేదిక ప్రకారం రైల్వే రూ. 2,604 కోట్ల నష్టాల్లో ఉందని తెలిపారు. సీనియర్ సిటిజన్లకు రాయితీలు ఎత్తివేసి వృద్ధ ప్రయాణికుల నుంచి అదనంగా రూ. 8,913 కోట్లు వసూలు చేశారని మండిపడ్డారు. వందే భారత్ రైళ్లు గంటకు 160 కి.మీ వేగంతో వెళ్తాయని ప్రచారం చేసుకుంటున్నా, వాస్తవానికి సగటున 76 కి.మీ వేగంతోనే నడుస్తున్నాయని విమర్శించారు. రీల్స్ కోసం స్టంట్లు చేయడం తప్ప క్షేత్రస్థాయిలో పనితీరు లేదన్నారు.

యువత కోసమే పార్టీ పెట్టా

ఓడిపోయినా నిలబడినందుకే పదవులు

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

విశాలాంధ్ర-మంగళగిరి: యువతకు సరైన వేదికగా మారాలనే పార్టీ పెట్టానని జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. జనసేన నుంచి నామినేటెడ్ పదవులు పొందిన వారితో 'పదవి-బాధ్యత' కార్యక్రమం మంగళగిరి సీకే కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించారు. జనసేన ప్రజాప్రతినిధులు, నామినేటెడ్ పదవులు పొందిన నేతలు హాజరైన ఈ కార్యక్రమంలో పవన్ మాట్లాడుతూ "పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారిని గుర్తించి గౌరవించాం. ఎన్నికల్లో ఓడిపోయినా కొందరు పార్టీ కోసం బలంగా నిలబడ్డారు. మరో 60 మంది జనసేన నేతలకు పదవులు ఇవ్వాలని ప్రతిపాదనలు పంపాం. అనేక సామాజికవర్గాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేశాం. రెల్లి సామాజికవర్గానికీ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల వారికీ అవకాశాలు ఇచ్చాం. బాలినేని అనేక ఇబ్బందులు పడ్డారు, నిజమైన రాజకీయ నాయకుడు ఆయన. పోలీసులు కొడుతున్నా పార్టీ జెండా వదలని మహిళకు పదవి ఇచ్చాం. సామాజిక మాధ్యమాల్లో స్వచ్ఛందంగా పనిచేసే వారికి అండగా ఉన్నాం. ఎన్నికల్లో ఓడిపోయినా కొందరు పార్టీ కోసం బలంగా నిలబడ్డారు. అందుకే మీ అందరికీ పదవులు వచ్చాయి. మనం ఏం పని చేసినా రాజ్యాంగానికి లోబడే పని చేయాలి. యువతకు సరైన వేదికగా మారాలనే పార్టీ పెట్టా. కొత్త పంథాను నమ్ముకుని అనేకమంది యువత నక్సల్స్‌లో చేరారు. సిద్ధాంతాలు వదల్లేక వేలమంది యువత చనిపోయారు. ఐడియాలజీ సరైంది కాకుంటే అనేక ఇబ్బందులు వస్తాయి. అందరూ కలిస్తేనే సమాజం తయారైందని తెలుసుకోవాలి. కూర్చోబెట్టి ఊకదంపుడు ఉపన్యాసాలు చేయడం వృథా. ప్రతి వంద కిలోమీటర్లకు మన భాష, అలవాట్లు, ఆచారాలు మారిపోతున్నాయి. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు అనేక చర్యలు చేపడుతున్నాం. దురాశతో పర్యావరణానికి తీవ్రంగా నష్టం చేస్తున్నాం. పర్యావరణాన్ని పరిరక్షించే అభివృద్ధి జరగాలని కోరుతున్నాం" అని పవన్ కల్యాణ్ తెలిపారు. ఏ పదవినీ తక్కువగా భావించరాదని, మీ పనితీరుపైనే భవిష్యత్ ఆధారపడి ఉందన్నారు. "సమాజంపై ఎంతో కోపం ఉండటం వల్లే యువత అడవుల్లోకి వెళ్లారు. ప్రజాస్వామ్య పాలనలో నిజాయతీ, చిత్తశుద్ధి, పారదర్శకత ఉండాలి. కొందరు నేతలు రౌడీలకు అండగా ఉండే పరిస్థితికి వచ్చేశారు. చిన్న చిన్న పొరపాట్లు సరిదిద్దుకుంటూ ముందుకెళ్లాలి. త్యాగాలు చేసేవారిని అందరూ గుర్తుంచుకోవాలి. అనేక భాషాప్రయుక్త రాష్ట్రాలకు మూలపురుషుడు పొట్టి శ్రీరాములు. మహనీయుడు అంబేద్కర్‌కు కూడా కులం ఆపాదించడం సరికాదు"అని పవన్ కల్యాణ్ వెల్లడించారు.

సీపీఐ బలోపేతానికి అలుపెరగని కృషి

పార్టీ శ్రేణులకు ఈశ్వరయ్య పిలుపు

విశాలాంధ్ర-ఉండి: వందేళ్ల భారత కమ్యూనిస్టు పార్టీ పోరాట, ఉద్యమ స్ఫూర్తితో నూతన ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య అన్నారు. పేదల వాణిని వినిపించడానికి మనం చట్ట సభల్లోకి వెళ్లాలని...ప్రభుత్వాలను శాసించే స్థాయికి చేరుకోవాలని...ఈదిశగా పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేయాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా సమితి సమావేశం సోమవారం ఉండిలో జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్యతో పాటు జిల్లా ఇంచార్జి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పెన్మత్స దుర్గాభవానీ విచ్చేశారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ పార్టీ వందేళ్ల చరిత్రలో పేదల పక్షాన నిలబడి భూసంస్కరణలు, పేదలకు భూముల పంపిణీ, పక్కా ఇళ్లు... ఇలా ఎన్నో సాధించామని తెలిపారు. స్వతంత్రభారత చరిత్రలో చట్ట సభల్లో కమ్యూనిస్టు ప్రతినిధులు ఎన్నో సంక్షేమ పథకాలు, నవరత్నాల అంకురార్పణకు, దేశాభివృద్ధికి బాటలు వేశారని తెలిపారు. బీజేపీకి దేశానికి మేలు చేసిన చరిత్ర లేదని దుయ్యబట్టారు. వికసిత్ భారత్ అంటున్న ప్రధాని మోదీ... రూపాయి విలువ కనీవినీ ఎరగని రీతిలో పడిపోయిందని, పేదల కొనుగోలు శక్తి, జీవన ప్రమాణాలు ఎందుకు పెరగలేదో సమాధానం చెప్పాలని ఈశ్వరయ్య నిలదీశారు. కూలీలు, శ్రామికులు, రైతులు దేశ సంపద సృష్టిస్తుంటే దాన్ని అదానీ, అంబానీలకు మోదీ దోచిపెడుతున్నారని మండిపడ్డారు. బేటీ బచావో అంటున్న మోదీ...మణిపూర్‌లో మహిళలపై ఊచకోత జరిగితే ఎక్కడున్నారని ఆయన ప్రశ్నించారు. కుల, మత ప్రాంతీయ విద్వేషాలు రేపుతున్న మోదీ... హిందూ దేవుళ్లను, పండుగలను కూడా రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటున్నాడని ఎద్దేవా చేశారు. కమ్యూనిస్టులు చేసిన కృషి ఫలితంగా ఉపాధి హామీ వస్తే దాన్ని పేరు మార్చి నిర్వీర్యం చేయడమే కాకుండా మహాత్మా గాంధీ పేరు లేకుండా చేయడం శోచనీయమన్నారు. సీపీఐ వందేళ్ల పండుగ ముగింపు ఉత్సవాలను ఈనెల 19 నుంచి 26 వరకు ఘనంగా నిర్వహించాలని, ఒక్కోశాఖ వంద మొక్కలు నాటి... వాటిని సంరంక్షించి... పర్యావరణ పరిరక్షణలో భాగం పంచుకోవాలని పిలుపునిచ్చారు. జనవరి 18న ఖమ్మంలో జరిగే సీపీఐ శతవసంతోత్సవ ముగింపు వేడుకలకు జిల్లా నుంచి వేలాదిగా తరలి రావలని ఆయన కోరారు. పెన్మెత్స దుర్గాభవాని మాట్లాడుతూ సీపీఐ శత వసంతాల స్ఫూర్తితో ప్రజా సమస్యలపై బలమైన ఉద్యమాలు నిర్మించాలని, పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని పిలుపునిచ్చారు. సీపీఐ తరపున ఎన్నో భూ పోరాటాలు, ప్రజా ఉద్యమాలు నిర్మించిన ఘనత జిల్లా సొంతమని కొనియాడారు. బీజేపీ పరివారం రాజ్యాంగాన్ని మార్చేస్తున్నారని... చట్టాలను తిరగరాస్తున్నారని... మత విద్వేషం రగిలిస్తున్నారని మండిపడ్డారు. ఎలక్షన్ కమిషన్, ఐటీ, ఈడీ, సీబీఐ, చివరికి న్యాయ వ్యవస్థను కూడా గుప్పిట్లో పెట్టుకుని ఆడిస్తున్నారని దుయ్యబట్టారు. సభకు అధ్యక్షత వహించిన జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ పేదలకు ఉపాధి కల్పించే చట్టం నిర్వీర్యం చేస్తున్న పాలకులకు బుద్ధి చెప్పాలన్నారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాలు స్ఫూర్తితో మరిన్ని పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి పి సుందర రామరాజు తదితరులు ప్రసంగించారు. తొలుత ఉండి సీపీఐ ఏరియా కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు పార్టీ జెండాను ఆవిష్కరించి, సభకు స్వాగతం పలుకగా... అమర్ వీరులకు, మృత వీరులకు సభ మౌనం పాటించి సంతాపం తెలిపింది. ప్రజానాట్యమండలి కళాకారులు ఆలపించిన గేయాలు స్ఫూర్తి రగిలించాయి. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, ఎం.సీతారాం ప్రసాద్, సనపల శ్రీను, బొద్దాని నాగరాజు, మండల నాగేశ్వరరావు, చెల్లబోయిన రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

పందేనికి 'సై'

- కాలుదువ్వుతున్న కోడి
- శిక్షణలో ఆరితేరి... శత్రుసంహారానికి సిద్ధం
- బరిలో దూకేందుకు ఆతృత
- బ్రెజిల్, పెరూ దేశాల పుంజులకు డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో- కాకినాడ: సంక్రాంతి పండుగ కొద్ది రోజుల్లో రానుంది. ప్రతి ఏడాది జనవరి 14, 15, 16 తేదీల్లో మూడు రోజుల పాటు తెలుగు లోగిళ్లలో అత్యంత ఘనంగా నిర్వహించుకునే పెద్ద పండుగ ప్రధాన ఆకర్షణ కోడి పందేలు. మరో మూడు వారాల్లో నిర్వహించే సంక్రాంతి కోడి పందేలకు నాలుగు నెలల ముందు నుంచే పెంపకందారులు ప్రణాళికలు రచిస్తూ ఉంటారు. దసరా నుంచి పందెం పుంజులకు ప్రత్యేక ఆహారం అందించడం ప్రారంభిస్తారు. బాదం, పిస్తా వంటి డ్రై ఫ్రూట్స్‌తో తయారు చేసిన ఆహారాన్ని ప్రతీ రోజు ఉదయం జాతికోళ్లకు అందిస్తారు. వేట మాంసం ఖైమా కూడా పందెం పుంజుల స్పెషల్ డైట్‌లో ఒక భాగం. నాటు కోడి గుడ్లను కూడా కొందరు పందెం పుంజులకు ఇచ్చే ఆహారంలో చేరుస్తారు. ఇలా దసరా నుంచి ప్రణాళికాబద్ధంగా ప్రారంభం అయ్యే డైట్ భోగి, సంక్రాంతి, కనుమ రోజు వరకు అందిస్తారు. మూడు నెలల పాటు బలవర్ధకమైన ఆహారం పెట్టడం వల్ల పుంజులు బలంగా పెరుగుతాయని చెబుతారు. అయితే వాటిని పందెం బరిలో పోరాడేందుకు ఇచ్చే ప్రత్యేకమైన శిక్షణ డిసెంబరు మాసంలో ప్రారంభిస్తారు. పందెం పుంజుల శిక్షణపై ప్రత్యేకమైన శ్రద్ధ వహిస్తారు. కొన్ని రకాల ఆకులతో నీటిని మరిగించి ఆ నీటితో పందెం పుంజులకు స్నానం చేయిస్తారు. ఈ ప్రక్రియను నీళ్లపోతలు అని పుంజుల పెంపకందారులు చెబుతారు. జామాయిల్, జామ, కుంకుడు, వేప, వెదురు వంటి 16 రకాల ఆకులను నీటిలో మరిగించేందుకు వినియోగిస్తారు. దీని వల్ల కోడి పుంజుల శరీరం గట్టి పడటంతో పాటు వేగం పెరుగుతుందని వారు చెబుతారు. కోళ్లల్లో శక్తిని పెంచేందుకు వాటిని ఈత కొట్టించడం కూడా ప్రత్యేక శిక్షణలో ఒక భాగం అని అంటారు. ఇలా శిక్షణ ఇచ్చిన కోళ్లకు వారి స్థావరంలోనే ట్రయిల్ పందెం నిర్వహించి దాన్ని బలాన్ని అంచనా వేస్తారు. సమ ఉజ్జీపై ఆ కోడిని అసలు పందెం బరిలో దింపుతారు. వాడుక భాషలో పందెం పుంజు అని వ్యాఖ్యనించినా కాకి, డేగ, నెమలి, కక్కిరాయి, సవల, రసంగి ఇలా సుమారు 20కి పైగా రకాల పుంజులు ప్రస్తుతం పెంపకందారుల వద్ద ఉన్నాయి. ఇదిలా ఉండగా... బ్రెజిల్, పేరూ దేశాల కోళ్లకు మన సంక్రాంతి పందెం బరిలో మంచి డిమాండ్ ఉంది. విదేశీ కోళ్లతో ఈ ప్రాంత కోళ్లను క్రాస్ చేయించి ఇప్పటికే కొన్ని కొత్త తరహా బ్రీడ్‌లను సైతం పెంపకందారులు విక్రయిస్తున్నారు. వీటికి పేరూ క్రాస్, బ్రెజిలియన్ క్రాస్ అని పేర్లు పెడుతున్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే కోడి పందెల్లో రూ.లక్షల్లో చేతులు మారుతుంటాయి. బరిలో దూకేందుకు పందెం పుంజులు ఎదురు చూస్తున్నాయి. తథాకా చూపేందుకు కాలు దువ్వుతున్నాయి. ప్రత్యేకంగా గోదావరి జిల్లాల్లో నిర్వహించే కోడి పందేలను వీక్షించేందుకు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలతో పాటు దేశ విదేశాల్లో స్థిర పడిన ప్రజల రావడం ప్రతీ ఏటా పెరుగుతుండడం చెప్పుకోదగ్గ విషయం.

విశాలాంధ్ర జాతీయ దినపత్రిక

సీనియర్ జర్నలిస్టులు, ట్రైనీ సబ్ ఎడిటర్లు కావలెను

74 సంవత్సరాల చరిత్ర కలిగిన విశాలాంధ్ర జాతీయ దినపత్రికలో పని చేయడానికి సీనియర్ జర్నలిస్టులు, ట్రైనీ సబ్ ఎడిటర్లు కావాలి.

సీనియర్ జర్నలిస్టులు

సీనియర్ జర్నలిస్టులకు అనుభవానికి తగిన వేతనం ఇవ్వబడును. ఆసక్తిగలవారు నేరుగా విశాలాంధ్ర ప్రధాన కార్యాలయం, చంద్రం బిల్డింగ్స్, విజయవాడలో 2025 డిసెంబరు 27వ తేదీ ఉదయం 10 గంటలకు హాజరుకావలెను. వారికి రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఉంటుంది.

ట్రైనీ సబ్ ఎడిటర్లు

అర్హతలు : తెలుగులో రాయగల నేర్పు, ఆంగ్లభాషపై అవగాహన కలిగి ఉండాలి. లోకజ్ఞానం, వర్తమాన వ్యవహారాలపై పట్టు, ప్రజల సంక్షేమం కోసం పాటుపడాలన్న తపన, పాత్రికేయ రంగం పట్ల ఆసక్తి కలిగి ఉండాలి. జనవరి 1, 2026 నాటికి 30 ఏళ్ళ వయసు మించనివారై, డిగ్రీ ఉత్తీర్ణత కలిగిన వారై ఉండాలి.

ట్రైనీ సబ్ఎడిటర్లకు శిక్షణకాలంలో మొదటి సంవత్సరం రూ. 14,000, ఆ తర్వాత ప్రొబేషన్ పీరియడ్‌లో రూ. 15,000 చొప్పన నెలవారీ భృతి ఇవ్వబడును. అనంతరం ప్రతిభ ఆధారంగా వేతనం నిర్ణయించబడును. దరఖాస్తును e-mail : editorvisalaandhra2026@gmail.com మెయిల్‌కు, లేదా ఈ క్రింది చిరునామాకు ఫొటోతో సహా పంపించవలెను.

చిరునామా : ఎడిటర్, విశాలాంధ్ర జాతీయ దినపత్రిక, చంద్రం బిల్డింగ్స్, చంద్ర రాజేశ్వరరావు రోడ్డు, చుట్టుగుంట, విజయవాడ - 520004,
వివరాలకు ఫోన్ నెంబర్ : 9590952106, 7997014006
e-mail : editorvisalaandhra2026@gmail.com

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.